శుక్రవారం 25-8-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 155

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'




ప్రశంసలు ప్రజ్ఞానందకు..

ప్రపంచకప్ చెస్ ఫైనల్లో కార్ల్‌సన్ చేతిలో ఓడినా ఆకట్టుకున్న ప్రజ్ఞానంద -13లో



రాజూ బంటూ అమ్మే


ప్రజ్ఞానందకు రాజుగా, బంటుగా ఉంటూ తీర్చిదిద్దిన తల్లి నాగలక్ష్మి -11లో



విమాన ప్రమాదంలోనే మృతి..

వాగ్నర్ గ్రూప్ అధినేత యెవ్‌గెనీ ప్రిగోజిన్ విమాన ప్రమాదంలో మృతిచెందారని రష్యా పౌర విమానయాన సంస్థ ధ్రువీకరించింది.

వివరాలు 6లో ▸



బ్రిక్స్‌లోకి మరో ఆరు దేశాలు

బ్రిక్స్ కూటమిలోకి అర్జెంటీనా, ఈజిప్టు, సౌదీ, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ చేరినట్టు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా ప్రకటించారు.

వివరాలు 6లో ▸



పసిఫిక్‌లోకి అణు జలాల విడుదల

ఫ్యుకుషిమా అణుప్లాంట్ నుంచి వ్యర్థ జలాలను జపాన్ పసిఫిక్ సముద్రంలోకి విడుదల చేసింది. దీన్ని పలు దేశాలు ఖండించాయి.

వివరాలు 6లో ▸



హిమాచల్‌ను వీడని వానలు

మరోసారి వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపిలేని వానలతో కొండచరియలు విరిగిపడి ఎనిమిది భవనాలు కుప్పకూలాయి.

వివరాలు 6లో ▸

తగ్గేదే లే

తెలుగు సినిమాకు పది అవార్డులు

జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్



తొలిసారిగా తెలుగు నటుడికి

- జాతీయ సినిమా అవార్డులు-2021 ప్రకటన
- అత్యధికంగా ఆర్‌ఆర్‌ఆర్‌కు 6 పురస్కారాలు
- ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'ఉప్పెన'
- ఫిల్మ్ క్రిటిక్‌గా పురుషోత్తమాచార్యులు
- గతంలో 'దాసి' చిత్రానికి అత్యధికంగా 5 అవార్డులు.. ఈసారి డబుల్ ధమాకా
- ఏపీ సీఎం సహా ప్రముఖుల అభినందనలు

తెలుగు సినిమా.. ఎత్తర జెండా 12లో



ఆర్‌ఆర్‌ఆర్ ▼ ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం



కీరవాణి ▼ ఉత్తమ నేపథ్య సంగీతం (ఆర్‌ఆర్‌ఆర్)



దేవిశ్రీ ప్రసాద్ ▼ ఉత్తమ సంగీతం (పుష్ప)



చంద్రబోస్ ▼ ఉత్తమ గీత రచయిత (కొండపొలం)



కాలభైరవ ▼ ఉత్తమ నేపథ్య గాయకుడు (ఆర్‌ఆర్‌ఆర్)



ప్రేమ్ రక్షిత్ ▼ ఉత్తమ కొరియోగ్రఫీ (ఆర్‌ఆర్‌ఆర్)

శ్రీనివాస్ మోహన్ స్పెషల్ ఎఫెక్ట్స్

కింగ్ సాల్మన్ యాక్షన్ డైరెక్టర్ (ఆర్‌ఆర్‌ఆర్)

6,612 టీచర్ పోస్టుల భర్తీ

- డీఎస్సీల ద్వారా నియామకాలు: విద్యాశాఖ మంత్రి సబిత
- 5,089 జనరల్ టీచర్, 1,523 స్పెషల్ టీచర్ ఉద్యోగాలు
- వచ్చే నెల 15న మరో 'టెట్' పరీక్ష.. 27న ఫలితాలు
- ఆ వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం
- రెండు రోజుల్లో మార్గదర్శకాల జారీ ఉంటుందని వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి సబితారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. త్వరలోనే టీచర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని విద్యా శాఖ మంత్రి పి.సబితారెడ్డి వెల్లడించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఆమె గురువారం ఎస్‌సీఈఆర్‌టీ సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడారు. ''రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేరుగా భర్తీ చేసేందుకు 6,612 ఖాళీలు ఉన్నాయి. వాటిలో 5,089 పోస్టులు సాధారణ పాఠశాలల్లో, 1,523 పోస్టులు ప్రత్యేక అవసరాలుగల పిల్లల కోసం నిర్దేశించినవి. వీటిని త్వరగా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2017లో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) నిర్వహించి 8,792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. కానీ ఇప్పుడు డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ)ల ద్వారా భర్తీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనితో గతంలో నిర్వహించినట్టుగా డీఎస్సీల ద్వారా నియామకాలు చేపట్టనున్నాం..'' అని మంత్రి సబితారెడ్డి వివరించారు.

9,979 పోస్టులకు పదోన్నతులు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,22,386 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా.. వీటిలో 1,03,343 పోస్టుల్లో టీచర్లు

మిగతా 3వ పేజీలో ▶

ఖాళీల్లో మూడో వంతే భర్తీ!

ప్రభుత్వ స్కూళ్లలో 22 వేలకు పైగానే ఖాళీలు ఉన్నాయంటున్న ఉపాధ్యాయ వర్గాలు 3లో

పర్యవేక్షణ పోస్టుల ఊసేలేదు.. టీచర్లలో అసంతృప్తి

డీఈడీ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

సుప్రీం తీర్పు మేరకు ఎన్‌సీటీఈ నిర్ణయం

- వివరాలు 3లో ▶

న్యూస్‌రీల్

'చేప ప్రసాదం' బత్తిని కన్నుమూత



చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిని హరినాథ్ గౌడ్(79) కన్నుమూశారు. ఆయన 1944లో హైదరాబాద్‌లోని దూద్‌బౌలిలో జన్మించారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

- వివరాలు 5లో ▶

'ఇన్ఫోసిస్' అంబాసిడర్‌గా..



ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్‌కు, దానికే చెందిన డిజిటల్ ఇన్నోవేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా అంతర్జాతీయ టెన్నిస్ స్టార్ రఫేల్ నాదల్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈ భాగస్వామ్యం అమల్లో ఉంటుంది.

- వివరాలు 13లో ▶

కొడంగల్ సీటుకు రేవంత్ దరఖాస్తు



కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. తనకు కొడంగల్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

- వివరాలు 10లో ▶

'కృష్ణా'లో కేటాయింపులే జరగలేదు



శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నుంచి తాగునీటి అవసరాల కోసం సెప్టెంబర్ 30 వరకు ఏపీకి 26.29 టీఎంసీలు, తెలంగాణకు 6.04 టీఎంసీలను విడుదల చేయాలని కృష్ణాబోర్డు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సిఫారసు చేసినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది.

- వివరాలు 2లో ▶



ఇదండీ సంగతి



గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఎన్నిక చెల్లదు



- ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం కేసులో హైకోర్టు తీర్పు
- 2018 డిసెంబర్ 12 నుంచి డీకే అరుణనే ఎమ్మెల్యేగా పరిగణించాలని ఆదేశం
- దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తానని కృష్ణమోహన్‌రెడ్డి ప్రకటన
- ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న బీఆర్‌ఎస్‌కు ఇది చెంపపెట్టు: డీకే అరుణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో శాసనసభ్యుడి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పునిచ్చింది. జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ గురువారం తీర్పు ఇచ్చింది. ఎన్నికల్లో ఆయన తర్వాత రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణను 2018 డిసెంబర్ 12 నుంచీ ఎమ్మెల్యేగా పరిగణించాలని ఆదేశించింది. తప్పుడు ఎన్నికల అఫిడవిట్ సమర్పించిన కృష్ణమోహన్‌రెడ్డికి రూ.2,50,000 జరిమానా విధించింది. మరో రూ.50,000ను

మిగతా 10వ పేజీలో ▶



పట్నం మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై

మంత్రిగా 'పట్నం' ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై
- పాల్గొన్న సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- కొత్త మంత్రికి ఇంకా శాఖను కేటాయించని ప్రభుత్వం

10లో



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ఖమ్మం సభలో రైతు భరోసా!

- కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- 27న అమిత్ షా పాల్గొనే సభలో రైతుల సంక్షేమం కోసం చేపట్టే చర్యల ప్రకటన
- బీఆర్‌ఎస్ సర్కార్ అసమర్థ విధానాలు, వైఫల్యాలతోనే రైతన్నకు గోస

2లో

నేడు కలెక్టరేట్ల ముందు నిరసన 2లో

జాబిల్లిపై భారత్ నడక

- ల్యాండర్ నుంచి బయటకు వచ్చి పని ప్రారంభించిన 'ప్రజ్ఞాన్': 'ఇస్రో'
- దక్షిణ ధ్రువంపై 14 రోజులు పరిశోధన
- చంద్రయాన్-3 సక్సెస్‌పై ఇస్రో హర్షాతిరేకాలు



చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడిపై నిర్విఘ్నంగా అడుగుపెట్టడాన్ని ప్రస్తావిస్తూ 'చందమామపై భారత్ నడుస్తోంది' అని ఇస్రో పేర్కొంది. అది చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా నడక ప్రారంభించిందని వెల్లడించింది. ప్రజ్ఞాన్ రోవర్ ప్రయాణం పట్ల ద్రౌపదీ ముర్ము హర్షం వ్యక్తం చేస్తూ, ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. కాగా, ఇస్రో శాస్త్రవేత్తలను స్వయంగా కలిసి అభినందించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 26న బెంగళూరుకు రానున్నారు.

మనిషి మనుగడకు అవకాశం: ఇస్రో చైర్మన్ సోమనాథ్ 6లో



క్లుప్తంగా...

26న కోటి వృక్షార్చన

సాక్షి, హైదరాబాద్: స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు నేపథ్యంలో కోటి వృక్షార్చన (ఒకేరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమం)లో భాగంగా ఈనెల 26న రంగారెడ్డి జిల్లా చిల్కూరు ఫారెస్ట్‌బ్లాక్‌లో మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి మొక్కలు నాటనున్నారు. మానసిక ఉల్లాసం, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు సరికొత్త థీమ్‌తో అభివృద్ధి చేసిన ఈ పార్కు గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గండిపేట, కోకాపేట, మంచిరేవుల పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ 360 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫారెస్ట్ ట్రెక్‌పార్కును అభివృద్ధి చేసింది. ఈ పార్కులో గజీబో, వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్, రాక్ పెయింటింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. శనివారం (26న) నిర్వహించే కోటి వృక్షార్చనను విజయవంతం చేయాలని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. 26న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్దేశిత లక్ష్యం మేరకు పండుగ వాతావరణంలో మొక్కలు నాటేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్నివర్గాల ప్రజలు కోటి వృక్షార్చనలో పాల్గొని మొక్కలు నాటాలని కోరారు.

ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై కేసు విచారణ వాయిదా

కుమార్తె వివాహానికి ఓ కాంట్రాక్టర్ ఖర్చు చేశారనే ఆరోపణపై ఢిల్లీ కోర్టులో కేసు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్‌పై కేసు విచారణను ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. రజత్‌కుమార్ కుమార్తె వివాహానికి ఖర్చు ఓ కాంట్రాక్టర్ చెల్లించారని, ఆ అధికారిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం నాయకుడు గవినోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ సుబ్రహ్మణ్య ప్రసాద్ విచారించారు. రజత్‌కుమార్ తరపు న్యాయవాది తొలుత పాస్ ఓవర్ అడిగారు. అయితే, తమ ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేస్తున్నామన్న తెలంగాణ ప్రభుత్వం ఇంకా నివేదిక దాఖలు చేయలేదని పిటిషనర్ తరపు న్యాయవాది అక్షయ్‌మాన్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతివాది వాయిదా కోరుతున్నారన్న ధర్మాసనం తదుపరి విచారణ డిసెంబర్ 12కు వాయిదా వేసింది.

బీసీలు సంఘటితం కావాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు



కొల్లాపూర్ (మహబూబ్ నగర్ జిల్లా): రాజ్యాధికారంలో బహుజనులు వాటా కోసం పోరాడాల్సిన అవసరముందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం కొల్లాపూర్‌లో నిర్వహించిన బీసీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీసీలు సంఘటితం కావాలని, కులాల ప్రాతిపదికన బీసీలు విడిపోవడం వల్లే రాజ్యాధికారం చేజిక్కించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కులాలను పక్కనబెట్టి బహుజనవాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఓనమ్ ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ఓనమ్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–కొల్లాం (07121/ 07122) ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరి 28వ తేదీ రాత్రి 11.20 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 29వ తేదీ ఉదయం 10 గంటలకు కొల్లాం నుంచి బయల్దేరి 30వ తేదీ రాత్రి 12.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాచిగూడ–కొల్లాం (07044/07045) ప్రత్యేక రైలు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు కాచిగూడ నుంచి బయల్దేరి 29వ తేదీ రాత్రి 11.20 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరిగి 30వ తేదీ ఉదయం 10 గంటలకు కొల్లాం నుంచి బయల్దేరి 31రాత్రి 12.30 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

వెలాంకినికి ప్రత్యేక రైళ్లు

వెలాంకిని పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్–వెలాంకిని మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. సికింద్రాబాద్–వెలాంకిని (07125/07126) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం 8.40 గంటలకు బయల్దేరి 5వ తేదీ ఉదయం వెలాంకిని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్ 6న వెలాంకిని నుంచి రాత్రి 12.30 గంటలకు బయల్దేరి 7వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్–వెలాంకిని (07127/07128) మరో రైలు సెప్టెంబర్ 8న ఉదయం 8.40 గంటలకు బయల్దేరి 9వ తేదీ ఉదయం 8.30 గంటలకు వెలాంకిని చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 10వ తేదీ తెల్లవారుజామున 1.20 గంటలకు బయల్దేరి 11వ తేదీ తెల్లవారుజామున 1.30 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

హైదరాబాద్–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా శుక్రవారం హైదరాబాద్ నుంచి బయల్దేరాల్సిన హైదరాబాద్–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (02575)ను రద్దు చేసినట్టు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న గోరఖ్‌పూర్ నుంచి బయల్దేరాల్సిన గోరఖ్‌పూర్– హైదరాబాద్ (02576) రైలు కూడా రద్దు కానున్నట్లు వెల్లడించారు.

భారత్‌లో డేంజర్ బెల్స్



అధిక కొవ్వు, షుగర్, ఉప్పులతో కూడిన చిరుతిండితో తీవ్ర అనారోగ్యాలు..

- దేశంలో ఇలాంటి ప్రాసెస్డ్ ఫుడ్ వ్యాపారం ఏకంగా రూ.3 లక్షల కోట్లు
- ఇందులో సాల్టెడ్ స్నాక్స్ వ్యాపారమే రూ.60 వేల కోట్లు
- కిరాణా షాపుల ద్వారానే 70శాతం విక్రయాలు
- బీపీ, షుగర్ సహా దీర్ఘకాలిక రోగాల బారిన బాధితులు
- భారత్‌లో ప్రాసెస్డ్ ఫుడ్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ప్రొటీన్లు, విటమిన్లు, ఫైబర్ తక్కువగా ఉండి.. కొవ్వులు, చక్కెర, ఉప్పుశాతం అధికంగా ఉండే అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ భారతదేశాన్ని ముంచెత్తుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. అధిక కొవ్వు, చక్కెర, ఉప్పులతో కూడిన స్నాక్స్ (హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్)తో మధుమేహం, అధిక రక్తపోటు సహా పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయని హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల వినియోగం పెరుగుతుంటే.. అందుకు విరుద్ధంగా భారత్‌లో హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్ పెరుగుతుండటం మంచిది కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ది గ్రోత్ ఆఫ్ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ ఇన్ ఇండియా' అనే పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం ఒక నివేదిక విడుదల చేసింది.

అధిక కొవ్వు, కేలరీలతో..

➤ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తినడంతోపాటు శారీరక శ్రమ తక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు వస్తాయని డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక స్పష్టం చేసింది. రోజుకు సగటున 1,580 కేలరీలుపైగా శక్తిని అందించే ఆహారం తీసుకోవడం సరికాదని.. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌తో ఎక్కువ కేలరీలు వస్తాయని పేర్కొంది. రోజూ ప్రొటీన్లు 41 నుంచి 57 గ్రాములకు మించి, కొవ్వు 19–32 గ్రాములకు మించి తీసుకుంటే అధిక బరువు సమస్య వస్తుందని తెలిపింది. భారత్‌లోని ఏడు పెద్ద నగరాల్లో ప్రజలు రోజుకు సగటున 33 గ్రాముల కంటే ఎక్కువ కొవ్వు తీసుకుంటున్నారని.. వాస్తవంగా రోజుకు 20 గ్రాముల లోపే తీసుకోవాలని వెల్లడించింది.

కిరాణా షాపులే కొంప ముంచుతున్నాయి

ప్రస్తుతం దేశంలో అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు అని.. ఇందులో ఉప్పుతో కూడిన సాల్టీ స్నాక్స్ వ్యాపారమే రూ.60 వేల కోట్లు ఉంటుందని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. ధాన్యాలు, పప్పులు, నూనెలు, పాల వంటి నిత్యావసరాల మార్కెట్ విలువ రూ.5లక్షల కోట్లు మాత్రమేనని తెలిపింది. 2038 నాటికి అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ మార్కెట్ రూ.6 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. చిన్న ప్యాకెట్లలో, తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం.. ఇలాంటి వాటిలో 70% కిరాణా షాపుల్లోనే దొరుకుతుండటంతో వినియోగం బాగా పెరుగుతోందని పేర్కొంది. గతంలో కంటే కూల్‌డ్రింక్స్ వాడకం తగ్గినా.. రెడీమేడ్ జ్యూస్, పాల ఆధారిత డ్రింక్‌ల మార్కెట్ పెరిగిందని తెలిపింది.

➤ పోర్చుగల్‌లో స్వీట్లు, బేవరేజెస్‌లపై ప్రత్యేక వినియోగ ట్యాక్స్ పెట్టడంతో 7% విక్రయాలు తగ్గాయని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. అదే భారత్‌లో హానికరమైనవైనా, మంచివైనా అన్నింటికీ ఒకే రకంగా జీఎస్టీ ఉంటోందని.. దీనివల్ల హానికరమైన వాటి విక్రయాలు తగ్గడంలేదని పేర్కొంది.

➤ భారత్‌లో చక్కెర తక్కువ ధరలో దొరుకుతుందని, దీనికి ప్రత్యామ్నాయాలను వాడాలంటే పన్నులు ఎక్కువగా ఉంటుండటంతో.. వ్యాపారస్థులు, ప్రజలు చక్కెరనే ఎక్కువగా వాడుతున్నారని వివరించింది.

హెచ్‌ఎఫ్‌ఎస్‌ఎస్‌లో 5 రకాలు

1) **చక్కెర సంబంధిత పదార్థాలు:** చాక్లెట్స్, బబుల్‌గమ్స్, లాలిపాప్స్, ఐస్‌క్రీమ్స్, స్వీట్లు, బిస్కెట్లు, కేక్స్ వంటివి.
2) **అధిక ఉప్పుతో కూడినవి:** నట్స్, ఆలూ చిప్స్, పాప్‌కార్న్, పాపడ్ తదితరాలు
3) **బేవరేజెస్:** సాఫ్ట్ డ్రింక్స్, రెడీమేడ్ జ్యూసులు, రెడీమేడ్ కొబ్బరి నీళ్లు, ఎనర్జీ డ్రింక్స్, ఫ్లేవర్డ్ మిల్క్ వంటివి.
4) **రెడీమేడ్ బ్రేక్ ఫాస్ట్:** ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్, గ్రనోలా వంటివి
5) **మిగతా రెడీమేడ్ ఫుడ్ ఐటమ్స్:** డీప్ ప్రాసెస్డ్ ఫ్రూట్స్, వెజిటబుల్స్, చిల్డ్ ఫ్రాజెన్ మీట్, ఫ్రాజెన్ సీఫుడ్, రెడీమేడ్ సూప్‌లు, కండెన్స్‌డ్ మిల్క్, లస్సీ, ఇన్‌స్టంట్ నూడుల్స్, పిజ్జాలు, బర్గర్లు, రెడీమేడ్ రైస్, సాస్‌లు, కెచప్‌లు, టేబుల్ సాల్ట్, టమాటా, సోయా డ్రింగ్స్, పెరుగు వంటివి.

అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



➤ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ వల్ల కొవ్వులు, ప్రొటీన్లు, చక్కెర, ఉప్పు అధికంగా శరీరంలోకి వెళతాయి. అధిక కొవ్వుతో ఊబకాయం, గుండె జబ్బులు.. అధిక ఉప్పుతో పక్షవాతం, బీపీ వస్తాయి. అధిక ప్రొటీన్లతో కిడ్నీ వ్యాధులు తలెత్తుతాయి. దేశంలో జాతీయ స్థాయిలో ప్రాసెస్డ్ ఫుడ్‌పై ఎలాంటి విధానం లేదు. ఆరోగ్యకర, అనారోగ్యకర ఆహార పదార్థాలకు సంబంధించి విధివిధానాలు లేవు. ప్రపంచమంతా చక్కెర, ఉప్పు, కొవ్వులు తక్కువగా ఉన్న ఆహారంవైపు మళ్లుతుంటే.. భారత్‌లో వాటి వినియోగం పెరుగుతోంది. ఈ అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిది.

– డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

ఖమ్మం సభలో రైతు భరోసా!

కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అన్నదాతల ఆక్రందనలు, కౌలు రైతుల కష్టాలకు కారణం బీఆర్‌ఎస్ పార్టీయేనని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్నదాతల సంక్షేమానికి సమగ్ర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రైతుల కోసం చేపట్టే అంశాలను ఈ నెల 27న ఖమ్మంలో పార్టీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనే సభలో ప్రకటించనున్నట్లు తెలిపారు. 'రైతు గోస, బీజేపీ భరోసా' పేరుతో నిర్వహించే ఈ బహిరంగ సభ ద్వారా రైతుల పట్ల బీజేపీ ఎలాంటి వైఖరి అనుసరించనుందో ప్రకటిస్తామన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో రాష్ట్ర రైతాంగం తీవ్రంగా నష్టపోయినా, బీఆర్‌ఎస్ సర్కార్ నుంచి వారికి ఏ మాత్రం మేలు జరగలేదని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు రైతు బంధు మాత్రమే పరిష్కారం కాబోదని కిషన్‌రెడ్డి చెప్పారు. రైతాంగాన్ని మోసం చేస్తున్న కేసీఆర్ సర్కారుకు, కౌలు రైతుల కష్టాలను అర్థం చేసుకోలేని కల్వకుంట్ల కుటుంబానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైతు రుణమాఫీని తెరపైకి తెచ్చి రైతులను ఆగమాగం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తెలంగాణ రైతులను ఆదుకునేందుకు కేంద్రం అన్నివిధాలా ప్రయత్నిస్తోందని కిషన్‌రెడ్డి చెప్పారు.

ఢిల్లీలో ఒక మాట... గల్లీలో మరో మాట

మహిళా రిజర్వేషన్లపై మాట్లాడే నైతికహక్కు కల్వకుంట్ల కుటుంబానికి లేదని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఢిల్లీలో ఒక మాట.. గల్లీలో ఒక మాట మాట్లాడి కల్వకుంట్ల కుటుంబం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. మహిళల పట్ల ఏమాత్రం గౌరవం లేని, గతంలో మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడిపిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదేనని ధ్వజమెత్తారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం 140 కోట్లమంది భారతీయులకు గర్వకారణమన్నారు. కేంద్రం ప్రకటించిన 69వ జాతీయ సినిమా అవార్డుల్లో తెలుగు సినిమా సత్తాచాటిందని చెప్పారు. అల్లు అర్జున్ ఉత్తమ జాతీయ నటుడి అవార్డుకు ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆరు అవార్డులు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్ల ఎదుట నేడు బీజేపీ నిరసన

సాక్షి, హైదరాబాద్: ప్రజాసమస్యల పరిష్కారం, హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసనల్లో కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, ఎంపీ డా.కె.లక్ష్మణ్ పాల్గొంటారు. కరీంనగర్‌లో పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, గద్వాలలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మేడ్చల్‌లో పార్టీ నేత మురళీధర్‌రావు, నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపూరావు, హనుమకొండలో రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, సిద్దిపేటలో ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, ఇతర జిల్లాల్లో పార్టీ ప్రధానకార్యదర్శులు, జాతీయ కార్యవర్గసభ్యులు, మాజీ ఎంపీలు, ఇతర నేతలు పాల్గొంటారు. బీజేపీ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా... ఈనెల 23న అధికార పార్టీ ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట నిరసనలు, 24న మంత్రుల నివాసాల వద్ద ఆందోళనలు నిర్వహించగా 25న జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట నిరసన చేపట్టనున్నారు.

అధికారి ధిక్కారం.. టెండర్ 'అప్రూవ్' ఆలస్యం

పౌరసరఫరాల సంస్థలో వెలుగు చూసిన నిర్లక్ష్యం

- 25 ఎల్ఎంటీ ధాన్యం వేలంపై ఈనెల 21న గ్లోబల్ ఈ– టెండర్ ప్రకటన
- 22 నుంచి మొదలైన బిడ్డింగ్.. సెప్టెంబర్ 5 ఆఖరు తేదీ
- సంస్థ ఎండీ ఆదేశించినా.. వివరాల అప్రూవల్‌కు డిజిటల్ కీ ఇవ్వని అధికారి
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో గురువారం అప్‌లోడ్.. ఆ అధికారిపై చర్యలకు రంగం సిద్ధం



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల సంస్థ అధికారుల్లో అలసత్వం, ధిక్కారం పెరిగిపోతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో కూడా కొందరు అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలోని రైస్‌మిల్లుల వద్ద లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు పేరుకుపోయిన నేపథ్యంలో గ్లోబల్ టెండర్ల ద్వారా బహిరంగ మార్కెట్‌లో విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలుత 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసేందుకు ఈనెల 21న గ్లోబల్ ఈ– టెండర్ ప్రకటన విడుదల చేసింది. 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించారు. సెప్టెంబర్ 5వ తేదీని బిడ్డింగ్‌కు ఆఖరి తేదీగా నిర్ణయించారు. అయితే టెండర్ ప్రకటన విడుదల చేసినప్పటికీ, వేలానికి సంబంధించిన నిబంధనలేవీ ఆన్‌లైన్‌లో పెట్టలేదు. ఈఎంబ, డిపాజిట్లు, అర్హతలు, ఇతర వేలం నిబంధనలేవీ ఆన్‌లైన్‌లో పొందుపరచలేదు. దీంతో బుధవారం సాయంత్రంలోగా టెండర్ వివరాలను అప్‌లోడ్ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సంస్థ ఎండీ అనిల్‌కుమార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే పౌరసరఫరాల సంస్థలో టెండర్లకు సంబంధించి ఆన్‌లైన్ డిజిటల్ కీ మార్కెటింగ్ సెక్షన్ జీఎం వద్ద ఒకటి, పీడీఎస్ డీజీఎం వద్ద మరొకటి ఉంటుంది. ఈ మేరకు కమిషనర్ ఇద్దరు అధికారులకు స్వయంగా ఫోన్ చేసి, గ్లోబల్ టెండర్‌లకు సంబంధించిన విధి విధానాలను అప్‌లోడ్, అప్రూవ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మార్కెటింగ్ సెక్షన్ జీఎం తన వద్ద ఉన్న డిజిటల్ కీతో అప్‌లోడ్ చేశారు. కానీ పీడీఎస్ డీజీఎంగా ఉన్న అధికారి, అప్‌లోడ్ అయిన వివరాలను తన వద్ద ఉన్న కీతో అప్రూవ్ చేయాల్సి ఉండగా, లాగిన్ కావడానికి కూడా ఒప్పుకోలేదని సమాచారం. స్వయంగా సంస్థ ఎండీ ఫోన్ చేసి డిజిటల్ కీతో టెండర్ ప్రక్రియను అప్రూవ్ చేయాలని ఆదేశించినప్పటికీ, ఆ అధికారి ససేమిరా అన్నట్లు సమాచారం. డిజిటల్ కీ ఇవ్వడానికి కూడా నిరాకరించిన ఆ అధికారి బుధవారం రాత్రి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు తెలిసింది. దాంతో బుధవారం రూ. వేల కోట్ల విలువైన టెండర్లకు సంబంధించిన విధి విధానాలను అప్‌లోడ్ చేయలేకపోయారు. గురువారం ఈ విషయం తెలుసుకున్న పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు అధికారిపై చర్యలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన పౌరసరఫరాల సంస్థ అధికారులు.. పీడీఎస్ డీజీఎం పేరుపై ఉన్న డిజిటల్ కీ స్థానంలో మరో కీని రూపొందించి వివరాలను అప్‌లోడ్ చేశారు.

బదిలీ చేశారనే కోపంతో..?

పీడీఎస్ డీజీఎంగా ఉన్న ఆ అధికారిని ఇటీవలే హెడ్ ఆఫీస్ నుంచి వికారాబాద్‌కు బదిలీ చేశారు. అయితే అక్కడ జాయిన్ కాకుండా తిరిగి యథాస్థానంలో కొనసాగేందుకు పైరవీ చేసుకున్నా, ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఆయన 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలానికి సంబంధించిన టెండర్ విధి విధానాలను అప్రూవ్ చేసే విషయంలో మొండిగా వ్యవహరించడం సంస్థలో చర్చనీయాంశమైంది. ప్రభుత్వం ఆ అధికారిపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.



రవీంద్రభారతిలో అదొక్కటే ముగింపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుశీల్ కుమార్ షిండే. చిత్రంలో కేవీపీ, కె.కేశవరావు, వీరప్ప మొయిలీ, రిటైర్డ్ జస్టిస్ వి. గోపాల గౌడ, లక్ష్మీశివశంకర్, రఘువీరారెడ్డి, భట్టి తదితరులు

శివశంకర్ కృషితోనే న్యాయశాఖలో బడుగులకు ప్రాతినిధ్యం

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే

గన్‌ఫౌండ్రీ: నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అంచెలంచెలుగా స్వయంకృషితో పి.శివశంకర్ ఉన్నత స్థాయికి చేరుకున్నారని పలువురు ప్రముఖులు కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి శివశంకర్ మరో అంబేడ్కర్ అని అభివర్ణించారు. గురువారం ఇక్కడి రవీంద్రభారతిలో 'ఉత్తుంగ తరంగాలకు ఎదురీదిన ఓ విజేత జీవితావిష్కరణ' పేరిట కేంద్ర మాజీమంత్రి పి.శివశంకర్ ఆత్మకథ గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే మాట్లాడుతూ న్యాయశాఖలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కోసం అప్పట్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి పి.శివశంకర్ తీసుకున్న నిర్ణయాలు ఎన్నో మార్పులు తీసుకు వచ్చాయని గుర్తుచేశారు. నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తరపున సుప్రీంకోర్టులో పలు కేసులలో న్యాయవాదిగా శివశంకర్ అద్భుతంగా వాదించి ఆమెపై వచ్చిన ఆరోపణలను కొట్టివేయించగలిగారని గుర్తుచేశారు. కర్ణాటక మాజీ సీఎం వీరప్ప మొయిలీ మాట్లాడుతూ కేంద్ర న్యాయ, మానవ వనరుల శాఖల మంత్రిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని కీర్తించారు. ఆయన ఆత్మకథ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందని అన్నారు. నిరుపేద బాల్యం నుంచి అనేక ఆటుపోట్లను అధిగమిస్తూ ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్న శివశంకర్ విజయప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. ఆయనతో అప్పట్లో పనిచేసినటువంటి అనుభవాలు, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలగౌడ, బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేతలు కేవీపీ రాంచందర్‌రావు, రఘువీరారెడ్డి, శివశంకర్ సతీమణి లక్ష్మి, కుమారుడు డాక్టర్ వినయ్, పుస్తక తెలుగు అనువాదకర్త వల్లీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో జీహెచ్‌ఎక్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్



జీహెచ్‌ఎక్స్ సంస్థ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్, జయేశ్ రంజన్

- అమెరికాలో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయిన సంస్థ ప్రతినిధులు
- హెల్త్‌కేర్ టెక్నాలజీ విస్తరణకు హైదరాబాద్ అనువుగా ఉంటుందన్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ, ఐటీ రంగాలకు హైదరాబాద్‌లో అనువైన వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా హెల్త్‌కేర్ ఆధారిత టెక్నాలజీ కార్యకలాపాల విస్తరణకు దిగ్గజ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ గురువారం జీహెచ్‌ఎక్స్ చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ ఆఫీసర్ క్రిస్టీ లియోనార్డ్ బృందంతో భేటీ అయ్యారు. తమ విస్తరణ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్స్ఛేంజ్ (జీహెచ్‌ఎక్స్) ఈ సందర్భంగా ప్రకటించింది. హెల్త్‌కేర్ రంగం పురోగతికి అవసరమైన వాతావరణం, మానవ వనరులు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. హెల్త్ కేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు చేయూత అందిస్తూనే ఐటీ ఆధారిత కార్యకలాపాలను పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తెచ్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కేటీఆర్ తెలిపారు.

డిజిటల్ దిశగా హెల్త్‌కేర్

ఆరోగ్య సంరక్షణ రంగం పూర్తిగా డిజిటల్ దిశగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టిందని, ఇందులో భాగంగా ఆయా కంపెనీలు ఐటీ ఆధారిత సేవలపై విస్తృతంగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని జీహెచ్‌ఎక్స్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సీజే సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రం ఏర్పాటు ద్వారా సంస్థ లక్ష్యాలను అందుకుంటామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తమ కార్యకలాపాలను 2025 నాటికి మూడింతలు చేసే లక్ష్యంతో విస్తరణ ప్రణాళికలను చేపడతామని చెప్పారు.

'కృష్ణా'లో కేటాయింపులే జరగలేదు

- ఏపీకి 26.29, తెలంగాణకు 6.04 టీఎంసీల కేటాయింపు అవాస్తవం
- అసలు త్రిసభ్య కమిటీ సమావేశమే జరగలేదు
- రాష్ట్ర నీటిపారుదల శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి తాగునీటి అవసరాలకు సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఏపీకి 26.29 టీఎంసీలు, తెలంగాణకు 6.04 టీఎంసీలను విడుదల చేయాలని కృష్ణానది యాజమాన్య బోర్డు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సిఫారసు చేసిందని పత్రికల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. ఈ నెల 21న త్రిసభ్య కమిటీ సమావేశమే జరగలేదని గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు త్రిసభ్య కమిటీ కన్వీనర్, కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే, ఏపీ జల వనరుల శాఖ ఈఎన్సీ సి.నారాయణరెడ్డి మాత్రమే సమావేశమై తాగునీటి అవసరాలపై మాత్రమే చర్చించారని తెలియజేసింది. రెండు రాష్ట్రాలకు తాగునీటి కేటాయింపులు జరగలేదని, అసలు తెలంగాణ అంగీకారం తెలపలేదని వివరణ ఇచ్చింది.

కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శితో తెలంగాణ ఈఎన్సీ భేటీ

కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ కన్వీనర్ డీఎం.రాయిపూరేను రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ గురువారం జలసౌధలో కలిసి కృష్ణా జలాల కేటాయింపులపై పత్రికల్లో వచ్చిన వార్తల పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 21న ఏపీ జల వనరుల శాఖ ఈఎన్సీతో నిర్వహించిన సమావేశంలో తాగునీటి అవసరాలకుపై చర్చించిన అనంతరం, నీటి కేటాయింపులపై సిఫారసులతో రూపొందించిన ముసాయిదా ప్రతిపాదనలు(మినట్స్) అంతర్గతంగా సర్క్యులేట్ చేశామని, పత్రికలకు అధికారికంగా విడుదల చేయలేదని రాయిపూరే వివరణ ఇచ్చినట్టు తెలిసింది. త్వరలో త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ సూచించారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాల జలవినియోగం, నీటి నిల్వ లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తాగునీటి అవసరాలను మదింపు చేసిన తర్వాత కేటాయింపులు జరపాలని కోరారు. తాగునీటి అవసరాలను త్రిసభ్య కమిటీలో చర్చించి, ఇరుపక్షాల అంగీకారం మేరకే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

25 ఎల్ఎంటీ ధాన్యం వేలానికి నిబంధనలు ఖరారు

- సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు
- ఏటా రూ.వెయ్యి కోట్ల టర్నోవర్ ఉంటేనే బిడ్డింగ్‌కు అర్హత

సాక్షి, హైదరాబాద్: గత సీజన్లలో కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చి మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం వేలానికి సంబంధించి పౌరసరఫరాల సంస్థ నిబంధనలు ఖరారు చేసింది. ఈ మేరకు సంస్థ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యం నుంచి తొలి విడతలో 25 లక్షల టన్నుల ధాన్యం వేలం వేయనున్నట్లు ప్రకటించింది. 28 జిల్లాల్లోని ధాన్యం మొత్తాన్ని ఆరు లాట్స్ ద్వారా వేలం వేయాలని అధికారులు నిర్ణయించారు. ఐదు లాట్స్‌లో 4 లక్షల టన్నుల ధాన్యం వేలం వేయనుండగా మరో లాట్‌లో 5 లక్షల టన్నులు వేలం వేస్తారు. ఆసక్తి గల సంస్థలు బిడ్డింగ్ వేసేందుకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 5. టెండర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పలు నిబంధనలను రూపొందించారు. అక్రమాలకు పాల్పడినా, పౌరసరఫరాల సంస్థ అధికారులకు లంచం ఇవ్వజూపినా సదరు కంపెనీని వేలం ప్రక్రియ నుంచి బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు అధికారులపై, సదరు కంపెనీపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తారు. ఇక బిడ్డింగ్ అనంతరం సమస్యలు రాకుండా ఉండేందుకు నిబంధనలను మరింత పక్కాగా అమలు చేస్తున్నారు. వరుసగా మూడేళ్లు.. ఏటా రూ. వెయ్యి కోట్ల టర్నోవర్ గల కంపెనీలకు మాత్రమే బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు అర్హత ఉంటుంది. దీంతో పాటు కంపెనీ విలువ రూ.100 కోట్లకు తగ్గకుండా ఉండాలి. ఇక ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.585 చొప్పున రూ. 23.40 కోట్లు ఈఎండీ చెల్లించాల్సి ఉంటుంది. బిడ్డింగ్‌లో ఎంపికైన కంపెనీ మొత్తం ధాన్యం విలువలో 5 శాతం డబ్బులను ఏడు రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇక మిగిలిన మొత్తాన్ని 30 రోజుల్లో చెల్లించి పూర్తి ధాన్యాన్ని తీసుకెళ్లాల్సి ఉంటుంది.

డీఈడీ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

- సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్సీటీఈ నిర్ణయం
- ప్రైమరీ టీచర్ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులని తేల్చిన సుప్రీం

సాక్షి, అమరావతి: ఇకపై డీఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సు పూర్తి చేసిన వారికే సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) నియామకాల్లో అవకాశం దక్కనుంది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు బోధించే ఎస్జీటీ పోస్టులకు డీఈడీతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారికి ఎన్సీటీఈ గతంలో అవకాశం కల్పించింది. అయితే ఎన్సీటీఈ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాజస్తాన్ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం 11న తుది తీర్పు ప్రకటించింది. ఎలిమెంటరీ టీచర్ పోస్టులకు కేవలం డీఎడ్ శిక్షణ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది. నూతన విద్యావిధానం ప్రకారం ప్రాథమిక స్థాయిలోని పిల్లలకు విద్యాబోధన చేయాలంటే ప్రత్యేక మెళకువలు అవసరమని పేర్కొంది. డీఎడ్ శిక్షణ పొందిన వారే ఆ విధంగా బోధన చేయగలుగుతారని న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పును ఎన్సీటీఈ తాజాగా తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. దానికి అనుగుణంగా నోటిఫికేషన్లలో నిబంధనలు చేర్చేలా రాష్ట్రాలకు దిశానిర్దేశం చేసింది. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయ సంస్థలు వేలాది ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాయి. వీటిలో కొన్ని నియామక ప్రక్రియలు దాదాపు చివరి దశకు వచ్చాయి. అలాగే కొన్ని రాష్ట్రాల్లో టీచర్ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి.

'పీఎం కిసాన్ ట్రాక్టర్ యోజన వెబ్‌సైట్' ఫేక్

లింగాలఘణపురం: సగం సబ్సిడీతో రైతులకు కేంద్ర ప్రభుత్వం ట్రాక్టర్లను అందజేస్తుందని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంతో రైతులు మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్తున్నారు. ఈ విషయంపై కేంద్రం 'పీఐబీ ఫ్యాక్ట్ చెక్'అనే ట్విట్టర్ అకౌంట్‌లో పీఎం కిసాన్ ట్రాక్టర్ యోజన అనే వెబ్‌సైట్ ఫేక్ అని స్పష్టం చేసింది. కాగా.. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని పలువురు రైతులు 'పీఎం కిసాన్ ట్రాక్టర్ యోజన'అనే పథకాన్ని 'సాక్షి' దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై ఏఓ వెంకటేశ్వర్లును వివరణ కోరింది. ఆయన మాట్లాడుతూ ఎలాంటి సబ్సిడీలైనా వ్యవసాయశాఖ నుంచి వస్తాయని, సోషల్ మీడియాలో వచ్చిన వాటిని నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ వెబ్‌సైట్‌లను పెట్టి డబ్బులు దండుకుంటున్నారని వెల్లడించారు.

కొత్త బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు

- ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు నేరుగా అడ్మిషన్లు
- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో ఈ ఏడాది కొత్తగా 17 గురుకుల డిగ్రీ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కాలేజీల్లో అడ్మిషన్లను ప్రారంభించినట్లు సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి ఏడాది కావడంతో ఎలాంటి అర్హత పరీక్షలు లేకుండా నేరుగా అడ్మిషన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కాలేజీలో సంప్రదించి నేరుగా అడ్మిషన్ పొందవచ్చు. సీట్ల సంఖ్యను మించి విద్యార్థులు సంప్రదిస్తే ఇంటర్మీడియెట్ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ 17 కాలేజీల్లో కోర్సుల తీరును పరిశీలిస్తే... వికారాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఫిల్మ్ అండ్ మీడియా, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్, ఫొటోగ్రఫీ అండ్ డిజిటల్ ఇమేజింగ్ కోర్సులతో బీఏ (ఆనర్స్), సంగారెడ్డి కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అందుబాటులో ఉన్నాయి. మిగతా కాలేజీల్లో బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం, బీఏ కోర్సులున్నాయి. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తాము ఎంచుకున్న కాలేజీకి నేరుగా వెళ్లి డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాకొక గురుకుల కాలేజీ లెక్కన ఇప్పటివరకు 16 కాలేజీలు ఉండగా... తాజాగా 17 కాలేజీలు ప్రారంభమయ్యాయి. దీంతో రాష్ట్రంలో 33 గురుకుల డిగ్రీ కాలేజీలు అందుబాటులోకి వచ్చినట్లైంది.

మత్స్యసంఘాల సమాఖ్య వైస్‌చైర్మన్ బాధ్యతల స్వీకారం నేడు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ లోని మత్స్యభవన్‌లో తెలంగాణ మత్స్యసంఘాల సమాఖ్య వైస్ చైర్మన్‌గా దీటి మల్లయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 10 గంటలకు జరగబోయే ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని మల్లయ్య తెలిపారు.

ఖాళీల్లో మూడో వంతే భర్తీ

ఎన్నికల వేళ రాష్ట్ర సర్కారు హడావుడి

- 2017 తర్వాత ఇప్పుడే నోటిఫికేషన్
- ఏడేళ్లుగా టీచర్లకు పదోన్నతులు లేవు
- పర్యవేక్షణ పోస్టుల ఊసేలేదు.. ఉపాధ్యాయుల్లో అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించడం.. ఓవైపు అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తించినా, తక్కువ పోస్టులనే భర్తీ చేయడం ఏమిటనే విమర్శలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వ ప్రకటన విద్యాశాఖలో టీచర్ల కొరతను తీర్చేదిగా లేదని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు. నియామక ప్రక్రియలో స్పష్టమైన విధానం లేదని ఆరోపిస్తున్నారు. పదోన్నతులతో ముడిపడి ఉన్న స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), ప్రధానోపాధ్యాయుల పోస్టుల విషయంపై మంత్రి స్పష్టత ఇవ్వలేదని.. విద్యాశాఖను వేధిస్తున్న పర్యవేక్షణ పోస్టులైన డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోల కొరత విషయాన్నీ ప్రస్తావించలేదని అంటున్నారు.

22 వేల పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13,086 ఖాళీ పోస్టులు ఉన్నాయని స్వయంగా సీఎం కేసీఆర్ గత ఏడాది ఏప్రిల్‌లో వెల్లడించారు. అందులో 10 వేల వరకు టీచర్ పోస్టులే ఉంటాయని అంచనా వేశారు. మిగతా వాటిలో 24 డిప్యూటీ డీఈవో ఖాళీలని ప్రభుత్వం తెలిపింది. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా 72 డిప్యూటీ డీఈవో పోస్టులు ఉండగా.. ప్రస్తుతం నలుగురే పనిచేస్తున్నారు. 68 పోస్టులు ఖాళీయే. ఇక ఎంఈవోలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, డైట్ అధ్యాపకుల ఖాళీలు భారీగా ఉన్నాయి. మరోవైపు ఇటీవలి విద్యాశాఖ గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 21,433 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు అంతర్గత పరిశీలనలో గుర్తించారు. పాఠశాలలు, టీచర్ల హేతుబద్ధీకరణ చేపట్టిన తర్వాత వాటిని ప్రకటించాలనుకున్నారు. కానీ ఆ ప్రక్రియ ముందుకు వెళ్లలేదు. స్కూళ్లలో 1,974 హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇవ్వడం ద్వారా వీటిని భర్తీ చేయాలి. ఇదే సమయంలో 7,200 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఎస్జీటీలకు పదోన్నతి ద్వారా 70 శాతం, నేరుగా నియామకాల ద్వారా 30 శాతం పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. పదోన్నతులు చేపడితే గానీ అసలు ఖాళీలు ఎన్ని అనే స్పష్టత వస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 1.31 లక్షల మంది టీచర్ పోస్టులు ఉంటే.. ప్రస్తుతం పనిచేస్తున్నది 1.09 లక్షల మంది మాత్రమే. అంటే దాదాపు 22 వేల ఖాళీలు ఉన్నట్టు తెలుస్తోంది.

విద్యాశాఖ ఏడాది క్రితం లెక్క తేల్చిన ఖాళీలివీ..

విభాగం	ఖాళీలు
గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు	1,974
ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు	2,043
స్కూల్ అసిస్టెంట్లు	7,200
పీడీలు	25
ఎస్జీటీలు	6,775
లాంగ్వేజ్ పండిట్లు	688
పీఈటీలు	172
డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్లు	1,733
ఎంఈవోలు	467
బాలికల పాఠశాలల హెచ్ఎంలు	15
డైట్ లెక్చరర్లు	271
డిప్యూటీ ఈవోలు	58
డీఈవోలు	12

పదోన్నతుల కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలో ఏడేళ్లుగా టీచర్లకు పదోన్నతులు కల్పించలేదు. గత నాలుగేళ్లుగా సాధారణ బదిలీలు కూడా లేవు. మూడుసార్లు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లలో పాసైన 4 లక్షల మంది టీచర్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే బదిలీలు, పదోన్నతులకు కోర్టు కేసులు, ఇతర అడ్డంకులు ఉండటంతో.. 1,974 హెచ్ఎం పోస్టులు, 2,043 ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులు, 7,200 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 6,775 ఎస్జీటీలు, 467 ఎంఈవో పోస్టుల భర్తీ చేపట్టలేదని విద్యాశాఖ వర్గాలు చెప్తున్నాయి. కానీ ప్రభుత్వం 6,612 పోస్టులే భర్తీ చేస్తుండటం.. ఇందులో సాధారణ టీచర్ పోస్టులు 5,089 మాత్రమే ఉండటంపై నిరాశ వ్యక్తమవుతోంది.

పోస్టులను కుదించేస్తారా?

వాస్తవంగా 22 వేల ఖాళీలు ఉన్నా.. హేతుబద్ధీకరణ చేపడితే పోస్టుల సంఖ్య బాగా తగ్గుతుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని 8,782 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 20లోపే ఉందని.. ఇందులో 8,665 ప్రాథమిక పాఠశాలలు, 117 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అంటున్నాయి. వంద మంది పిల్లల కంటే ఎక్కువ ఉన్న స్కూళ్లు 6,833 మాత్రమేనని వివరిస్తున్నాయి. వీటిని హేతుబద్ధీకరిస్తే టీచర్ పోస్టులు తగ్గుతాయని పేర్కొంటున్నాయి. అయితే ఈ తరహా హేతుబద్ధీకరణతో పాఠశాలలను, టీచర్ పోస్టులను కుదించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. పిల్లల సంఖ్యను బట్టి కాకుండా.. స్కూళ్లలో తరగతులు, టీచర్ల అవసరాన్ని చూడాలని స్పష్టం చేస్తున్నాయి.

6,612 టీచర్ పోస్టుల భర్తీ



▶ మొదటి పేజీ తరువాయి

పనిచేస్తున్నారని మంత్రి సబితారెడ్డి తెలిపారు. ప్రస్తుతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో 6,612 పోస్టులను భర్తీ చేస్తుండగా.. పదోన్నతుల ద్వారా మరో 9,979 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని చెప్పారు. పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సిన కేటగిరీలో గెజిటెడ్ హెచ్ఎం ఖాళీలు 1,947 ఉన్నాయని, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులు 2,162 ఉన్నాయని.. స్కూల్ అసిస్టెంట్ స్థాయి టీచర్లకు పదోన్నతులతో వీటిని భర్తీ చేయాల్సి ఉంటుందని వివరించారు. మరో 5,870 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లోకి ఎస్జీటీ టీచర్లకు పదోన్నతులు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు.

'డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ' ఇలా..

ప్రతి జిల్లాకు ఒక 'డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ)' ఉంటుంది. దీనికి సదరు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, కార్యదర్శిగా జిల్లా విద్యాశాఖ అధికారి, సభ్యులుగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జెడ్పీ సీఈఓ) వ్యవహరిస్తారు. గతంలో డీఎస్సీ ద్వారానే ఉపాధ్యాయ నియామకాలు జరిగేవి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామంటూ డీఎస్సీలను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా వీటిని తిరిగి ఏర్పాటు చేయనుంది.

భర్తీ చేసే టీచర్ పోస్టులు ఇవీ..

మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు	:6,612
జనరల్ టీచర్లు	:5,089
వీరిలో స్కూల్ అసిస్టెంట్లు	:1,739
సెకండరీ గ్రేడ్ టీచర్లు	:2,575
భాషా పండితులు	:611
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు	:164
స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు: 1,523	
వీటిలో ప్రాథమిక స్థాయిలో 796 పోస్టులు	
ప్రాథమికోన్నత స్థాయిలో 727 పోస్టులు	

వచ్చే నెల 15న టెట్

డీఎస్సీ ద్వారా చేపట్టాల్సిన నియామకాలకు టెట్ కీలకమని.. ఇందుకోసం వచ్చే నెల 15వ తేదీన టెట్ పరీక్ష నిర్వహిస్తామని సబితారెడ్డి ప్రకటించారు. టెట్ ఫలితాలను వచ్చేనెల 27వ తేదీన ప్రకటిస్తామని.. ఆ తర్వాత ఉపాధ్యాయ నియామకాల ప్రకటన జారీ చేస్తామని తెలిపారు. పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సిన ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతోందని, ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే తక్షణమే వాటిని కూడా భర్తీ చేస్తామని చెప్పారు. ఇటీవల కేజీబీవీల్లో 1,264 పోస్టుల భర్తీ ప్రక్రియ జరిగిందని.. కొత్తగా 20 కేజీబీవీల ఏర్పాటుతో మరో 160 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తెలిపారు. వీటిని కూడా వీలైనంత త్వరగా భర్తీ చేస్తామన్నారు. ఇక వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ద్వారా విద్యాశాఖలో 3,896 మందికి లబ్ధి చేకూరిందని, ఇందులో అత్యధికులు విద్యాశాఖ వారే ఉన్నారని మంత్రి చెప్పారు. గురుకుల విద్యాసంస్థల్లో కూడా పలువురు ఉద్యోగులను క్రమబద్ధీకరించామన్నారు. మొత్తంగా విద్యాశాఖ పరిధిలో 8,792 పోస్టులు, కాలేజీల్లో 3,149 పోస్టుల భర్తీ ప్రక్రియలు టీఎస్‌పీఎస్సీ ద్వారా కొనసాగుతున్నాయని తెలిపారు.

ముగిసిన ఎంసెట్-23 ప్రవేశాలు



- ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లు 16,296

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంసెట్-2023 ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లకు సంబంధించి ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కాలేజీల్లో 16,296 ఇంజనీరింగ్ సీట్లు మిగిలాయి. ఇవి ఖాళీగా ఉన్నట్టే లెక్క. అడపాదడపా స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా కాలేజీలే సీట్లు నింపుకునే అవకాశముంది. ఇలా నిండేవి స్వల్పంగానే ఉంటాయి.

- కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) కోర్సుల్లో 5,723 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ బ్రాంచ్‌ల్లో 4,959, సివిల్, మెకానికల్ బ్రాంచ్‌ల్లో 5,156, ఇతర బ్రాంచ్‌ల్లో మరో 458 సీట్లకు అడ్మిషన్లు జరగలేదు.
- రాష్ట్రంలో 178 కాలేజీల్లో మొత్తం 85,671 బీటెక్ సీట్లుండగా, వీటిలో 69,375 సీట్లు (80.97శాతం) భర్తీ అయ్యాయి.
- యాజమాన్యాల వారీగా మిగిలిన సీట్లను పరిశీలిస్తే.. ప్రైవేట్ కాలేజీల్లో 14,511 సీట్లు, 289 ప్రైవేట్ యూనివర్సిటీల్లో 289, యూనివర్సిటీ కాలేజీల్లో 1,496 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

29లోగా ఫీజు చెల్లించాలి

ఎంసెట్-23 స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ సీట్లను అధికారులు గురువారం కేటాయించారు. ఈ సీట్లు పొందిన వారు ఈనెల 29లోపు ఫీజు చెల్లించి, ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. విద్యార్థులు టీసీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలేజీలో సమర్పించాల్సి ఉంటుందన్నారు.

పీజీ మెడికల్ మొదటి విడత ప్రవేశాలకు ప్రకటన

- యాజమాన్య కోటా సీట్ల భర్తీకి నేటి నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ సీట్ల భర్తీకి శుక్రవారం(నేటి) నుంచి 27వ తేదీ వరకు మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. దరఖాస్తు ప్రక్రియ ముగియడంతో మొదటి విడత వెబ్ ఆప్షన్లకు వర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. యూనివర్సిటీ పరిధిలోని పీజీ వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలలవారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. మెరిట్ జాబితా, సీట్ల ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www. knruhs. telangana. gov. in ను చూడాల్సిందిగా యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

నిబంధనలను అనుసరించి సోదాలు చేయొచ్చు

- పని వేళల్లో తనిఖీలు చేయొచ్చు.. ఆ అధికారం రిజిస్ట్రార్‌కు ఉంది
- ప్రభుత్వ అధీకృత అధికారి కూడా సోదాలు చేయొచ్చు
- నోటీసు ఇచ్చి లేదా ఇవ్వకుండా సోదాలు చేయొచ్చు
- చట్ట ప్రకారం తప్ప మార్గదర్శిలో ఎలాంటి సోదాలు చేపట్టొద్దు
- ఏపీ హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్ చట్ట నిబంధనల ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అన్నీ శాఖల్లో సోదాలు చేయవచ్చని ఏపీ హైకోర్టు స్పష్టంచేసింది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 46 ప్రకారం చిట్ పుస్తకాలు, రికార్డులను తనిఖీ చేసే అధికారం రిజిస్ట్రార్‌కు ఉందని తెలిపింది. అలాగే ప్రభుత్వం నియమించే అధీకృత అధికారి కూడా పని వేళలు లేదా పని దినాల్లో నోటీసు ఇచ్చి లేదా నోటీసు ఇవ్వకుండా తనిఖీలు చేయవచ్చని చెప్పింది. మార్గదర్శి రోజువారీ వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సోదాలు చేయొచ్చని, ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలను గౌరవించాలని తెలిపింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా తప్ప, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఎలాంటి సోదాలు నిర్వహించడానికి వీల్లేదంది. సీఐడీ లేదా ఇతర అధికారులు సోదాల పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యాపార కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించడానికి వీల్లేదని చెప్పింది. డిప్యూటీ రిజిస్ట్రార్ కొందరికి ఆథరైజేషన్ ఇవ్వడం చిట్స్ ఇన్‌స్పెక్టర్ల నియామకం కిందకు రాదని పేర్కొంది. అలాంటి ఆథరైజేషన్ అనుమతించదగ్గదా కాదా అన్న విషయాన్ని లోతుగా విచారిస్తామంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమ సంస్థకు చెందిన అన్ని శాఖల్లో చిట్ రిజిస్ట్రార్లు చేస్తున్న సోదాలను సవాలు చేస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సోదాల నిమిత్తం జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను స్టే చేయడంతో పాటు తమ సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అనుబంధ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య రెండు రోజుల క్రితం మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ వాదనలు విని తన నిర్ణయాన్ని వాయిదా వేశారు. బుధవారం ఆయన తన నిర్ణయాన్ని వెలువరిస్తూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ శాఖల్లో సోదాలను నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే చట్ట ప్రకారం సోదాలు కొనసాగించుకునేందుకు అనుమతినిచ్చారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లకు వ్యతిరేకంగా..

ఒక్క సాక్ష్యమూ లేదు

హియర్ సే ఎవిడెన్స్... చట్ట ప్రకారం చెల్లదు

- ఎన్నికల గొడవలు అన్నది ఓ కల్పన మాత్రమే
- గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని ఆ సంస్థే చెప్పదు
- వీటి ఆధారంగా నిందితులుగా పేర్కొనడం చెల్లదు
- సీబీఐ దర్యాప్తు అంతా తప్పులతడకగా ఉంది
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి తరపు న్యాయవాది వాదనలు
- బెయిల్ పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఉద్దేశపూర్వకంగా ఇరికించిందని, వారికి వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా లేదని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి హైకోర్టులో సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఎన్నికలు, సీట్ల గొడవలు లేవని, గూగుల్ టేక్ అవుట్‌ను ఆ సంస్థే సర్టిఫై చేయడం లేదని నివేదించారు. నిందితులు ఏ 1 నుంచి ఏ 4 వరకు వివేకాను హత్య చేయడానికి వేర్వేరు కారణాలున్నాయన్నారు. గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి వెనుక శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ఉన్నారని 'హియర్ సే ఎవిడెన్స్'ఆధారంగా పేర్కొనడం చెల్లదన్నారు. కిరాయి హంతకుడు చెప్పినా, చట్ట ప్రకారం చెల్లని దాన్ని సాక్ష్యంగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తు అంతా తప్పులతడకగానే సాగిందన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేనందున బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు.

దర్యాప్తు ఇప్పటికే పూర్తయ్యింది

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'జూన్ 30 నాటికే దర్యాప్తు పూర్తయింది. కేవలం దస్తగిరి వాంగ్మూలం మినహా నేరం మోపడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఢిల్లీలో రెండున్నర నెలలు సీబీఐ వద్ద ఉన్న దస్తగిరి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. ఆ తర్వాత ముందస్తు బెయిల్‌కు అనుమతి రాగానే నేరాన్ని అంగీకరిస్తూ అప్రూవర్‌గా మారాడు. బెయిల్ ఇచ్చే సమయంలో ఎలాంటి షరతులు విధించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ముందస్తు బెయిల్ ఇచ్చిన వెంటనే క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. దీనికి సంబంధించి కేసు రికార్డులను కోర్టు ముందు ఉంచలేదు. క్షమాభిక్ష పిటిషన్‌లో దస్తగిరికి సీబీఐ పూర్తిగా సహకరించింది. కడప కోర్టు రికార్డులను పరిశీలించకుండానే క్షమాభిక్షను ఆమోదించింది. రికార్డులన్నీ పులివెందుల కోర్టులో ఉండగా కడప కోర్టు నిర్ణయం తీసుకుంది. కేసు వివరాలేమిటో కూడా తెలియకుండా క్షమాభిక్షను ఎలా మంజూరు చేస్తారు? గూగుల్ టేక్ అవుట్ అనేది చట్టపరంగా చెల్లదు. తమ గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం అని ఆ సంస్థే సర్టిఫికెట్ ఇవ్వదంటే దాన్ని ప్రామాణికతను అర్థం చేసుకోవచ్చు. సీబీఐ అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఆయనపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయన్ను తప్పించి మరొకరిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది'అని నివేదించారు.

రాజకీయ విభేదాలు లేవని సునీతే చెప్పారు

'కేవలం ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సీబీఐ దర్యాప్తు జరిపింది. వివేకాకు అవినాశ్‌రెడ్డి కుటుంబంతో రాజకీయ విభేదాలున్నాయని చెప్పడం కేవలం ఊహాజనితమే. అవినాశ్‌రెడ్డి అప్పటికే కడప ఎంపీగా ఉన్నారు. తర్వాత ఎంపీ టికెట్ కూడా పార్టీ అధిష్టానం ఆయనకే ఇచ్చింది. వివేకా కూడా అవినాశ్ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే విషయాన్ని హత్య జరిగిన తర్వాత వివేకా కుమార్తె సునీత కూడా మీడియాకు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డి తొలిసారి ఎంపీగా గెలవడంలో తన తండ్రి కీలకపాత్ర పోషించారని చెప్పారు. అంటే వివేకాకు అవినాశ్ కుటుంబంతో ఎలాంటి విభేదాలు లేవని తెలుస్తోంది. వివేకా ఇంట్లో కనిపించకుండా పోయిన పత్రాలు, ఆయన రాసిన లేఖ గురించి సీబీఐ అసలు పట్టించుకోలేదు. వాచ్‌మెన్ రంగన్న స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చినా దాన్ని పక్కన పెట్టింది. ఏ-1 నుంచి ఏ-3 వరకు వివేకాను హత్య చేసేందుకు ఒక్కొక్కరికి ఒక్కో కారణం ఉంది. ఇక ఏ-4 దస్తగిరి ఓ కిరాయి హంతకుడు. డబ్బు కోసమే వివేకా హత్యలో పాల్గొన్నానని చెప్పాడు. ఒక్క దస్తగిరితోనే తమకు కావాల్సిన విధంగా స్టేట్‌మెంట్ తీసుకుని కావాలనే కొందరిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఓ ఐపీఎస్ స్థాయి అధికారి నుంచి వాంగ్మూలం ఎలా తీసుకోవాలో కూడా సీబీఐకి తెలియదు. చట్టప్రకారం అనుసరించాల్సిన విధానాన్ని పాటించలేదు. ఐపీఎస్ అధికారి వద్ద వాంగ్మూలం తీసుకుంది ఒకరైతే.. చార్జిషీట్‌లో సంతకం పెట్టింది మరొకరు. ఇలా అడుగడుగునా సీబీఐ విచారణంతా తప్పులతడకగానే సాగింది' అని నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.

వెంటనే బెయిల్ ఇవ్వాలి..

'72 ఏళ్లు పైబడిన వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్యం సరిగా లేక తీవ్రంగా సతమతం అవుతున్నారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. ఎలాంటి ఆధారాలు లేకుండానే సీఆర్‌పీసీ 120బీ, 202 కేసులు పెట్టారు. నిందితులిద్దరూ నాలుగు నెలలుగా జైలులో ఉంటున్నారు. సీబీఐ దర్యాప్తు ముగిసింది. చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. గతంలో రెండు చార్జిషీట్లు వేశారు. దర్యాప్తు ముగిసింది. నిందితులకు వ్యతిరేకంగా ప్రాథమికంగా ఒక్క ఆధారం కూడా లేదు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని వెంటనే భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లకు బెయిల్ మంజూరు చేయాలి'అని నిరంజన్‌రెడ్డి కోరారు. వివేకా హత్యతో ఈ ఇద్దరికీ సంబంధం ఉందని, బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ తరపున అనిల్ థోమర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం 29న

వివేకా హత్య కేసులో ఏ-5 శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈనెల 29న నిర్ణయం తీసుకుంటామని సీబీఐ కోర్టు పేర్కొంది. బెయిల్ పిటిషన్‌లో వాదనలు పూర్తయ్యాయి. దర్యాప్తు పూర్తిచేసి సీబీఐ చార్జిషీట్ వేసిందని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి సీహెచ్. రమేశ్‌బాబు విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేశారు.

మార్గదర్శిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

- సామర్లకోటలో ఫిర్యాదు చేసిన బాధితుడు
- మార్గదర్శిలో 2020 మార్చిలో రూ. లక్ష చిట్లు రెండు వేసిన మోజెస్
- నాలుగు నెలల తర్వాత ఒకటి పాడినట్లు వెల్లడి
- రూ. 80 వేలు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని ఫిర్యాదు

సామర్లకోట: మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థలో చిట్టీ పాడుకొన్నప్పటికీ, సొమ్ము ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం కాకినాడలోని డెయిరీ ఫార్మ్ సెంటర్ రాజీవ్ గృహకల్పకు చెందిన పెంకె మోజెస్ 2020 మార్చిలో మార్గదర్శి ఏజెంట్ ద్వారా సామర్లకోట బ్రాంచిలో రూ.లక్ష విలువ కలిగిన రెండు చిట్స్ తీసుకొన్నారు. ఒక్కో చిట్‌కు నెలకు రూ.2,500 చెల్లిస్తున్నారు. నాలుగు నెలల తరువాత ఒక చిట్‌ను రూ.20 వేలకు పాడుకున్నారు. ఆయనకు రావలసిన రూ.80 వేలకు సంబంధించి మార్గదర్శి బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించగా ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు, ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ కావాలని చెప్పారు. ఇద్దరు ప్రైవేటు ఉద్యోగుల ష్యూరిటీ ఇవ్వగా, ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ ఇవ్వలేకపోయారు. దాంతో రూ.80 వేలు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని మోజెస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నిసార్లు సంప్రదించినా న్యాయం జరగకపోవడంతో మోజెస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనిచ్చిన ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్ వెళ్లేవారికి ఇమిగ్రేషన్ చార్జీల తగ్గింపు

- గతంలో ఒక్కో వలస కార్మికుని నుంచి రూ.10 వేల వరకు ఫీజు వసూలు
- ఇప్పుడు రూ.2,800 వరకే ఫీజు వసూలు

మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికులకు విదేశాంగ శాఖ శుభవార్తను అందించింది. కనీస విద్యార్హత లేనివారు గల్ఫ్‌లోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, ఖతర్, ఒమాన్ దేశాలకు వెళ్లడానికి వీసా పొందిన తరువాత ఇమిగ్రేషన్ చేయించాల్సి ఉంటుంది. ఒక వేళ పదో తరగతి ఉత్తీర్ణులై ఉంటే వారికి ఇమిగ్రేషన్ అవసరం ఉండదు. ఇమిగ్రేషన్ చేయించడానికి ఏ దేశం వీసా పొందితే ఆ దేశం స్టాంపింగ్‌ను మన విదేశాంగ శాఖ కార్యాలయం ద్వారా వేయించాల్సి ఉంటుంది. ఇమిగ్రేషన్ ఫీజును గతంలో రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసేవారు. విదేశాంగ శాఖ ఈ ఫీజును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇకపై గల్ఫ్‌లోని ఏ దేశానికి వెళ్లాలనుకున్నా వారు రూ.2,800 ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.





నా జాతి ప్రజలారా!
నిశ్చయంగా ఈ ఇహలోక జీవిత సుఖం తాత్కాలికమైనదే.
నిశ్చయంగా పరలోకమే శాశ్వతమైన నివాస స్థలము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 25 ఆగస్టు 2023

బ్రిక్స్‌కు కొత్త బలం!

కాలం అందరికీ... వ్యక్తులకైనా, సంస్థలకైనా అన్నీ నేర్పుతుంది. పదిహేనేళ్ల క్రితం అప్పట్లో ఆర్థికంగా జవసత్వాలు పుంజుకుంటున్న బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో బ్రిక్‌గా ఏర్పడిన సహకార కూటమి అనంతరకాలంలో దక్షిణాఫ్రికాను కూడా కలుపుకొని బ్రిక్స్‌గా రూపాంతరం చెందింది. జోహన్నెస్‌బర్గ్‌లో మూడు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు గురువారం ముగిసే సమయానికి మరో ఆరు దేశాలకు– సౌదీ అరేబియా, యూఏఈ, అర్జెంటీనా, ఇథియోపియా, ఇరాన్, ఈజిప్టులకు ఈ సారి సభ్యత్వం లభించింది. ఈ దేశాల భాగస్వామ్యం వచ్చే జనవరి 1 నుంచి ప్రారంభమవుతుంది. ఇకపై దీన్ని బ్రిక్స్–11గా వ్యవహరిస్తారు. ఆరంభంలో ఆ కూటమి వైపు పెద్దగా దృష్టి సారించని దేశాలు అందులో భాగస్వాములై ఎదగాలని ఇప్పుడు తహతహలాడటం అనివార్య పరిణామం. కరోనా మహమ్మారితో, ఉక్రెయిన్ యుద్ధంతో కుదేలైన ఆర్థిక వ్యవస్థలకు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాలు ఇబ్బందికరంగానే ఉంటున్నాయి. మరోపక్క ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై పశ్చిమార్థ గోళ దేశాల ఆధిపత్యాన్ని, ముఖ్యంగా అమెరికా పెత్తనాన్ని బలహీన పరచాలని చూస్తున్న రష్యా, చైనాలకు ఈ పరిణామం సహజంగానే బలాన్నిస్తోంది. అయితే ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో పీకల్లోతు కూరుకుపోయి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అభిశంసనకు గురయిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ శిఖరాగ్ర సదస్సుకు హాజరు కాలేని నిస్సహాయస్థితిలో పడ్డారు. ఆ కోర్టులో దక్షిణాఫ్రికా సభ్యదేశంగా ఉండటం వల్ల అది పుతిన్‌పై జారీచేసిన అరెస్టు వారెంట్‌ను అమలుపరచక తప్పదు. నిజంగా దక్షిణాఫ్రికా ఆ పని చేస్తుందా లేదా అన్న సంగతి అటుంచితే ఈ స్థితిలో హాజరు కావటం పుతిన్‌కే అవమానకరమవుతుంది. దాంతో ఆయన శిఖరాగ్ర సదస్సును ద్దేశించి వీడియో లింక్ ద్వారా మాట్లాడారు. అయితే ఇప్పటికిప్పుడు బ్రిక్స్ దేశాలు అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరేసే స్థితి లేదు. మన దేశం, బ్రెజిల్ అమె రికాకూ, ఇతర పాశ్చాత్య దేశాలకూ సన్నిహితంగా ఉంటున్నాయి. ఆ మాటకొస్తే చైనా సైతం వివిధ అంశాల్లో అమెరికాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, దానితో బాహాటంగా ఘర్షణకు దిగాలనుకోవటం లేదు. రణరంగంలో నిలిచిన రష్యా ఒక్కటే ఇందుకు మినహాయింపు. సదస్సు ప్రారంభంలోనే ఈ ధోరణి కనబడింది. బ్రిక్స్ దేశాధినేతల్లో ఇతరులు సమానత్వం ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలుండాలని మాట్లా డితే... పుతిన్ మాత్రం ఏ రకమైన పెత్తందారీ పోకడలకైనా తాము బద్ధ విరోధులమని కుండ బద్దలు కొట్టారు. తన శత్రువులు నయా వలసవాదాన్ని ప్రోత్సహిస్తున్నారని కూడా ఆరోపించారు. పనిలో పనిగా ఉక్రెయిన్‌లో వర్తమాన సంక్షోభానికి పాశ్చాత్య దేశాల పెత్తందారీతనమే కారణమన్నారు.

కూటమి విస్తరణ, దాని అమరిక ఎప్పుడూ ఒకేలా ఉండదు. సాధారణ పరిస్థితుల్లో ఉన్న కూటమి సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడు చెల్లాచెదురు కావొచ్చు. కొత్త దేశాలొచ్చి అందులో చేరవచ్చు కూడా. తన ప్రయోజనాలకు అనుగుణంగా బ్రిక్స్ విస్తరణ ఉండాలని చైనా ఏడాదిగా ప్రయత్నిస్తోంది. మన దేశం కూడా ఆ దిశగానే అడుగులు వేసింది. నిరుడు బీజింగ్‌లో జరిగిన సదస్సులోనే విస్తరణపై ఆలోచన బయల్దేరింది. సభ్యత్వానికి అర్హతలు, కూటమిలో చేరాక ఆ దేశాలు అనుసరించాల్సిన విధానాలు వగైరాలకు ఈ ఏడాదికాలంలో తుది రూపం ఇచ్చారు. పెద్ద ఆర్థిక వ్యవస్థలు, మెరుగైన వృద్ధి రేటు ఉండేవాటినే సభ్యదేశాలుగా చేర్చుకోవాలని బ్రిక్స్ మూలవిరాట్టులైన అయిదు దేశాలూ ఏకాభిప్రాయానికొచ్చాయి. అలాగే ఇకపై కూడా అయిదు దేశాలూ ఏకాభిప్రాయానికొస్తే తప్ప ఏ దేశానికీ సభ్యత్వం ఇవ్వరాదన్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదనకు అంగీకారం లభించింది. బహుళత్వం, సుస్థిర, శాంతియుత అభివృద్ధి, పరస్పర సహకారంతో ఎదుగుదల, సంస్థాగత అభివృద్ధి, బ్రిక్స్ దేశాల ప్రజానీకం మధ్య సంబంధాలు నెలకొల్పటం వగైరాల సాధనకు కృషి చేయాలన్న జోహన్నెస్‌బర్గ్ డిక్లరేషన్ సంకల్పం నెరవేరే దిశగా అడుగులు పడితే సంస్థ భవిష్యత్తులో మరింత బలపడుతుంది. ఎప్పటిలాగే ఘర్షణల విషయం వచ్చేసరికి డిక్లరేషన్ ఆచితూచి వ్యవహరించిందనాలి. నిర్మాణాత్మక చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చి ఊరుకుంది. అంతేతప్ప ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించలేదు.

బ్రిక్స్ స్వభావరీత్యా స్వేచ్ఛా వాణిజ్య కూటమి వంటిది కాదు. దేశాల మధ్య సమన్వయం సాధించి, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఎదగాలన్నది ఈ కూటమి ప్రధాన ధ్యేయం. బ్రిక్స్ కరెన్సీ అంటూ ప్రత్యేకించి లేకపోయినా ఆయా దేశాల కరెన్సీలు బలపడేందుకు అవసరమైన సాయాన్ని అందించటం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. ఈసారి శిఖరాగ్ర సదస్సులో ఉమ్మడి కరెన్సీ గురించిన ఆలోచన చేస్తారని వినబడినా అదేం జరగలేదు. అయితే 2015లో కూటమి ఏర్పాటు చేసిన న్యూ డెవెలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) సమర్థవంతంగానే పనిచేస్తోంది. కూటమిలో కొంత వెనకబడిన దేశాలకు ఈ సంస్థ ద్వారానే సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇప్పటికైతే బ్రిక్స్‌లో చేరడానికి దక్షిణార్ధ గోళ దేశాల ఉత్సాహాన్ని సంపన్న దేశాలు ఒక హెచ్చరికగా పరిగణించక తప్పదు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న దేశాల ఆకాంక్షలను గుర్తించి తగినవిధంగా వ్యవహరించకుంటే బ్రిక్స్ మాత్రమే కాదు... భవిష్యత్తులో మరిన్ని కూటములు ఉనికిలోకొస్తాయి. ఒకటైతే నిజం – ఆవిర్భవించి పదిహేనేళ్లయినా బ్రిక్స్ సంస్థాగత స్వభావాన్ని సంతరించుకోలేదు. ఆ దేశాలమధ్య పరస్పర ఐక్యతగానీ, ఉమ్మడి లక్ష్యాలుగానీ లేవు. ఆ లోపాన్ని సవరించుకుంటే బ్రిక్స్ మరింత పటిష్టవంతమైన కూటమిగా రూపుదిద్దుకోవటం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి రా.8.27 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.36 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.10.32 నుండి 12.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** రా.7.55 నుండి 9.31 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మన సత్తా ఇప్పుడే తెలిసిందా?

సందర్భం


ప్రసాద్ నాయుడు

తెలుగు సినిమాను చాలాకాలం పాటు కేంద్ర ప్రభుత్వ అవార్డుల కమిటీ సభ్యులు, క్రిటిక్స్ తక్కువ చేసి చూపించడానికి ప్రయత్నించారు. కానీ, ఇప్పుడు తెలుగు సినిమా జూలు విదిలిస్తోంది. 2021కి గాను ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు సినిమాకు 11 అవార్డులు దక్కాయి. నేషనల్ ఫిల్మ్ అవార్డుల చరిత్రలో తొలిసారిగా ఒక తెలుగు నటుడికి జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ రావడం అభిమానులనే కాదు – పరిశ్రమనూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తెలుగు వాడికి టాలెంట్ ఎప్పుడూ ఉంది, కానీ ప్రపంచం ఇప్పుడే తెలుగు సినిమా ప్రతిభ తెలుసుకుంటోంది.

ఆగస్ట్ 23న చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశం, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు అందరూ గర్వపడ్డారు. ఆ మరుసటి రోజునే తెలుగు సినిమా చంద్ర మండలం ఎక్కినంతగా సంబరం చేసుకుంటోంది. కారణం అందరికీ తెలిసిందే! 2021వ సంవత్సరానికి గాను ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు సినిమాకు ఏకంగా 11 అవార్డులు దక్కాయి. సంఖ్యా పరంగానే కాకుండా – 69 సంవత్సరాల నేషనల్ ఫిల్మ్ అవార్డుల చరిత్రలో తొలిసారిగా ఒక తెలుగు నటుడికి జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ రావడం తెలుగు సినిమా అభిమానులనే కాదు– తెలుగు సినిమా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇక్కడ మౌలికంగా ఓ ప్రశ్న తలెత్తుతుంది. తెలుగు సినిమా రంగంలో ఎందరో మహా నటులున్నారు. వారెవరికీ దక్కని గౌరవం, గుర్తింపు– అభిమానుల చేత 'ఐకాన్ స్టార్' అని పిలిపించుకునే అల్లు అర్జున్‌కు రావడం సంతోషదాయకం. అలాగని ముందు తరాల నటుల గురించి, ఏ మాత్రం తక్కువగా ఆలోచించినా మహాపరాధం!

ఒక నిజం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా – తెలుగు సినిమాను చాలాకాలం పాటు కేంద్ర ప్రభుత్వ అవార్డుల కమిటీ సభ్యులు, మిగిలిన భాషా చిత్రాల మార్కెట్లు, క్రిటిక్స్ తక్కువ చేసి చూపించడానికి ప్రయత్నించారు. ఎన్.టి. రామారావు గారి 'పాతాళ భైరవి', అక్కినేని నాగేశ్వరరావు గారి 'సువర్ణ సుందరి' – హిందీలోనూ ఏడాది పైన ఆడిన చరిత్ర ఈ జనరేషన్‌కి తెలియకపోవచ్చు. అలాగే జకార్తా ఇంటర్ నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో 'నర్తన శాల' సినిమాలో ఎస్.వి. రంగారావు పోషించిన కీచక పాత్రకు ఉత్తమ నటుడిగా లభించిన గౌరవం కొందరికే గుర్తుండవచ్చు.

పైగా పది, పదిహేనేళ్ళ క్రితం వరకూ అవార్డులను... నేచురల్‌గా ఉండే సినిమాలు అనండి, ఆర్ట్ ఫిలిమ్స్ అనండి... వాటికి మాత్రమే ఇవ్వాలనే ఒక ప్రత్యేక ధోరణి ఉండేది. బాక్సాఫీస్ దగ్గర డబ్బులు వసూలు చేసిన సినిమాలకూ, అందులో పని చేసినవాళ్ళకూ ఎక్కువ శాతం అవార్డులు వచ్చేవి కాదు. వచ్చేవి కాదు అనే కన్నా ఇచ్చేవాళ్ళు కాదనడం కరెక్ట్! పక్క భాషల నటులు ఒక్కొక్కరికి 2–3 అవార్డులు వచ్చిన సందర్భాలున్నాయి. అదే సమయంలో మన తెలుగు నటులను గుర్తించడం లేదేంటని బాధ పడుతుండేవాళ్ళు. అందుకే 30 ఏళ్ళ నుంచి ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డ్ ప్రవేశపెట్టి, కమర్షియల్ సినిమా కన్నీరు తుడిచే ప్రయత్నం చేశారు.

అయిదారేళ్ళ క్రితం వరకూ భారతీయ వినోదాత్మక రంగం నుంచి వచ్చే ఆదాయంలో తెలుగు సినిమా వాటా 18–19 శాతం ఉండేది. బాలీవుడ్ రెవిన్యూ తర్వాత స్థానం తెలుగు సినిమాదే. ఇప్పుడు ఈ వాటా 30 శాతం వరకూ పెరిగిందని విన్నాను. కేవలం ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాదు! అన్ని వందల, వేల కోట్ల ఆదాయం ఎన్ని వేల కుటుంబాలకు ఉపాధి కలిగిస్తోందో అన్న





విషయం ప్రధానంగా గమనించాలి.

ముఖ్యంగా ఇవాళ ఆర్ట్ ఫిలిమ్స్ తీసేవాళ్ళు, ఆదరించేవాళ్ళు తగ్గిపోయారు. అవతల ఆస్కార్ అవార్డుల్లో (మన వాళ్ళందరికీ అదే కొలమానం కాబట్టి) బాక్సాఫీస్ సక్సెస్ అయిన సినిమాలకూ, క్రైమ్ డ్రామాలకూ అవార్డులు ఇస్తున్నప్పుడు కమర్షియల్ సినిమాలు భారత దేశంలో ఏం పాపం చేసుకున్నాయి? జనం బాగా ఆదరించిన సినిమాల్లో కళాత్మక విలువలు ఉండవా? అత్యద్భుతమైన ప్రతిభా పాటవాలు ఉండవా? ఎన్ని పదుల, వందల కోట్ల పారితోషికాలు తీసుకున్నా, ప్రతి కళాకారుడూ కోరుకునేది తన పనిని ఎక్కువ మంది మెచ్చుకోవాలని! మేధావులు, అవార్డుల కమిటీల్లో గొప్పవాళ్ళ నుంచి ప్రశంసలు, సత్కారాలు అందుకోవాలని! ఇందులో తప్పేం ఉంది? అమితాబ్‌కి ఉత్తమ నటుడు అవార్డ్ వచ్చినప్పుడూ, రజనీ కాంత్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రదానం చేసినప్పుడు కూడా కొన్ని విమర్శలు వచ్చాయి. వాళ్ళు దేశవ్యాప్తంగా పాపులర్ స్టార్స్ అయినంత మాత్రాన ప్రతిభావంతులు కారా?

ఎవరు అవునన్నా, కాదన్నా – రాజమౌళి 'బాహుబలి'తో ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ రీ–సౌండ్ తెలుగు సినిమా వినిపించింది. అప్పటి నుంచి తెలుగు సినిమా రంగం గురించి మన దేశంలోనే కాదు... ప్రపంచంలోని సినిమా అభిమానులందరికీ తెలిసింది. ఈ రోజు జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పనితనం, ప్రతిభ తెలిసిందంటే... తెలుగు సినిమా తనని తాను పెంచుకున్న స్థాయి. లాబీయింగ్ అంటే ఇదే! తెలుగు సినిమా తన టాలెంట్‌తో భారతదేశంలోని సినిమా అభిమానులు, కమిటీ సభ్యుల దగ్గర లాబీయింగ్ చేసింది! భారీ స్థాయిలో – ఊహకందని విజువల్స్‌తో, మార్కెట్ రిస్క్ చేసి సంపాదించుకున్న రెస్పెక్ట్ ఇది! రాజమౌళి 'ఆర్.ఆర్.ఆర్.' ఆస్కార్ స్థాయిలో అందుకున్న అవార్డులకూ, గుర్తింపునకూ ఈ జాతీయ అవార్డులు ఓ కొనసాగింపు! అలాగే శ్రీశ్రీ, వేటూరి, సుద్దాల అశోక్ తేజ సరసన ఇప్పుడు చంద్ర బోస్ జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డును అందుకున్నారు. ప్రేమకథల్లో ఓ షాకింగ్ పాయింట్‌తో వచ్చిన 'ఉప్పెన' సినిమా తెలుగులో ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డ్ గెలుచుకోవడం అభినందనీయం!

ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకున్న తొలి తెలుగు నటుడిగా చరిత్రలో నిలిచిపోతున్న అల్లు అర్జున్ గురించి రెండు మాటలు చెప్పాలి. ప్రతి నటుడూ కష్టపడతారు. అల్లు అర్జున్ తనకు అసాధ్యం అనుకున్నది కూడా కసిగా సాధించి తీరుతారు. అల్లు అర్జున్‌తో మూడు సినిమాలకు ఓ రచయితగా పని చేసినప్పుడు ఆయనలో గమనించిన కొన్ని లక్షణాల గురించి చెప్పుకోవాలి. క్యారెక్టర్ కోసం తన శరీరాన్ని మలుచుకోవడమే కాదు... డిక్షన్, బాడీ లాంగ్వేజ్ కోసం తనకు రానిది కూడా ఆయన కష్టపడి నేర్చుకుంటారు. 'రుద్రమ దేవి'లో గోన గన్నా రెడ్డి పాత్ర చేసిన సాహసం, 'దువ్వాడ జగన్నాథం (డి.జె.)'లో పురుష సూక్తం పలకడానికి చేసిన ప్రయత్నం, ఇప్పుడు 'పుష్ప'లో ఓ పక్కకు భుజం వంచి (గూని లాంటిది) మరీ చేసిన అభినయం, చిత్తూరు జిల్లా యాస నేర్చుకోవడానికి చూపిన పట్టుదల – ఇవన్నీ అవార్డ్ అందుకోవడానికి కారణాలయ్యాయి.

చివరగా ఓ మాట! తెలుగు సినిమా పుట్టినప్పటి నుంచి (92 సంవత్సరాల కాలం) తన ప్రతిభను చాటి చెబుతూనే ఉంది. అయితే ఆ వెలుగు, వినోదం తెలుగు నేలకే పరిమితమైంది. ఇప్పుడు మన సినిమా ఎల్లలు దాటింది, రిస్క్ గేమ్ ఆడుతోంది. దానికి తగ్గ ప్రతిఫలాలూ అందుకుంటోంది. తెలుగు వాడికి టాలెంట్ ఎప్పుడూ ఉంది, కానీ ప్రపంచం ఇప్పుడే తెలుగు సినిమా ప్రతిభ తెలుసుకుంటోంది. అందుకే ఇన్ని వందల కోట్ల వసూళ్ళు, అవార్డులు, సత్కారాలు, మర్యాదలు! తెలుగు సినిమా ఏం చేస్తోందనేది మిగిలిన భాషా చిత్రాలు, మార్కెట్లు ఇప్పుడు గమనిస్తున్నాయి. కానీ, తెలుగు ప్రేక్షకుల అభిరుచిని ఏనాడో కొందరు గొప్ప దర్శకులు గుర్తించారు. తెలుగు సినిమాకు దగ్గర కావాలని ప్రయత్నించారు. 1970ల చివరలో శ్యామ్ బెనెగల్ 'అనుగ్రహం', మృణాల్ సేన్ 'ఒక ఊరి కథ', గౌతమ్ ఘోష్ 'మా భూమి' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు కమర్షియల్ ప్యాన్– ఇండియా సినిమా కోసం, క్వాలిటీ మేకింగ్ కోసం దేశం తెలుగు సినిమా వైపు తొంగిచూస్తోంది. పాపులర్ సినిమాలకు అన్ని విధాలా పట్టాభిషేకాలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. తెలుగు సినిమా జైత్రయాత్రకు ఇది శుభారంభం!

వ్యాసకర్త ప్రముఖ సినిమా రచయిత, సినీ విశ్లేషకులు
PrasaadNaidu5@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

బ్యాటింగ్ ఫస్ట్



చంద్రుడి మొదటి ఫొటో చూస్తుంటే– కచ్చితంగా మొదట బ్యాటింగ్ చేయాల్సిన పిచ్‌లా కనబడుతోంది. నేను ముగ్గురు స్పిన్నర్లు, ఒక నిజమైన సీమర్, ఇంకో ఆల్‌రౌండర్‌తో వెళ్తాను.

– వసీం జాఫర్, మాజీ క్రికెటర్

సంతోష క్షణాలు



చంద్రయాన్ మిషన్ విజయవంతం కావడం నాకు వ్యక్తిగత అంశం కూడా! ఎందుకంటే, పాఠశాల, కళాశాల రోజుల నుంచీ ఉన్న నా మంచి మిత్రులు అందులో భాగమయ్యారు. కొందరు రామకృష్ణ మిషన్ విద్యార్థులు కూడా 'ఇస్రో'లో ఉన్నారు.

– స్వామి సమర్పణానంద, సాధువు

ఎక్కడ ఆగుతామో!



చంద్రుడి మీదకు చేరినందుకు ఇండియాకూ, ఇస్రోకూ హృదయపూర్వక అభినందనలు. ఇండియా చంద్రుడిని అందుకోవడం ఒకవైపు సంతోషం కలిగిస్తుండగా... అజ్ఞానం, 'జాహిలియత్'(నిరక్షరాస్యత) వైపు వెనక్కి పయనిస్తున్న అఫ్గానిస్తాన్‌ను చూస్తుంటే మరోవైపు బాధ కలుగుతోంది. యూఏఈలో విద్యనభ్యసించడానికి వెళ్తున్న విద్యార్థినులను తాలిబన్లు కాబూల్ విమానాశ్రయంలో ఆపారు.

– అమరుల్లా సలేహ్, అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

అదీ రావాలి!



ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకుండా చంద్రుడి మీద దిగిన మొదటి దేశం ఇండియా.

– డేవిడ్ బాస్కో, ప్రొఫెసర్

ఆ ముఖం చూపాలా?



'ఇస్రో' అద్భుతమైన కవరేజీ అందించింది, కానీ ల్యాండింగ్‌కు సంబంధించిన మంత్రముగ్ధ క్షణాలను చూపడంలో విఫలమైంది. ఎందుకంటే, చంద్రుడిని చూపే కెమెరా ఫీడ్‌తో వెలాసిటీ/డిస్టెన్స్ (వడి/దూరం) స్క్రీన్ చూపడానికి బదులుగా– ఉత్సాహపూరిత ల్యాండర్‌తో మోదీని చూపింది. దాంతో కౌంటర్ '0.0'ని తాకే అద్భుతమైన క్షణాలను భారతీయులు చూడలేకపోయారు. విషాదకరం!

– సిద్ధార్థ్ వరదరాజన్, సంపాదకుడు

అవమానకరం



భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సస్పెండ్ చేసిందని తెలియడం దిగ్భ్రాంతి కలిగించింది. ఇది మొత్తం దేశాన్ని కలవరపెట్టే విషయం. సిగ్గు విడిచిన అహంకారంతో కేంద్ర ప్రభుత్వం మన రెజ్లర్లను నిరాశపరిచింది.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

చైనా ముద్ర



కేవలం ఐదు సభ్యదేశాలున్నప్పుడే 'బ్రిక్స్'కు ఒక ఉమ్మడి గుర్తింపునూ, లక్ష్యాన్నీ తేలేకపోయాయి. ఇప్పుడు మరో ఆరు సభ్య దేశాల చేరికతో ఆ కార్యం మరింత కఠినతరం అవుతుంది. ఈ కొత్త చేరికల మీద రష్యా మద్దతు ఉన్న చైనా ముద్ర ఉంది. (అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ ఆహ్వానిత దేశాలు. యూఏఈ కోసం ఇండియా పట్టుబట్టింది.)

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

నాస్తికత్వమూ మత స్వేచ్ఛే!

భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికీ మత స్వేచ్ఛ ఎలాగైతే ఉంటుందో, నాస్తికత్వాన్ని అనుసరించే హక్కు కూడా ఉంటుంది. రాజ్యాంగంలో 25, 26 అధికరణాలు ప్రజలకుండే మత స్వాతంత్ర్య హక్కు, దానికుండే పరిమితుల గురించి స్పష్టంగా వివరిస్తున్నాయి.

రాజ్యాంగం ప్రకారం మతం ఒక వ్యక్తిగత అంశం. మతరాహిత్య స్థితిని కలిగి వుండటం కూడా మత స్వేచ్ఛలో భాగంగా గుర్తించాలి. నాస్తికులు కూడా వివిధ మత అంశాలపై తమ అభిప్రాయాలను చెప్పవచ్చు. ఈ కారణంగా వారి హక్కులను కాలరాయకూడదు. అయితే ఈ అభిప్రాయాలు రాజ్యాంగ బద్ధంగా ఉండాలి. మతంలో రాజకీయ జోక్యం పెరగడంతో ఇది సున్నితమైన అంశంగా మారింది. ఎవరైనా హేతువాదులు, సైన్స్ వాదులు వివిధ మత ధర్మాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే వారిపై మతోన్మాదులు దాడులకు దిగుతున్నారు. వారిని దూషిస్తున్నారు. వారి ప్రాణాలు తీస్తున్నారు.

రాజ్యాంగంలోని 51ఏ(హెచ్) అధికరణం పౌరులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని సూచిస్తోంది. దీని కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం కృషి చేయాల్సిన బాధ్యతను రాజ్యాంగం గుర్తుకు తెస్తుంది. పౌరులలో శాస్త్రీయ ఆలోచనలు పెంచాలంటే మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలి.

ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి కృషి చేసే వారిని ప్రోత్సహించాలి. వారికి రక్షణ కల్పించాలి. మనోభావాలు నాస్తికులకు కూడా ఉంటాయని ఆస్తికులు గుర్తెరగాలి. ఎవరైనా శాంతియుతంగా ప్రార్థన చేసుకుంటుంటే వారిపై దాడి చేస్తే తప్పు అవుతుంది. హేతువాదులు ఎవరూ అలా చేయరు. అందుకు చట్టం కూడా ఒప్పుకోదు. ఏ విధంగానైతే మత విశ్వాసులకు తమ అభిప్రాయాలను తెలియజేసే హక్కు ఉంటుందో, నాస్తికులకు కూడా తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ఉంటుంది. దీన్ని ఆస్తికులు గుర్తించాలి. ఎందుకంటే ప్రశ్నే ప్రగతికి మూలం. ప్రతి కొత్త మతం, అంతకు ముందు ఉన్న ఆచార వ్యవహారాలతో ఘర్షణ పడే ఆవిర్భవించింది. అనేక శతాబ్దాలుగా పలువురు శాస్త్రవేత్తలు సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన విశ్వాసాలను ప్రశ్నించబట్టే కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడింది. వీటి వల్ల మనం ఎన్నో సౌకర్యాలు పొందుతున్నాం.

– ఎం. రాం ప్రదీప్, తిరువూరు | 94927 12836

ఉద్దేశ్యం ఒకటి... పైకి చెప్పేది మరొకటి!

అభిప్రాయం


మాడభూషి శ్రీధర్

సమానత్వం పేరుతో 'అందరికీ ఒకే చట్టం' వర్తింపచేస్తామంటే రాజ్యాంగం ఒప్పుకోదు. ఆర్టికల్ 44లో ఉన్న ఆదేశిక సూత్రాలకూ, ఆర్టికల్స్ 25, 29లోని ప్రాథమిక హక్కులకూ వైరుధ్యం ఉంది. హక్కులను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంటుంది, కాని ఆర్టికల్ 44 ఆదేశిక సూత్రమే కాని ఆదేశం కాదు. తమ మత వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు మైనారిటీలకు ఉందని ఆర్టికల్ 25 చెబుతోంది. భాష, సంస్కృతి పరమైన విభిన్న ఆచార సంప్రదాయాలను రక్షించుకునే హక్కు ఆర్టికల్ 29 కింద అన్ని మతాలవారికీ ఉంది.

ఒక వ్యక్తి (భర్త)కి ఒక భార్య సమాన న్యాయం. కాని కొన్ని సందర్భాల్లో సంఖ్య మించుతోంది. ముస్లిం స్త్రీలలో 1.9 శాతం మంది తమ భర్తకు మరో భార్య (వ్యక్తి) ఉన్నదని అంటే, హిందూ మహిళల్లో 1.3 శాతం మంది తమ భర్త ఇద్దరు భార్యలను కలిగి ఉన్నట్లు దేశం మొత్తం మీద జరిపిన ఓ సర్వేలో తెలిపారు. బహు భార్యాత్వానికి కొన్ని మతాలు అనుమతిస్తాయి. దాని అర్థం అందరూ ఇద్దరు భార్యలు కలిగి ఉండాలని కాదు. అది కేవలం ఆచారం మాత్రమే. ఆచారం ఉన్నంత మాత్రాన దానిని తు.చ. తప్పకుండా పాటించాలనేం లేదు. చాలామంది ముస్లింలు కూడా ఒకే భార్యను కలిగి ఉన్నారనే సంగతి ఈ సందర్భంగా గమనార్హం. బహు భార్యాత్వం దాదాపు అన్ని మతాలలోనూ ఉన్నదనీ, కాని ఆ ఆచారాన్ని పాటించేవారు అంతకంతకూ తగ్గిపోతున్నారనీ ప్రముఖ లాయర్, లా కమిషన్ సభ్యుడు దుష్యంత్ అరోరా చెప్పారు. విచిత్రమేమంటే తెలంగాణలో బహు భార్యాత్వాన్ని ఆచరిస్తున్న హిందువుల సంఖ్య ముస్లింల కంటే అధికం అనీ, అస్సాంలో ముస్లింలే ఈ విషయంలో అధిక్యతలో ఉన్నారనీ; కాని బహు భార్యాత్వాన్ని నిషేధించి తీరాలనీ, అది ఎటువంటి మినహాయింపు లేకుండా కచ్చితంగా అన్ని మతాల వారికీ వర్తింపచేయాలని అంటే వచ్చే ప్రమాదం అధికమని 21వ లా కమిషన్ వివరించింది.

2019లో మూడుసార్లు 'తలాక్' చెప్పడం ద్వారా



ముస్లిం పురుషులు తమ భార్యలకు విడాకులు ఇచ్చే సంప్రదాయాన్ని నిషేధిస్తూ కేంద్రం చట్టం తెచ్చింది. భారతీయ స్త్రీలందరికీ విడాకుల పరంగా ఒకే చట్టం ఉండాలనేది తమ ఆలోచనగా ప్రభుత్వం ఈ సందర్భంగా పేర్కొంది. ఇటువంటి చట్టాలు చేసే బదులు తండ్రి ఆస్తిలో కుమార్తెలకు హక్కు కల్పించే చట్టం తేవచ్చు కదా! తలాక్ నిషేధ చట్టం ముస్లిం మహిళలకు ఏమాత్రం రక్షణ కల్పిస్తుందో చెప్పలేం. ఎందుకంటే ఇప్పటికే దేశంలో ఉన్న చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు కదా! కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో తెచ్చిన 'గృహహింస చట్టం' కానీ, 2007లో తెచ్చిన 'మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్' కానీ ఏ మతంతో సంబంధం లేకుండా అందరికీ మేలు చేసే గొప్ప చట్టాలు. ఇటువంటి చట్టాలు చేయడం మాని సమానత్వం పేరుతో మైనారిటీల ఆచార సంప్రదాయాల్లో జోక్యం చేసుకోవడానికి వీలు కల్పించే 'ఉమ్మడి పౌర స్మృతి' (యూసీసీ) తీసుకురావాలనుకోవడం సమంజసమేనా?

చట్టాలున్నాయనీ, లేదా రాజ్యాంగం నిషేధించిందనీ ఒకరికన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉండడానికి భయపడతారనుకోవడానికీ వీల్లేదు. వివిధ మతాలకు చెందినవారు చట్టం, ఆచారంతో సంబంధం లేకుండా ఒకరి కన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉన్నారు కదా! అలా కలిగి ఉన్నారని తెలిసిన వెంటనే ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తోందా? పోనీ ఒక భార్యను వదిలేసి ఆ భర్త వెళ్లిపోతే బతికేందుకు తనంతట తాను భరణం ఏమైనా ఇప్పిస్తోందా?

రాజ్యాంగంలోని 14, 15, 16 అధికరణాలు సమానత్వం గురించి ఘోషిస్తున్నాయి. నిజానికి ప్రభుత్వం ఎంతవరకు ఈ నిబంధనల ప్రకారం సమాన న్యాయాన్ని అందిస్తోంది? ఉన్న చట్టాలను అమలు పరచడంలో చిత్తశుద్ధి చూపకుండా ఎన్‌డీఏ ప్రభుత్వం పౌరులందరికీ సమాన న్యాయం కోసం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తున్నామని చెప్పడం నమ్మేలా లేదు.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా డీన్

సేవే సాధన

ధర్మాన్ని తప్పకుండా ఎవరైతే ప్రకృతితో అనుసంధానమై జీవితాన్ని గడుపుతారో, పరహితమే ధ్యేయంగా ఎవరైతే నిస్వార్థంగా జీవిస్తారో, ఎవరి ప్రార్థనలు, ధ్యానం మానవాళి మేలుకోసమే సాగుతాయో, జీవించినంత కాలం ఎవరు ఆచరణాత్మకంగా బోధ చేస్తారో అటువంటి వారు ఈ భువిపై భగవంతుని వాహికలుగా వర్తించే అవకాశం ఉంది. వారు యోగులై ఉంటారు. రాజయోగులై ఇతరులను ఉద్ధరిస్తారు. అలాంటి వారిలో మాస్టర్ ఎమ్ఎస్ (మైనంపాటి నరసింహం పంతులు) ఒకరు. మాస్టర్ సీవీవీ పరంపరలో ఆయన ఒకరు.

సర్వసంగ పరిత్యాగం చేయకుండా గృహస్థుగా యోగంలో ఉంటూ భగవంతుని చేరవచ్చని నిరూపించిన గురుపరంపరలో ఎమ్ఎస్ ఒకరు. 1883 ఆగస్టు 25న గుంటూరు జిల్లాలో ఆయన జన్మించారు. ఆయనకు రోల్ మోడల్ మేనమామ టంగుటూరి ప్రకాశం పంతులు. ఒంగోలు, బాపట్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ మంచి పేరు సంపాదిస్తున్న క్రమంలో... కుటుంబ సభ్యుల వరుస మరణాలు ఆయన్ని వైరాగ్యం వైపు నడిపించాయి. తన చిన్న మేనమామ సలహాపై 'కుంభకోణం'లో ఉన్న సాధకులు మాస్టర్ సీవీవీ (వెంకారావ్ సామి)ని కలిశారు. 'భృక్త రహిత తారక రాజయోగము' ద్వారా సాధకులు తమను తాము త్వరిత గతిన తెలుసుకొనేటట్లు చేయడం లక్ష్యంగా సీవీవీ పాటుపడుతున్న కాలమది. ఎమ్ఎస్ ఒంగోలులో అనేక సాధనా బృందాలను తయారుచేశారు. ఆయన ఆచరించిన మార్గంలో ముఖ్యమైనది ప్రార్థన స్వహితం కోసం కాక పరహితం కోసం చేయాలి. ధ్యానం ప్రపంచ శాంతి కోసం చేయాలి. నిస్వార్థంగా సేవ చేయడం సాధనలో ప్రాథమికమైనది. అందులో భాగంగానే అన్నసమారాధన, ఉచిత వైద్యం, ఉచిత విద్య వంటి కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఆయన శిష్యులు ఈ సేవలను కొనసాగిస్తున్నారు.

మాస్టర్ ఎమ్ఎస్ 1940 మార్చి 11న ధ్యాన మందిరంలో కూర్చొని తన దేహం నుంచి తనంతట తాను నిష్క్రమించారు. ఈ సంఘటనను 'మాస్టర్ ఎం.ఎస్. ద ఫైరీ ఫ్లేమ్' రచయిత మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్ 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్' అన్నారు.

– శ్రీనివాసరావు నట్టి, జర్నలిస్ట్
(నేడు మాస్టర్ ఎమ్.ఎస్. జయంతి)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

పోలీసుల అదుపులో జనశక్తి అగ్రనేతలు!

- కూర రాజన్న, అమర్, మరో నలుగురు
- విడుదల చేయాలని విమలక్క డిమాండ్


కూర రాజన్న


అమర్

సిరిసిల్ల: సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ అగ్రనేతలు కూర రాజన్న అలియాస్ రాజేందర్, కూర దేవేందర్ అలియాస్ అమర్, వెంకటేశ్‌తోపాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు విమలక్క, కొమురన్న, సంతోష్ గురువారం ప్రకటించారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్తున్న రాజన్న, అతనితోపాటు ఉన్న వెంకటేశ్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. అమర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. 12 రకాల అనారోగ్య సమస్యలతో ఉన్న కూర రాజన్నతోపాటు అతని సహాయకుడు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఈ ముగ్గురికి సంబంధించిన ఫోన్లు స్విచాఫ్ వస్తున్నాయని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రకటించింది. పోలీసులు వెంటనే వారిని మీడియా ముందు ప్రవేశపెట్టి, ఏమైనా కేసులుంటే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. వారికి ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు. కాగా, కూర రాజన్న, అమర్, వెంకటేష్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం సమీపంలోని ఒక తోటలో విచారిస్తున్నట్లు తెలిసింది.

బీసీ వ్యతిరేక పార్టీ బీఆర్ఎస్: జాజుల



సాక్షి,యాదాద్రి/కాజీపేట రూరల్: ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం చేసి తన వ్యతిరేకతను చాటుకున్న బీఆర్ఎస్‌ను వదిలేది లేదని, వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీ కి గుణపాఠం చెబుతామని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీఆర్ఎస్ సీట్ల కేటాయింపుపై గురువారం యాదాద్రి జిల్లా భువనగిరిలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటే రెడ్లు, రావుల సమితిగా మారిందని ఎద్దేవా చేశారు. కాగా, హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమా నగర్ వైష్ణవిగ్రాండ్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ కుల సంఘాలు, బీసీ సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు అధికారం కోసం తిరుగుబాటు చేయాలన్నారు.

సేత్వార్ సమస్యలకు 'చెక్'

- ఇకపై ఒక సర్వే నంబర్‌లోని భూముల హెచ్చుతగ్గులను నమోదు చేయొచ్చు
- పేరు, ఆధార్ సవరణలకు టీఎం 33 మాడ్యూల్‌లో ప్రత్యేక అవకాశం
- పాస్‌బుక్ సవరణల్లో వెనక్కు పంపిన దరఖాస్తులు ప్రత్యేక ఫార్మాట్‌లో కలెక్టర్ వద్ద అందుబాటులో
- ధరణి పోర్టల్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టింది. సేత్వార్ నమోదులో జరిగిన పొరపాట్లను సవరించి ఒక సర్వే నంబర్‌లోని భూముల హెచ్చుతగ్గులను నమోదు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ధరణి పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన కొత్త ఆప్షన్లపై భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లకు గురువారం సమాచారం పంపారు. వాస్తవానికి, ధరణి పోర్టల్‌లో సర్వే నంబర్లలోని భూములను నమోదు చేసే విషయంలో కొన్నిచోట్ల పొరపాట్లు జరిగాయి. కొన్ని సర్వే నంబర్లలో ఉన్న వాస్తవ భూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. దీంతో ఆ భూమి నమోదైన మేరకు మాత్రమే రైతులకు పాసు పుస్తకాలు ఇవ్వడంతోపాటు క్రయవిక్రయ లావాదేవీలకు ధరణి పోర్టల్ అనుమతినిచ్చింది. తద్వారా ఆ భూమిలో ఏళ్లుగా కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న రైతులకు పాసు పుస్తకాలు రాకపోయినా ఏమీ చేయలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు సేత్వార్ నమోదు, సవరణలకు ధరణి పోర్టల్‌లో అవకాశం ఇవ్వడంతో ఈ సమస్యకు చెక్ పడుతుందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి. అదేవిధంగా వ్యవసాయేతర భూములను ఒకరి కంటే ఎక్కువ మంది అమ్మేందుకు, కొనేందుకు అవకాశముంది. కానీ, ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు ఇప్పటివరకు ఒక్కరి పేరు మీదనే జరిగేవి. దాన్ని మార్చడం ద్వారా ఒకరి కంటే ఎక్కువ మంది భూమి అమ్మేందుకు, భూమి కొనేందుకు అవకాశం కలగనుంది. ఇక, భూసేకరణ సమయంలో గత మూడేళ్ల కాలంలో జరిగిన లావాదేవీల సగటు విలువను లెక్కించి పరిహారాన్ని రైతుకు చెల్లిస్తారు. దీనికి అవసరమైన మార్కెట్ విలువ సర్టిఫికెట్‌ను ధరణి పోర్టల్ ద్వారా ఇచ్చే ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో భూములను మార్ట్‌గేజ్ (తనఖా) చేసుకునేందుకు అడుగుతున్న కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేకుండా మార్పులు చేశారు. సదరు భూయజమాని ఎస్టీ అని సంబంధిత తహసీల్దార్ నమోదు చేస్తే సరిపోయేలా మార్పు చేశారు.



టీఎం 33 మాడ్యూల్‌లో..

ధరణి పోర్టల్‌లో రైతులు ఎక్కువగా ఉపయోగించుకునే టీఎం33 మాడ్యూల్‌ను తాజా మార్పుల్లో మరింత సులభతరం చేశారు. ఉదాహరణకు గతంలో టీఎం 33 ద్వారా పేరు మార్పు చేయాలనుకుంటే ఆ పేరుతోపాటు ఇతర వివరాలన్నింటినీ నమోదు చేయాల్సి వచ్చేది. ఆ క్రమంలోనే ఇతర వివరాల నమోదులో పొరపాట్లు దొర్లి కొత్త సమస్యలు వచ్చేవి. అలా కాకుండా ఇప్పుడు టీఎం33 మాడ్యూల్ ద్వారా పేరు, లింగం, ఆధార్, కుల కేటగిరీల్లో ఏది అవసరమైతే దాన్ని మాత్రమే సరిదిద్దుకునేలా, ఇతర వివరాలను నమోదు చేయాల్సిన అవసరం లేకుండా మార్పులు చేశారు. పాసు పుస్తకాల దిద్దుబాటు క్రమంలో కలెక్టర్లు వెనక్కు పంపిన దరఖాస్తుల వివరాలకు సంబంధించిన రిపోర్టు అందుబాటులో ఉండేది కాదు. ఇప్పుడు ఎక్సెల్ ఫార్మాట్‌లో ఆ రిపోర్టు అందుబాటులో ఉండేలా ధరణి పోర్టల్‌లో మార్పులు చేయడం గమనార్హం. అదేవిధంగా గ్రామ పహాణీలు కలెక్టర్‌తోపాటు సీసీఎల్ఏ లాగిన్‌లో కూడా అందుబాటులో ఉండేలా మార్పులు చేశారు.

మల్లన్నకు ముత్తిరెడ్డి ముడుపు

- కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని మోకాళ్లపై దీక్ష
- పల్లాపై తీవ్ర విమర్శలు


ముడుపును పట్టుకుని మోకాళ్ల పై ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

సాక్షి, సిద్దిపేట: వంద సీట్లకు పైగా గెలిచి మూడోసారి కె.చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రి కావాలని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కొమురవెల్లి మల్లిఖార్జునస్వామికి ముడుపు కట్టారు. మోకాళ్లపై కూర్చుని దీక్షచేపట్టి స్వామిని వేడుకున్నారు. గురువారం కొమురవెల్లికి భారీ ఎత్తున కార్యకర్తలతో ర్యాలీగా తరలివచ్చిన ముత్తిరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్తిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ...బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. దేశమంతా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యకర్తలకు బీమా, కాంట్రాక్ట్ ఉద్యోగులు, వీఆర్ఏలను క్రమబద్ధీకరణ వంటివి తాను చెబితేనే చేశారని ఇటీవల ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనడం తగదని ముత్తిరెడ్డి హితవు పలికారు. సీఎం కేసీఆర్‌కే పాఠాలు నేర్పుతున్నానని పల్లా అనడం ఆయన అహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు. పల్లాకు చెందిన కళాశాల స్థలం ఆయన సోదరి డబ్బులతో కొనుగోలు చేసి కబ్జా చేసిందికాదా అని, ఆ ఘటనతో ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లింది వాస్తవమో కాదో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతానని, గతంలోకంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

కార్యాచరణపై రేపు మైనంపల్లి భేటీ



అల్వాల్: ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం పార్టీ శ్రేణులు, అనుచరులతో శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం తిరుపతిలో ఆయన చేసిన వ్యాఖ్యలతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తనతోపాటు కుమారుడికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంత్రి హరీశ్ వైఖరి పట్ల ఘాటు విమర్శలు చేసిన సంగతి విదితమే. ఈ వ్యాఖ్యల పట్ల మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తమదైన శైలిలో స్పందించారు. పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం జరుగున్న ఈ సమావేశంలో తాను తీసుకునే నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు, అనుచరులకు మైనంపల్లి వెల్లడించే అవకాశం ఉంది. పార్టీ మారుతారనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో జరుగుతున్న సమావేశంపై అంతటా ఆసక్తి నెలకొంది. శనివారం 10 గంటలకు దూలపల్లిలోని తన నివాసం వద్ద ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు అందరు హాజరు కావాలని పార్టీ శ్రేణులకు ఆయన సమాచారం అందించారు. దీంతోపాటు మైనంపల్లికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సొంత పార్టీ నేతలపై మైనంపల్లి అనుచరులు ఎదురు దాడికి దిగుతున్నారు.

ఇంటికి వెళ్లినా గది నుంచి బయటకు రాలేదు!

- ఎమ్మెల్యే బొల్లంకు మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద చేదు అనుభవం


మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు ఇంటివద్ద వేచి చూస్తున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ బీఆర్ఎస్‌లో అసమ్మతి చల్లారడం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు ఇంట చేదు అనుభవం ఎదురైంది. సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న చందర్‌రావుతో సర్దుబాటు చేసుకునేందుకు మల్లయ్యయాదవ్ గురువారం ఆయన ఇంటికి వెళ్లారు. బొల్లం వెంట అనంతగిరి ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, మునగాల మండల నాయకులు సుంకర అజయ్‌కుమార్, తొగరు రమేశ్ తదితరులు ఉన్నారు. ఇంటిలోపలే ఉన్న చందర్‌రావు తన ఇంటికి ఎమ్మెల్యే బొల్లం వచ్చారని చెప్పినా గది నుంచి బయటికి రాలేదు. దీంతో హాల్‌లోనే ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ దాదాపు 20 నిమిషాలు ఎదురుచూశారు. అప్పటికీ చందర్‌రావు బయటికి రాకపోవడంతో వెనుదిరిగి వచ్చేశారు.

మోత్కుపల్లికి పోటీ చేసే అవకాశం కల్పించాలి

- సీఎం కేసీఆర్‌కు మోత్కుపల్లి అనుచరుల వినతి


అభివాదం చేస్తున్న మోత్కుపల్లి అనుచరులు

యాదగిరిగుట్ట: మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు సీఎం కేసీఆర్‌ను కోరారు. భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం మోత్కుపల్లి నర్సింహులు అభిమానులు, అనుచరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కుపల్లి నర్సింహులు 5 సార్లు ఆలేరు నుంచి, ఒక సారి తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యే గెలిచారన్నారు. రాజకీయాల్లో మంచి అనుభవం ఉన్న మోత్కుపల్లి నర్సింహులును సీఎం కేసీఆర్ దళితబంధు పథకం ప్రారంభ సమయంలో పిలిచి, బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారని తెలిపారు. ఆ సమయంలోనే రాష్ట్ర స్థాయిలో మంచి పదవి ఇచ్చి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు మోత్కుపల్లికి ఎలాంటి పదవులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ నాయకుడికి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు.

'చేప ప్రసాదం' బత్తిని కన్నుమూత

ముషీరాబాద్: చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిని హరినాథ్‌గౌడ్ (79) కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ,విదేశాలకు చెందిన ఉబ్బస వ్యాధిగ్రస్తులకు బత్తిని హరినాథ్‌గౌడ్ చేప ప్రసా దం సుపరిచితమే. బత్తిని 1944లో హైదరాబాద్ లోని దూద్‌బౌలిలో జన్మించారు. 40 సంవత్సరాల క్రితం భోలక్‌పూర్‌లోని పద్మశాలీకాలనీకి వచ్చి స్థిరపడ్డారు. ఆయనకు భార్య సుమిత్రాదేవి, ఇద్దరుకుమారులు అనిల్‌గౌడ్, అమర్‌నాథ్‌గౌడ్, ఇద్దరు కూ తుళ్లు అలకనంద, అర్చనలు ఉన్నారు. బత్తిని చిన్ననాటి నుంచే తన నానమ్మ వద్ద చేప ప్రసాదం త యారీ నేర్చుకున్నారు. కొద్దిరోజులుగా ఆయన షు గర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం రా త్రి షుగర్ లెవల్స్ పెరగడంతో తన స్వగృహంలోనే మృతి చెందారు.

నేడు అంత్యక్రియలు

బత్తిని హరినాథ్‌గౌడ్ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని ఆయన కుమారుడు అమర్‌నాథ్‌గౌడ్ తెలిపారు. బత్తిని మరో కుమారుడు అనిల్‌గౌడ్ ఆస్ట్రేలియా, అక్క అలకనంద అమెరికా నుంచి రావాల్సి ఉంది. వారు హైదరాబాద్‌కు చేరుకోగానే బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

హరియాణా గవర్నర్ సంతాపం

బత్తిని హరినాథ్‌గౌడ్ మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు నిస్వార్థ సేవలు అందించారని దత్తాత్రేయ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

అండగా ఉంటాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన బత్తిని కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మరో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి బత్తిని హరినాథ్‌గౌడ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ హరినాథ్‌గౌడ్ అందించే వైద్యానికి కావాల్సిన ఔషధ మొక్కల పెంపకానికి రాజేంద్రనగర్‌లో గతంలో కేటాయించిన 5ఎకరాల స్థలాన్ని ఆయన కుటుంబానికి దక్కేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గౌడ కులసంఘాల నేతలు బత్తిని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

శంకర్ నాయక్ అయితే ససేమిరా..

- తక్కెళ్లపల్లి వర్గీయుల అసమ్మతి రాగం



సాక్షి, మహబూబాబాద్: 'ఇంతకాలం ఆయన ఆరాచకాలతో విసిగి వేసారిపోయాం. శంకర్‌నాయక్ అయితే మేం పనిచేయలేం. అభ్యర్థిని మార్చమని చెప్పండి. లేకపోతే మా దారి మేం చూసుకుంటాం'అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వర్గానికి చెందిన వారు తమ నాయకుడికి మొరపెట్టుకున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీచేసేందుకు స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఇంటి వద్ద కేసముద్రం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు, మహబూబాబాద్ పట్టణానికి చెందిన పలువురు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్యకార్యకర్తలు సుమారు 200 మంది వరకు సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేయ లేమని ఎమ్మెల్సీకి తేల్చిచెప్పారు. 'ఒకవేళ మేం ఆయన దగ్గరకు వెళ్లినా మమ్మల్ని నమ్మరు. పార్టీ అంటే మాకు ఇష్టమే, కానీ అభ్యర్థితోనే కష్టం'అని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 'మీ సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా.. సంయమనం పాటించండి. అంతా సర్దుకుంటుంది'అని నచ్చచెప్పే ప్ర యత్నం చేశారు.

మీటర్ రీడర్లకు కనీస వేతనమివ్వాలి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 2000 మంది మీటర్ రీడింగ్ కార్మికులకు ప్రస్తుతం అమలు చేస్తున్న పీస్‌రేటు విధానానికి బదులు.. నెలవారీ పనిదినాలు కల్పించాలని, కనీస వేతనాలను ఖరారు చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం (1535 యూనియన్) అధ్యక్షుడు వజీర్, మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమృతం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మంత్రి జగదీశ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ విభాగం
ఫారం-VII
(డిక్లరేషన్)

(భూసేకరణ, పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013)
(కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రూల్ 25 సబ్ రూల్ (1) ప్రకారం)

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం. G1/851/2021 తేది: 14.08.2023
రాజస్వ మండల అధికారి ఫైల్ నెం. G/467/2021 తేది: 29.07.2023
గెజిట్ నెంబర్: 09 తేది: 03.06.2023

దిగువ నిర్దిష్టపరచిన కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, మండలం రెబ్బెన, గ్రామము గోలేటి విస్తీర్ణం 58.09 గుంటలు. భూమి ప్రజాప్రయోజన నిమిత్తం అనగా మండలము రెబ్బెన గోలేటి గ్రామములో బొగ్గు త్రవ్వకము కొరకు దిగువ చూపిన భూములు అవసరమైయున్నదని భావించినందున భూ సేకరణ, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం అనుబంధంలో పేర్కొనిన భూములకై డిక్లరేషన్ ప్రకటన జారీ చేయనైనది.

సదరు భూసేకరణ చట్టం లోని సెక్షన్-10A క్రింద ఇవ్వబడిన అధికారాల అమలులో, తెలంగాణ ప్రభుత్వం జి.ఓ.యం.ఎస్. నం.08 (ENERGY BUDGET.A1) DEPARTMENT, తేది 11.04.2022 ద్వారా కొత్త చెరువు కాలువ నిర్మాణ పథకంను భూసేకరణ చట్టం 2013(30/2013)లోని చాప్టర్-II & IIIలలోని నిబంధనల నుండి మినహాయింపు ఆదేశాలను జారీచేస్తూ, ప్రస్తుత భూసేకరణకు, భూసేకరణ చట్టం 2013 (30/2013)లోని చాప్టర్-II & IIIలలోని నిబంధనల విధానాన్ని అనుసరించవలసిన అవసరం లేదు.

కావున పైన తెలిపిన బొగ్గు త్రవ్వకము కొరకు గాను కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలములో గల గోలేటి గ్రామములో భూముల విస్తీర్ణం 58.09 ఎ/గుంటలు నిర్దిష్ట కొలతలు, ఈ దిగువ షెడ్యూల్‌లో వివరాలతో ఉన్న భూములు భూసేకరణ చేయుటకు ప్రతిపాదించనైనది.

షెడ్యూల్

గ్రామము: గోలేటి మండలము: రెబ్బెన జిల్లా: కుమరం భీమ్ ఆసిఫాబాద్

క్ర. సం.	సర్వే నంబర్ (పహాణీ ప్రకారం)	సర్వే నంబర్ (సేత్వార్ ప్రకారం)	భూమి రకం (మెట్ట, తరి)	భూమి విధము (పట్టా, ప్రభుత్వ, ఇనామ్ మొ.)	భూ సేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గుం లలో)	పేరు, చిరునామా (భూమి సంబంధించిన పట్టాదారు వివరాలు)	పేరు, చిరునామా (భూమి సంబంధించిన కాస్తుదారు వివరాలు)	విస్తీర్ణం	చెట్లు రకం/ సంఖ్య కట్టడము రకం & విస్తీర్ణం చ.గజము లలో
1	2	2-a	3	4	5	6	7	8	9
1	230	230/పి	మెట్ట	లావణి పట్టా	4-008	[illegible]	[illegible]	0-14	[illegible]
2	230	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
3	230	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
4	230	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
5	230	230	-	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
6	231	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
7	231	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
8	231	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
9	232	232	మెట్ట	పట్టా	12-22	[illegible]	[illegible]	[illegible]	[illegible]
10	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
11	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
12	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
13	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
14	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
15	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
16	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
17	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
18	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
19	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
20	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
21	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
22	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
23	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
24	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
25	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
26	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
27	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
28	315	[illegible]	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
29	315	[illegible]	-	-	-	-	[illegible]	[illegible]	
30	315	-	-	-		-	వాగు (Nala)	2.03	
			మొత్తం					30-19	
			పూర్తి మొత్తం					58-09	

ABSTRACT

1. గోలేటి గ్రామము	58.09 ఎకరములు/ గుంటలు
మొత్తము విస్తీర్ణము	58.09 ఎకరములు/ గుంటలు

ఇట్టి డిక్లరేషన్, భూసేకరణ, పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013లోని నియమములోని సెక్షన్ 19 (1) ప్రకారంసంబంధిత భూయజమానులకు సరియైన భూ నష్టపరిహారము చెల్లించుటకుగాను డిక్లరేషన్ జారీ చేయనైనది.

ప్రతిపాదిత భూసేకరణ చట్టం 30/2013 క్రింద చట్టంలోని సెక్షన్ 15(1) అంశాలపై భూసేకరణపై అసక్తిగల వ్యక్తుల నుండి ఎలాంటి అభ్యంతరాలు రానందున సెక్షన్ 19(1) ప్రకారం డిక్లరేషన్ జారీ చేయనైనది ఇట్టి భూసేకరణ వల్ల ఎవరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన వర్తించదు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ గారు రెవిన్యూ డివిజనల్ అధికారి, ఆసిఫాబాద్ గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధిత సెక్షన్ - 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదేని ప్రదేశంలో ప్రవేశించి సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని తవ్వడానికి లేదా భూ స్వరూపం తెలుసుకొనుటకు బోర్ బావి వేయడానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ మరియు వివరములు ఏదేని పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆసిఫాబాద్ వారి కార్యాలయములలో సంబంధిత వ్యక్తులు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉంచనైనది.

ప్రదేశం: ఆసిఫాబాద్, తేది: 14.08.2023

సం/- భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి ఆసిఫాబాద్
సం/- జిల్లా అదనపు పాలనాధికారి కుమ్రం భీం ఆసిఫాబాద్
సం/- జిల్లా పాలనాధికారి కుమ్రం భీం ఆసిఫాబాద్

DIPR RO No.556/LA-PP/Advt/Pub/2023-24

OFFICE OF THE NARAYANPET MUNICIPALITY
'E'-Procurement Notice
Tender Notice No. E1/DC/NRPT/DY-K/DEE/2023-24 Date: 23.08.2023
Total No. of Works: 01 Work, Estimated Cost: 05 Lakhs, Bid Submission Start Date & Time: 24-08-2023 10:00 AM, Bid Submission Closing Date & Time: 28-08-2023 11:00 AM, PQ Stage/Commercial Stage: 28-08-2023 11:01 AM. Further details can be seen @ e-procurement market place i.e. https://tender.telangana.gov.in Officer inviting bids Commissioner, Narayanpet Municipality Narayanpet Ditst., Telangana. Ph: 9618099288, 9618099244 and 9160333912.
Sd/- (V.Sumtha) Commissioner, Narayanpet Municipality
DIPR RO No.5736-PP/CL/Advt/1/2023-24, Dt. 24.08.2023

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
పురపాలక సంఘం ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్
E1/10/MCA/2023, టెండరు & కొటేషన్ నోటీస్ తేది: 23-08-2023
పట్టణములో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆడుంబి సరఫరా బర్కీ దూభానా నిర్మాణము చేయుటకు, ఇతర నిధులతో ఆర్.సి.సి. పైపులు కొనుగోలు చేయుట మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరుచున్నాము. మిగతా వివరాల కొరకు తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ https://tender.telangana.gov.in లో లేదా పురపాలక సంఘ కార్యాలయము పని వేళల్లో సంప్రదించగలరు. మరియు సానిటేషన్ వర్కర్ల కొరకు దుస్తులు కొనుగోలు చేయుటకు వివిధ సైజులతో పురుషులకు మరియు స్త్రీల దుస్తులు కొరకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నాము ఇట్టి కొటేషన్లు తేది: 30.08.2023 మ. 3.00 గం॥ల వరకు పంపవలెను. కొటేషన్లు తేది 30-08-2023న సా॥ 4:30 గం॥లకు తెరువబడును. తదుపరి వివరాల కొరకు కమిషనర్/మున్సిపల్ ఇంజనీర్ వారిని సంప్రదించగలరు.
DIPR RO No.5733-PP/CL/Advt/1/2023-24, Dt. 24.08.2023 సం/- కమిషనర్, పురపాలక సంఘం, ఆర్మూర్

పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం
నీటి పారుదల శాఖ సర్కిల్, గంధం వారి గూడెం, నల్గొండ
టెండర్ నెం విభాగం స్థలము: 07 ఎస్.ఇ 2023-24, తేది: 22-08-2023, పనిపేరు: నీటి పారుదల శాఖ-లో-లెవల్ కెనాల్ పంపు హౌస్ పుల్యతండ గ్రామం, పెద్దవూర మండల్, నల్లగొండ జిల్లా వద్ద ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం పనులు చేయుట గురించి, పని అంచనా విలువ రూ. 78.58 లక్షలు, 1. టెండర్ డాక్యుమెంట్ లభ్యమగు కాలం: 25-08-2023 ఉ. 11.00 నుండి 08-09-2023 మ. 3.00 వరకు, 2. టెండర్ స్వీకరించు చివరి తేది: సమయం 08-09-2023 సా. 5.00 వరకు, 3. బిడ్ తెరుచు తేది: టెక్నికల్ బిడ్: 11-09-2023 ఉ. 11.00 గం., ప్రైస్ బిడ్: 15-09-2023 ఉ. 11.00 గం. గమనిక: మిగతా వివరాలకు www.eprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
సం/- వి. అజయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్, నీటి పారుదల శాఖ సర్కిల్, జి.వి.గూడెం, నల్గొండ
DIPR RO No.5737-PP/CL/Advt/1/2023-24, Dt. 24.08.2023

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, ఇ.నం.5-9-58B, ఫతేమైదాన్ రోడ్, హైదరాబాద్-04, ఫోన్: 23238290-250
No.05 & 06/CE/TSIIC/2023-24 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 23.08.2023
దిగువ తెలిపిన పనుల కోసం చీఫ్ ఇంజనీర్, TSIIC లిమిటెడ్, హైదరాబాద్ వారు బిడ్లు కోరుచున్నారు:- T.No.05: మేడ్చల్ జిల్లా, IDA జీడిమెట్ల వద్ద అన్ని ఫేజులలో CC వెడల్పు చేయుటతో పాటు DBM మరియు BCతో అన్ని ప్రస్తుత CC మరియు BT రోడ్లకు BT రెన్యువల్ (IALA ఫండ్స్ క్రింద) ECV రూ.20,93,40,860.00. T.No.06: రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం పంజగూడ గ్రామంలోని సర్వే నం.90 మరియు మీర్‌ఖాన్‌పేట గ్రామంలోని సర్వే నం.120లోని హైదరాబాద్ ఫార్మాసిటీ హౌసింగ్ లేఅవుట్‌లోని ఇంటర్నల్ రోడ్లకు GSB, WMM, BT ఫార్మింగ్ ఏర్పాటు చేయుట. ECV రూ.69,66,61,544.00. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 26.08.2023 సా.05.00 గం. నుండి. బిడ్ల దాఖలుకు చివరి తేది: 11.09.2023 మ.03.00 గం. వరకు. టెండరు ప్రకటనల వివరాలను మరియు బిడ్ డాక్యుమెంట్లను www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్
DIPR RO No.5782-PP/CL/Advt/1/2023-24, Dt. 24.08.2023

శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము
గ్రా॥ చెరువుగట్టు, మం॥ నార్కట్‌పల్లి, జి॥ నల్లగొండ- 508 254, తెలంగాణ
SRI PARVATHI JADALA RAMALINGESHWARA SWAMY TEMPLE
Cheruvugattu (V), Narketpally (M), Nalgonda (D)-508 254, Telangana. e-mail: eoecheruvugattu@yahoo.in, Phone: 91000 23701, 702, 703
టెండరు కమ్ బహిరంగ వేలము షరతు టెండరు ప్రకటన తేది: 24-08-2023
[illegible]

క్ర.సం.	వేలము వివరములు	డిపాజిట్ (రూ.)
(1)	తేది: 15-06-2023 నుండి 31-08-2023 వరకు [illegible] తేది: 01-09-2023 నుండి 31-08-2024 వరకు	8,00,000.00
(1)	[illegible]	3,00,000.00
(2)	[illegible]	3,00,000.00
(3)	[illegible]	1,00,000.00

[illegible]
DIPR RO No.5767-PP/CL/Advt/1/2023-24, Dt. 24.08.2023 సం/- ఎస్. నవీన్, కార్యనిర్వహణాధికారి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీరాజ్
(గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క సంస్థ)
రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030
NIRDPR

గ్రామీణాభివృద్ధి శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ జాతీయ గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ సంస్థ (NIRDPR) UBA-SEG ప్రాజెక్టును అమలు చేయడానికి ప్రాథమికంగా ఒక సంవత్సరం కోసం కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (UBA-SEG)ను నియమించడానికి NIRDPR కు చెందిన సెంటర్ ఫర్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (CRI) ప్రతిపాదిస్తోంది. దిగువ తెలిపిన ఉద్యోగం కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

క్ర. నం.	ఉద్యోగం పేరు	ఉద్యోగాల సంఖ్య	రెమ్యూనరేషన్
1	ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (UBA-SEG)	1	రూ.60,000/- PM

జాబ్ ప్రొఫైల్, అర్హతా ప్రమాణాలు మరియు ఇతర వివరాలకు దర్శించండి: http://career.nirdpr.in/
ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది 09/09/2023
Advt.No.31/2023
File No: NIRDPR/CRI/UBA-RCI/2023-24
Comp.no. 15326
సం/- అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ (సెక్షన్- I)

సాక్షి ఉద్యోగ అవకాశాలు

G.PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous) KURNOOL - 518 007
Ph : 08518-270957, 271017 URL : www.gprec.ac.in Estd : 1985
WALK-IN-INTERVIEWS ON 28.08.2023 (Monday) at 10.00 A.M.
FOR PROFESSOR, ASSOCIATE AND ASSISTANT PROFESSORS IN CSE DEPT.
Qualification : B.Tech I Class and M.Tech I Class. Specialization in Artificial Intelligence & Machine Learning / Data Science will be preferred. Ph.D. is mandatory for Professor and Associate Professor Posts.
Bring all original certificates and two passport size photos. No TA & DA will be paid. Salary commensurate with qualifications, experience and performance. Selected candidates have to join within a week.
CHAIRMAN



క్లుప్తంగా...

'మిజోరం' ప్రమాదం.. 22కు చేరిన మృతులు

ఐజ్వాల్: మిజోరంలోని ఐజ్వాల్‌లో బుధవారం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిన ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. గురువారం సాయంత్రం వరకు మొత్తం 22 మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. జాడ తెలియకుండా పోయిన మరో వ్యక్తి కోసం గాలింపు కొనసాగుతోంది. అతడు ప్రాణాలతో ఉండే అవకాశాలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. క్షతగాత్రులైన ముగ్గురిలో ఇద్దరిని ఆస్పత్రి నుంచి వైద్యులు డిశ్చార్జి చేశారు. బాధితులైన మొత్తం 26 మంది పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా జిల్లాకు చెందిన వారే.

ఉత్తరకొరియా నిఘా ఉపగ్రహ ప్రయోగం మళ్లీ విఫలం

సియోల్: ఉత్తరకొరియా రెండో సారి చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. గత మేలో చేపట్టిన నిఘా ఉపగ్రహం మొదటి ప్రయోగం కూడా విఫలమైన విషయం తెలిసిందే. మూడో దశలో ఎమర్జెన్సీ బ్లాస్టింగ్ వ్యవస్థలో లోపం వల్లే గురువారం పసిఫిక్ సముద్ర జలాల్లో ఉపగ్రహాన్ని మోసుకెళ్లే చొల్లిమ-1 రాకెట్ కూలిందని వివరించింది. వచ్చే అక్టోబర్‌లో మూడోసారి మరింత మెరుగ్గా ఈ ప్రయోగం చేపడతామని ఉత్తరకొరియా గురువారం ప్రకటించింది. ఈ ప్రయోగం కారణంగా జపాన్ ప్రభుత్వం ఒకినావా దీవుల్లోని తన ప్రజలను అప్రమత్తం చేసింది. ఉత్తరకొరియాలోని తొంగ్‌చాంగ్-రి తీరం నుంచి గురువారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఈ ప్రయోగం జరిగినట్లు దక్షిణకొరియా మిలటరీ తెలిపింది.

కాల్వలో పడిన ట్రాక్టర్.. 9 మంది మృతి

లక్నో: ట్రాక్టర్ ట్రాలీ కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు చిన్నారులు సహా మొత్తం తొమ్మిది మంది మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్ జిల్లాలో ఈ విషాదం చోటుచేసుకుంది. తాజ్‌పురా ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది బుధవారం సాయంత్రం రన్‌దౌల్ గ్రామంలో జరిగే మతపరమైన కార్యక్రమానికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. రెధిబోడ్కి గ్రామ సమీపంలోని కాల్వలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ పడిపోయింది. బుధవారం నాలుగు, గురువారం అయిదు మృతదేహాలను కాల్వ నుంచి బయటకు తీశారు. మృతుల్లో 5-12 ఏళ్ల మధ్య వయస్సున్న నలుగురు చిన్నారులున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు.

నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి ఇద్దరూ ఇద్దరే. భారత సంతతికి చెందిన వారే. రిపబ్లికన్ల అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి చర్చలో వారిద్దరే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఉక్రెయిన్ యుద్ధంపై మాటల తూటాలు విసురుకున్నారు. చివరికి వివేక్ రామస్వామి పైచేయి సాధించారు. ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తారని అంచనాలున్న రాన్ డిసాంటిస్‌ను పక్కకు పెట్టి మరీ రామస్వామి ముందుకు దూసుకుపోతున్నారు.



నువ్వా ✘ నేనా?

రిపబ్లికన్ల అమెరికా అధ్యక్ష అభ్యర్థుల చర్చలో సత్తా చాటిన భారతీయ అమెరికన్లు
వివేక్ రామస్వామి వర్సెస్ నిక్కీ హేలీ మధ్య మాటల తూటాలు
రేసులో దూసుకుపోతున్న వివేక్ రామస్వామి

➤ రిపబ్లికన్ పార్టీ అమెరికా అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగిన తొలి చర్చ వాడీగా వేడిగా సాగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ చర్చకు దూరంగా ఉండడంతో ఇద్దరే ఇద్దరు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. వారిద్దరూ భారత సంతతికి చెందిన అభ్యర్థులే. దక్షిణ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ, మల్టీ మిలియనీర్ వివేక్ రామస్వామి మధ్య ఉక్రెయిన్ యుద్ధంపై చర్చ మరో మలుపు తీసుకుంది. అమెరికా చరిత్రలో ఇద్దరు భారతీయులు ఒకే వేదికను పంచుకొని ఈ తరహాలో చర్చించుకోవడం ముందెన్నడూ జరగలేదు. ఇద్దరికి ఇద్దరు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఒకానొక దశలో వేలి చూపిస్తూ బెదిరించుకున్నారు. ఒకరిపై మరొకరు 30 సెకండ్లపాటు అరుచుకున్నారు. విదేశీ వ్యవహారాల్లో వివేక్ రామస్వామికి అవగాహన లేదని, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంశంలో ఆయన పుతిన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారంటూ నిక్కీ హేలీ గట్టి ఆరోపణలే చేశారు. అమెరికా శత్రువులకి కొమ్ముకాస్తూ, దేశ మిత్రులకు దూరంగా వెళుతున్నారని వివేక్‌ను దుయ్యబట్టారు. పుతిన్ ఒక హంతకుడని అతనికి మద్దతుగా మాట్లాడేవారు ఈ దేశానికి అధ్యక్షుడైతే భద్రత గాల్లో దీపంలా మారుతుందంటూ హేలీ మండిపడ్డారు. హేలీ మాట్లాడుతున్నంత సేపు వివేక్ రామస్వామి ఆమెని అడ్డుకుంటూనే ఉన్నారు. హేలీ చెబుతున్నవన్నీ అబద్ధాలని , తనపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారంటూ ఎదురు దాడికి దిగారు.

➤ ఉక్రెయిన్‌కు మరింత సాయానికి తాను వ్యతిరేకిస్తానని వివేక్ రామస్వామి ఈ చర్చలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అమెరికాకు ఉక్రెయిన్ ప్రధానం కాదని, వారికి చేసే మిలటరీ సాయాన్ని తమ దేశ సరిహద్దుల్లో మోహరిస్తే దేశ భద్రత మరింత పటిష్టమవుతుందని వివేక్ రామస్వామి పేర్కొన్నారు. రక్షణ రంగానికి చెందిన కాంట్రాక్టర్ల ఒత్తిడితోనే నిక్కీ ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్నారంటూ ధ్వజమెత్తారు. ఈ చర్చలో నిక్కీ హేలీపై వివేక్ రామస్వామి పై చేయి సాధించారు. అమెరికాకు ఎప్పుడైనా తన దేశ భద్రతే ముఖ్యం తప్ప, ఉక్రెయిన్‌కు సాయం చేయడం కాదంటూ గట్టిగా వాదించారు. రాజకీయ అనుభవం లేకపోవడంతో మొదట్లో అంతగా గుర్తింపు లేని వివేక్ రామస్వామి తాను నమ్మిన సిద్ధాంతాలను ఆకట్టుకునేలా చెప్పడం ద్వారా మద్దతు పెంచుకుంటున్నారు. అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందున్న డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీగా ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ పేరు వినిపించేది. మొదటి చర్చలో రాన్ ఎంత మాత్రం ప్రభావితం చూపించలేకపోయారు. ఇప్పుడు ఆయనను దాటుకొని మరీ వివేక్ రామస్వామి దూసుకుపోతున్నారు. తొలి చర్చలో వివేక్‌రామస్వామి విజేతగా నిలిచారంటూ వివిధ పోల్స్ వెల్లడిస్తున్నాయి. సెప్టెంబర్ 22న జరిగే రెండో చర్చలో వివేక్ రామస్వామి ఏం మాట్లాడతారన్న ఉత్కంఠ రేపుతోంది.

అమెరికా భద్రతే ముఖ్యం..

ఎవరీ వివేక్ రామస్వామి ?

కేరళ నుంచి అమెరికాకు వలస వెళ్లిన భారతీయ దంపతులకు ఒహియోలోని సిన్సినాటిలో 1985, ఆగస్టు9న వివేక్ రామస్వామి జన్మించారు. సంప్రదాయ హిందూ కుటుంబంలో పుట్టి పెరిగారు. తండ్రి ఎలక్ట్రిక్ ఇంజనీరు. తల్లి మానసిక వైద్యురాలు. యేల్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాల్లో రామస్వామి చదువుకున్నారు. పాఠశాలలో విద్యనభ్యసించేటప్పుడు జూనియర్ టెన్నిస్ క్రీడాకారుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. యువకుడిగా ఉన్నప్పుడు తీరిక సమయాల్లో అల్జీమర్స్ రోగుల వద్ద పియానో వాయించేవారు. కాలేజీలో చదువుకున్నప్పుడు స్టూడెంట్‌బిజినెసెస్.డాట్‌కామ్ సహవ్యవస్థాపకుడిగా ఉంటూ వ్యాపార రంగంలో అడుగు పెట్టారు. 2007 నుంచి 2014 వరకు క్యూవీటీ ఫైనాన్సెస్ సంస్థలో పని చేశారు. 2014లో సొంతంగా బయోటెక్ కంపెనీ రాయివాంట్ సైన్సెస్‌ను ఏర్పాటు చేశారు. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA) ఆమోదం పొందిన ఐదు ఔషధాలను అభివృద్ధి చేశారు. 10 మంది ఉద్యోగులతో ప్రారంభమైన ఈ సంస్థ 2017 నాటికి 110 కోట్ల డాలర్ల వ్యాపారం చేసే సంస్థగా ఎదిగింది. అమెరికాలో 40 ఏళ్లకు తక్కువ వయసున్న అత్యంత ధనికుడైన ఎంటర్ ప్రెన్యూర్‌గా ఫోర్బ్స్ జాబితాలోకెక్కారు. వివేక్ రామస్వామి ఆస్తుల విలువ 63 కోట్ల డాలర్లు ఉంటుందని అంచనా. తన క్లాస్‌మేట్ అయిన అపూర్వ తివారీని 2015లో పెళ్లాడిన వివేక్ రామస్వామికి కార్తీక్, అర్జున్ అనే ఇద్దరు అబ్బాయిలున్నారు. పుస్తక రచన, రాజకీయాలపై ఆసక్తితో రాయివాంట్ సంస్థ సీఈవో పదవి నుంచి 2021లో ఆయన తప్పుకున్నారు. 'వోక్, ఇంక్: ఇన్‌సైడ్ కార్పొరేట్ అమెరికాస్ సోషల్ జస్టిస్ స్కామ్'అనే పుస్తకాన్ని రచించారు. ఎన్నో పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సాంస్కృతిక ఉద్యమంతో కొత్త అమెరికా కల సాకారమవుతుందని రామస్వామి నినదిస్తున్నారు. ఇప్పటికే ఎలన్‌మస్క్ వంటి పారిశ్రామికవేత్తలు రామస్వామికి బహిరంగంగా మద్దతు పలుకుతూ ఉండడం , ట్రంప్ చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తూ ఉండడంతో వివేక్ రామస్వామి వైపు రిపబ్లికన్లు తిరుగుతారా అన్న చర్చ మొదలు కావడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

జాబిల్లిపై భారత్ నడక

- చంద్రయాన్-3 సక్సెస్‌పై ఇస్రో హర్షాతిరేకాలు
- రోవర్ ప్రజ్ఞాన్ నడక ప్రారంభించిందంటూ పోస్టు

బెంగళూరు/న్యూఢిల్లీ: చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడం పట్ల భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ల్యాండర్ విక్రమ్ నుంచి రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వచ్చి, తన కార్యాచరణ ప్రారంభించింది. చందమామ ఉపరితలంపై పరిశోధనలు చేస్తూ భూమిపైకి విలువైన సమాచారాన్ని చేరవేస్తోంది. రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడిపై నిర్విఘ్నంగా అడుగుపెట్టడాన్ని ప్రస్తావిస్తూ 'చందమామపై భారత్ నడుస్తోంది'' అని ఇస్రో పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేసింది. చంద్రుడి కోసం భారత్‌లో తయారు చేసిన ఈ రోవర్ ల్యాండర్ నుంచి బయటకు అడుగుపెట్టి, చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా నడక ప్రారంభించిందని వెల్లడించింది. ప్రజ్ఞాన్ రోవర్ ప్రయాణం పట్ల ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. చంద్రుడి గురించి మన పరిజ్ఞానం మరింత పెరగడానికి ప్రజ్ఞాన్ దోహదపడుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

ల్యాండర్, రోవర్ జీవిత కాలం పెరుగుతుందా?

చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై అడుగుపెట్టింది. అందులో నుంచి రోవర్ బయటకు వచ్చింది. వాస్తవానికి రోవర్ జీవితకాలం ఒక లూనార్ డే. అంటే 14 రోజులు. 14 రోజులపాటు రోవర్ ప్రజ్ఞాన్ ల్యాండింగ్ సైట్ నుంచి అటూఇటూ సంచరిస్తూ పరిశోధనలు చేయనుంది. అయితే, రోవర్ జీవితకాలం 14 రోజులు మాత్రమే కాదని, మరింత పెరిగే అవకాశం ఉందని ఇస్రో సైంటిస్టులు చెబుతున్నారు. దక్షిణ ధ్రువంపై 14 రోజులు చీకటి, 14 రోజులు వెలుగు ఉంటుంది. సూర్యోదయం అయినప్పుడు సూర్యుడి నుంచి రోవర్ సౌరశక్తిని గ్రహించి, దాన్ని విద్యుత్‌గా మార్చుకొని పరిశోధనలు కొనసాగించేందుకు ఆస్కారం ఉందంటున్నారు. ల్యాండర్, రోవర్‌ల మొత్తం బరువు 1,752 కిలోలు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై 14 రోజులపాటు పనిచేసేలా వీటిని రూపొందించారు. లూనార్ డే ముగిసిన తర్వాత కూడా వాటిలో జీవం నిండే అవకాశాలు లేకపోలేదని పేర్కొంటున్నారు. సూర్యకాంతి ఉన్నంతవరకు ల్యాండర్, రోవర్ చక్కగా పనిచేస్తాయి. చీకటి పడగానే ఉష్ణోగ్రత మైనస్ 180 డిగ్రీలకు పడిపోతుంది. అవి పనిచేయడం ఆగిపోతుంది.

గూగుల్ డూడుల్‌గా చంద్రయాన్-3

చంద్రయాన్-3 మిషన్ విజయం పట్ల సెర్చ్ ఇంజన్ గూగుల్ తన సంతోషాన్ని నెటిజన్లతో పంచుకుంది. గురువారం గూగుల్ డూడుల్‌గా చంద్రయాన్-3కు సంబంధించిన ప్రత్యేక యానిమేటెడ్ చిత్రం ప్రత్యక్షమయ్యింది. ఇందులో గూగుల్ అనే ఇంగ్లిష్ అక్షరాలు అంతరిక్షంలో నక్షత్రల్లాగా తేలుతూ కనిపించాయి. రెండో అక్షరం చంద్రుడిలా దర్శనమిచ్చింది.

26న ఇస్రో ప్రధాన కార్యాలయానికి ప్రధాని మోదీ

చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో సైంటిస్టులను స్వయంగా కలిసి అభినందించడానికి ప్రధాని మోదీ ఈ నెల 26న బెంగళూరుకు రానున్నారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో సైంటిస్టులతో సమావేశమవుతారు.


ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్

మనిషి మనుగడకు అవకాశం

శివాజీనగర: చంద్రుని దక్షిణ ధ్రువం భవిష్యత్‌లో మానవాళి మనుగడకు వీలుగా ఉంటుందని విశ్వసిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. అందుకే చంద్రయాన్-3 ల్యాండర్ దిగటానికి ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నామని తెలిపారు. 'మనం దాదాపు 70 డిగ్రీల దక్షిణ ధ్రువానికి దగ్గరగా వెళ్లాం, అక్కడ సూర్యరశ్మి తక్కువగా ఉండటానికి ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉంది. రోవర్ ద్వారా ఆ ప్రాంతం గురించి శాస్త్రీయంగా మరింత సమాచారం లభించే అవకాశముంది. చంద్రునిపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు దక్షిణ ధ్రువంపై చాలా ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఎందుకంటే మానవులు వెళ్లి అక్కడ నివాసాలను సృష్టించి ఆపై దాటి ప్రయాణించాలని అనుకుంటున్నారు. కాబట్టి మనం వెతుకుతున్నది ఉత్తమమైన ప్రదేశం. దక్షిణ ధ్రువం అలా ఉండేందుకు అవకాశముంది'అని ఆయన చెప్పారు. గురువారం ఆయన బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇస్రో శాస్త్రవేత్తల నాలుగేళ్ల శ్రమకు తగ్గ ఫలితం లభించిందని అన్నారు. చంద్రునిపై విజయవంతంగా దిగిన విక్రమ్ ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ సాఫీగా బయటకు వచ్చిందని తెలిపారు. 'నిర్దేశిత ప్రయోజనం కోసం దక్షిణ ధ్రువంపైన గుర్తించిన 4.5 కి.మీ. x 2.5 కి.మీ. ప్రాంతానికి సరిగ్గా 300 మీటర్ల దూరంలోపు దూరంలోనే ల్యాండర్ దిగింది. రోవర్‌లోని రెండు పరికరాలు, ల్యాండర్‌లోని మూడు పరికరాలు నిర్దేశించిన విధంగా పనిచేస్తున్నాయి'అని పేర్కొన్నారు. రోవర్ బయట తిరుగాడుతూ పరిశోధనల ప్రారంభించిందని చెప్పారు. రోవర్‌లో అమర్చిన రెండు పరికరాలు చంద్రుని మట్టిలో మూలకాలు, రసాయనాలను పరిశీలిస్తాయని చెప్పారు. రోబోటిక్ పాత్ ప్లానింగ్ కూడా చేయిస్తాయని తెలిపారు.

బ్రిక్స్‌లోకి మరో ఆరు దేశాలు

- విస్తరణకు జొహన్నెస్‌బర్గ్ శిఖరాగ్రం నిర్ణయం
- 2024 జనవరి నుంచి అమల్లోకి...
- ప్రధాని మోదీ సహా నేతల హర్షం


బ్రిక్స్ వేదికపై చేతులు కలిపిన నేతలు


జొహన్నెస్‌బర్గ్‌లో భారత సంతతి ప్రజలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: బ్రిక్స్ కూటమిలోకి మరో ఆరు దేశాలు వచ్చి చేరనున్నాయి. అర్జెంటీనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలని కూటమి నిర్ణయించింది. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న మూడు రోజుల శిఖరాగ్ర భేటీలో ఆఖరు రోజైన గురువారం మీడియా సమావేశంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ఈ మేరకు ప్రకటించారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి ఆరు దేశాల సభ్యత్వం అమల్లోకి వస్తుందని తెలిపారు. బ్రిక్స్ బలం అయిదు నుంచి 11 దేశాలకు పెరగనుంది. ఈ నిర్ణయంపై ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా హర్షం వ్యక్తం చేశారు. బ్రిక్స్ అధ్యక్ష పీఠంపై ఉన్న దక్షిణాఫ్రికాలో కూటమి శిఖరాగ్ర సమ్మేళనం జరుగుతోంది. 'సిద్ధాంతాలు, ప్రమాణాలు, విధానాల ప్రాతిపదికన విస్తరణ ప్రక్రియను ఏకాభిప్రాయంతో చేపట్టాం. మున్ముందు కూడా కూటమిని విస్తరిస్తాం' అని రమఫోసా చెప్పారు. బ్రిక్స్ విస్తరణ, ఆధునీకరణ.. ప్రపంచంలోని అన్ని సంస్థలు మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలనే సందేశం ఇస్తుందని ప్రధాని మోదీ ఒక ప్రకటనలో తెలిపారు. 'బ్రిక్స్ విస్తరణకు భారత్ మొదట్నుంచీ మద్దతుగా నిలిచింది. కొత్తగా సభ్య దేశాలను చేర్చుకోవడం ద్వారా బ్రిక్స్ మరింత బలోపేతమవుతుంది. ఉమ్మడి ప్రయత్నాలకు కొత్త ఊపునిస్తుంది. బహుళ ధ్రువ ప్రపంచ క్రమతపై విశ్వాసం పెంచుతుంది'అని ప్రధాని మోదీ అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తన వర్చువల్ ప్రసంగంలో బ్రిక్స్ తాజా విస్తరణపై హర్షం వ్యక్తం చేశారు. కూటమిలో సహకారానికి కొత్త అధ్యాయం మొదలైందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య దేశం నమూనా, కూటమిలో చేరాలనుకునే దేశాల జాబితాను ఏడాది జరిగే శిఖరాగ్ర సమ్మేళనం నాటికి సిద్ధం చేసే బాధ్యతను విదేశాంగ మంత్రులకు అప్పగించినట్లు రమఫోసా చెప్పారు. స్థానిక కరెన్సీలు, చెల్లింపు విధానాల్లో తలెత్తే సమస్యల పరిష్కారంపై నివేదిక రూపొందించాల్సిందిగా బ్రిక్స్ ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లకు సూచించేందుకు అంగీకారానికి వచ్చినట్లు ఆయన వివరించారు. 2006లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలు బ్రిక్‌గా ఏర్పాటయ్యాయి. దక్షిణాఫ్రికా చేరికతో 2010 నుంచి బ్రిక్స్‌గా రూపాంతరం చెందింది. బ్రిక్స్‌లో చేరేందుకు 40 వరకు దేశాలు ఆసక్తి చూపుతుండగా వీటిలో 23 దేశాలు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రస్తుత కూటమి ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ జీడీపీలో 24%, ప్రపంచ వాణిజ్యంలో 16% వరకు వాటా కలిగి ఉంది. పశ్చిమదేశాల కూటమికి బ్రిక్స్‌ను ప్రధాన పోటీ దారుగా భావిస్తున్నారు.

ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని భేటీ

బ్రిక్స్ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ సహా పలు దేశాల నేతలతో సమావేశమయ్యారు. రైసీతో చర్చల సందర్భంగా ఇరువురు నేతలు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, ఉగ్రవాదం, అఫ్గానిస్తాన్ వంటి ద్వైపాక్షిక అంశాలతో చాబహార్ పోర్టు అభివృద్ధిపైనా చర్చించారు. బ్రిక్స్‌లో ఇరాన్ చేరికకు మద్దతుగా నిలిచినందుకు ప్రధాని మోదీకి రైసీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రయాన్-3 విజయం సాధించినందుకు మోదీకి అభినందనలు తెలియజేశారని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి వివరించారు. ప్రధాని మోదీ ఇథియోపియా అధ్యక్షుడు అబీ అహ్మద్ అలీ, సెనెగల్ అధ్యక్షుడు మాకీ సాల్, మొజాంబిక్ అధ్యక్షుడు ఫిలిప్ న్యూసీ తదితరులతో జరిగిన భేటీలో పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రధాని మోదీ చర్చించారని బాగ్చి వివరించారు. కాగా, బ్రిక్స్ శిఖరాగ్రం అనంతరం ప్రధాని మోదీ గురువారం సాయంత్రం జొహన్నెస్‌బర్గ్ నుంచి గ్రీస్‌కు బయలుదేరారు.

ఎల్‌ఏసీని గౌరవిస్తేనే సాధారణ సంబంధాలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవధీన రేఖ(ఎల్‌ఏసీ) పరిధిలో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండియా ఉద్దేశాలు, అభిప్రాయాలు చైనా అధినేత షీ జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో గురువారం జిన్‌పింగ్‌తో మోదీ మాట్లాడారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి చేరుకోవాలంటే ఇరు దేశాల సరిహద్దుల్లో శాంతి, స్నేహభావం నెలకొనాలని, ఎల్‌ఏసీని గౌరవించాలని మోదీ తేల్చిచెప్పారు. ఎల్‌ఏసీ నుంచి ఇరుదేశాల బలగాలను ఉపసంహరించే చర్యలను వేగవంతం చేసేలా తమ అధికారులను ఆదేశించాలని ఇరువురు నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. 2020 మే నెలలో తూర్పు లద్దాఖ్‌లో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

ఆఫ్రికాకు భారత్ విశ్వసనీయ భాగస్వామి

'ఎజెండా 2063'సాధనలో ఆఫ్రికాకు భారత్ సన్నిహిత, విశ్వసనీయ భాగస్వామి అని ప్రధాని మోదీ అన్నారు. గ్లోబల్ సౌత్‌కు భారత్ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం, ఆహారం, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో సహకారానికి ఎన్నో అవకాశాలున్నాయని చెప్పారు. బ్రిక్స్, ఆఫ్రికా దేశాల ముఖ్య నేతలతో గురువారం జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ఆఫ్రికా యూనియన్ శక్తివంతంగా రూపుదిద్దుకునేందుకు వచ్చే 50 ఏళ్లలో సాధించాల్సిన లక్ష్యాలపై 2013లో తయారు చేసిన ఆర్థికాభివృద్ధి నమూనాయే 'అజెండా 2063'. ప్రపంచమే ఒక కుటుంబమనే భావనను భారత్ వేల ఏళ్లుగా విశ్వసిస్తోందని ప్రధాని చెప్పారు. ఆఫ్రికా దేశాలతో వాణిజ్యం, పెట్టుబడుల్లో భారత్ నాలుగు, అయిదో స్థానాల్లో ఉందన్నారు.

హిమాచల్‌ను వీడని వానలు.. కుప్పకూలిన 8 భవంతులు



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో మరో సారి కొండచరియలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపడి గురువారం ఉదయం కులు జిల్లాలో 8 భవనాలు కుప్పకూలాయి. నాలుగైదు రోజుల క్రితమే ఆ భవనాల్లో పగుళ్లు రావడంతో వాటిని ప్రమాదకరంగా ప్రకటించి ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం జరగలేదు. ఆస్తినష్టంపై ఇంకా అంచనా వేయాల్సి ఉంది. ఈ భవనాల్లో దుకాణాలు, బ్యాంకులు ఇతర వ్యాపార సంస్థలు ఉన్నాయని, ఆ భవనాలు ఏ క్షణంలోనైనా కుప్పకూలవచ్చునన్న భయంతోనే వాటిని ఖాళీ చేయించినట్టుగా అన్ని ప్రాంతానికి చెందిన సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ నరేశ్ వర్మ చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇంకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జూన్ 24న మొదలైన వర్షాలు కొన్ని ప్రాంతాల్లో ఇంకా కురుస్తూనే ఉన్నాయి. ఈ రెండు నెలల్లో వర్ష బీభత్సానికి 238 మంది మరణించారు. మరో 40 మంది ఆచూకీ తెలీడం లేదు. మొత్తం 709 రోడ్లను మూసివేశారు. సిమ్లా, సోలాన్, మండి, కులు జిల్లాల్లో భారీగా విధ్వంసం జరిగింది.

విక్రేతల మధ్య సమాన పోటీ ఉండాలి

జీ20 వాణిజ్య మంత్రుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

జైపూర్: ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య ఈ-కామర్స్ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే సమయంలో ఈ రంగంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ నేపథ్యంలో చిన్న, పెద్ద విక్రేతల మధ్య సమాన పోటీ ఉండేలా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గురువారం రాజస్తాన్‌లోని జైపూర్‌లో జరిగిన జీ20 దేశాల వాణిజ్య, పెట్టుబడి శాఖ మంత్రుల సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ధరలు, ఫిర్యాదుల విషయంలో వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. డిజిటలీకరణ ద్వారా ఈ-కామర్స్ రంగంలో దేశాల మధ్య కార్యకలాపాలు సులభతరం అవుతాయని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనేది ఒక గేమ్-చేంజర్ అని మోదీ అభివర్ణించారు. దీనిద్వారా డిజిటల్ మార్కెట్‌ప్లేస్ వ్యవస్థను సృష్టిస్తున్నట్లు వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థలో విశ్వాసాన్ని, సానుకూలతను ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు.

మూడు బిల్లులపై పరిశీలన ప్రారంభం

బిల్లులకు హిందీ పేర్లు పెట్టడంపై దయానిధి మారన్ అభ్యంతరం

న్యూఢిల్లీ: ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురాదల్చిన మూడు బిల్లులపై పార్లమెంటరీ స్థాయీసంఘం గురువారం పరిశీలన ప్రారంభించింది. బీజేపీ ఎంపీ, మాజీ ఐపీఎస్ అధికారి బ్రిజ్‌లాల్ నేతృత్వంలో హోంశాఖ వ్యవహారాలపై ఈ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఏర్పాటైంది. మూడు బిల్లులపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా పార్లమెంట్ సభ్యులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుసుకున్నారు. ప్రతిపక్ష ఎంపీలు పలు అంశాలను లేవనెత్తారు. మూడు బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348ను ఉల్లంఘించడమే అవుతుందని డీఎంకే సభ్యుడు దయానిధి మారన్ ఆక్షేపించారు. తన అభ్యంతరాలు, డిమాండ్లపై మారన్ ఒక లేఖ సమర్పించారు. మారన్ డిమాండ్లకు పలువురు విపక్ష ఎంపీలు మద్దతు పలికారు. మూడు బిల్లులను బీజేపీ సభ్యులు స్వాగతించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య బిల్లు'ను పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

ఫ్యుకుషిమా నుంచి అణు జలాల విడుదల

- పసిఫిక్ సముద్రంలోకి జలాల విడుదలను ప్రారంభించిన జపాన్
- పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు
- స్వార్థపూరిత చర్యని మండిపడ్డ చైనా

ఒకుమా: జపాన్‌ను 12 ఏళ్ల క్రితం కుదిపేసిన పెను భూకంపం, సునామీతో దెబ్బ తిన్న ఫ్యుకుషిమా అణు ప్లాంట్ నుంచి వ్యర్థ జలాలను పసిఫిక్ సముద్రంలోకి విడుదల చేసే కార్యక్రమం మొదలైంది. ఇరుగు పొరుగు దేశాల నిరసనల మధ్య గురువారం నాడు తొలి విడతగా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేసే ప్రక్రియను మొదలు పెట్టినట్టు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) ప్రకటించింది. వివిధ దశల్లో శుద్ధి చేసిన జలాలు అణు ప్లాంట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి విడుదల ప్రారంభానికి సంబంధించిన వీడియో కవరేజీను జపాన్ మీడియా లైవ్‌లో చూపింది. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు నీటి విడుదల కార్యక్రమం మొదలైనట్టుగా అణుప్లాంట్ ఆపరేటర్ చెప్పారు. ఈ అణు జలాల విడుదలపై సొంత దేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. నీటి విడుదలతో సముద్ర జలాలు విషతుల్యంగా మారి మత్స్య సంపదకు అపార నష్టం చేకూరుతుందని జపాన్, చైనా, దక్షిణకొరియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పర్యావరణం, మనుషుల ఆరోగ్యంపై దీని ప్రభావం ఉంటుందని జపాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. అయితే జపాన్ ప్రభుత్వం తన చర్యను సమర్థించుకుంది. అణు ప్లాంట్‌ను మూసేయాలంటే జలాలు విడుదల చేయక తప్పదని స్పష్టం చేసింది. 13.4 కోట్ల టన్నుల వ్యర్థ జలాలు వెయ్యి ట్యాంకుల్లో భద్రపరిచామని, ఆ ట్యాంకులకు ప్రమాదమేదైనా జరిగితే మరింత ముప్పు వాటిల్లుతుందని టెప్కో పేర్కొంది. అణు జలాలను శుద్ధి చేసి అవి సురక్షితమని తేలాక విడుదల చేస్తున్నట్టు సెంటర్ ఫర్ రేడియేషన్ రీసెర్చ్ డైరెక్టర్ టోనీ హూకర్ చెప్పారు.

జపాన్ సీఫుడ్‌పై నిషేధం: చైనా

జపాన్‌ది పూర్తిగా స్వార్థపూరిత, బాధ్యతారహిత చర్య అని చైనా మండిపడింది. జపాన్ నుంచి సీఫుడ్‌పై నిషేధం విధించింది. జపాన్ చేస్తున్న పనితో సముద్రంలో మత్స్య సంపదకి, వాతావరణానికి ఎంత ముప్పు ఉంటుందో ఎవరూ అంచనా వేయలేరని ఒక ప్రకటనలో దుయ్యబట్టింది. జపాన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందంటూ వివిధ దేశాలు జలాల విడుదలను ఖండిస్తున్నాయి.

విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మృతి

- మొత్తం 10 మంది దుర్మరణం పాలయ్యారు
- నిర్ధారించిన రష్యా పౌర విమానయాన సంస్థ



మాస్కో: రష్యాలో బుధవారం జరిగిన విమానంలో వాగ్నర్ గ్రూప్ అధినేత యెవ్‌గెనీ ప్రిగోజిన్ మృతిచెందారని రష్యా పౌర విమానయాన సంస్థ 'రోసావియాత్సియా' ధ్రువీకరించింది. ప్రిగోజిన్ సహా విమానంలో ఉన్న మొత్తం 10 మంది చనిపోయారని నిర్ధారించింది. రష్యా కిరాయి సైనిక దళమైన వాగ్నర్ గ్రూప్ ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాడింది. వాగ్నర్ గ్రూప్ అధినేత ప్రిగోజిన్ కొన్నిరోజుల క్రితం రష్యా సైన్యంపై తిరుగుబాటు చేసి వెనక్కి తగ్గారు. వాగ్నర్ గ్రూప్ తిరుగుబాటును రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశద్రోహం, వెన్నుపోటుగా అభివర్ణించారు. ద్రోహులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. కొన్ని రోజులు పుతిన్ వెనక్కి తగ్గారని, ప్రిగోజిన్‌కు క్షమాభిక్ష ప్రసాదించి, పొరుగు దేశమైన బెలారస్‌కు పంపించినట్లు వార్తలు వచ్చాయి. విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. ఈ ప్రమాదం వెనుక పుతిన్ హస్తం ఉందని, ప్రిగోజిన్‌ను మట్టుబెట్టడానికే ఉద్దేశపూర్వకంగా విమాన ప్రమాదాన్ని సృష్టించారని ఉక్రెయిన్ సహా పశ్చిమ దేశాలు ఆరోపిస్తున్నాయి.

ఆశ్చర్యం కలిగించలేదు: బైడెన్

మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు బయలుదేరిన ప్రైవేట్ విమానం బుధవారం నేలకూలి మంటల్లో చిక్కుకుంది. మాస్కోకు ఉత్తర దిశలో 300 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ముగ్గురు సిబ్బంది, ఏడుగురు ప్రయాణికులు ఉండగా, అందరూ దుర్మరణం పాలయ్యారు. ప్రిగోజిన్ సహా వాగ్నర్ గ్రూప్ లెఫ్టినెంట్లు మరణించినట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున 10 మృతదేహాలను రష్యాఅధికారులు గుర్తించారు. ఈ విమానాన్ని ప్రిగోజిన్ తరచుగా ఉపయోగించేవారని తెలుస్తోంది. వైమానిక భద్రతా నిబంధలను ఉల్లంఘించడం వల్ల ప్రమాదం జరిగిందన్న కోణంలో అధికారులు ప్రారంభించారు. ప్రమాదానికి కారణం ఏమిటన్నది దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రిగోజిన్ మృతిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. అసలేం జరిగిందో తెలియదు గానీ ప్రిగోజిన్ మరణం తనకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదని చెప్పారు. ప్రిగోజిన్‌ను పుతినే హత్య చేయించారన్నట్టుగా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంపై పుతిన్ మౌనం వీడలేదు. గురువారం ఆయన బ్రిక్స్ సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రిగోజిన్ మరణం గురించి ప్రస్తావించలేదు.

సాక్షి
కరీంనగర్

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



అంధులకు చూపునిద్దాం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అందమైన సృష్టిని చూడాలంటే కళ్లతోనే సాధ్యం. మరణించినా ఆ కళ్లు మరో ఇద్దరిదేహంలో ఈ లోకాన్ని చూస్తాయి. నేత్రదానం ద్వారా చీకట్లో మగ్గుతున్నవారెందరో కంటిచూపునకు నోచుకున్నారు. శుక్రవారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు 'జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేత్రదానంపై ప్రత్యేక కథనం..

– వివరాలు 8లో..

న్యూస్‌రీల్

న్యాయపరమైన సాయానికి సిద్ధం



కరీంనగర్: జాతీయ న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాలకు మేరకు పట్టణంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగులవసతి గృహాన్ని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ గురువారం సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని స్వాధార్‌హోంను సందర్శించి అక్కడిసౌకర్యాల గురించి ఆరా తీశారు. చదువుకోలేని పరిస్థితిలో ఉన్న బాలికలను వీలైనంత త్వరితగతిన పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఆషాడపు శ్రీనివాస్, తణుకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి బీఎన్ రావు!

- మంత్రి, వినోద్‌కు మార్ గ్రీన్‌సిగ్నల్




కరీంనగర్: వైద్య రంగంలో, సామాజికసేవలో చురుకుగా పాల్గొంటున్న కరీంనగర్‌కు చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ బండారి నరేందర్‌రావు (బీఎన్ రావు) బీఆర్‌ఎస్‌లో చేరికకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వైద్య వృత్తితో పాటు బీఎన్ రావు హెల్త్ చారిటబుల్ ట్రస్టు పేరుతో సంస్థను స్థాపించి ఉచిత మెడికల్ క్యాంపులతో పాటు నిరుపేద విద్యార్థుల చదువు కొనసాగించేందుకు సహకారం అందించడం, విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు జరిపి మందులు అందజేయడం, అవో గావ్‌చలో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలను దత్తత తీసుకొని వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ నెలా ఒక పేద రోగికి ఉచితంగా మోకీలు ఆపరేషన్ చేస్తున్నారు. ఇటీవల నగరానికి చెందిన ప్రముఖ వాణిజ్యవేత్త కొత్త జయపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరినట్లే చేరి, చేజారి పోయారు. ఈ నేపథ్యంలో ఆ లోటును భర్తీ చేసేందుకు మరో బలమైన వ్యక్తిని పార్టీలోకి చేర్చుకోవాలని బీఆర్‌ఎస్ అగ్రనేతలు భావించారు. దీంతో ఐఎంఏ అధ్యక్షుడు బీఎన్ రావును పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ ఆయన చేరికకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌లో డా.బీఎన్ రావు చేరుతున్న విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కూడా ధ్రువీకరించారు.

కాంగ్రెస్‌లో చేరిన జైపాల్‌రెడ్డి



కరీంనగర్‌టౌన్: మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హస్తం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, అభిమానులు, పెద్దసంఖ్యలో గాంధీ భవన్‌కు వెళ్లారు. కరీంనగర్ నుంచి సుమారు 200 వాహనాల్లో 500మందికి పైగా తరలివెళ్లారు. పార్టీలో చేరిన అనంతరం జయపాల్ అనుచరులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. త్వరలో కరీంనగర్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసేందుకు చర్చించుకున్నారు.

జాతీయభావం పెంచేందుకే 'గాంధీ' ప్రదర్శన



కరీంనగర్‌కల్చరల్: విద్యార్థుల్లో జాతీయభావం పెంపొందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గాంధీచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించిందని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థుల కోసం జిల్లాలోని 13 థియేటర్లలో గాంధీచిత్రాన్ని ఆగస్టు 16 నుంచి 24వరకు ప్రదర్శించగా 19,945మంది విద్యార్థులు వీక్షించినట్లు వివరించారు.

బరిలో దిగేందుకు 'బండి' నో?



పాల్వాయి సుగుణాకర్‌రావు

- కరీంనగర్ అసెంబ్లీకి పోటీ చేసేందుకు ఎంపీ సంజయ్ అనాసక్తి
- పార్లమెంటుకు వెళ్లే ఆలోచనలో ఫైర్‌బ్రాండ్ నేత
- శాసనసభకు పోటీ చేసేందుకు ఆశావహుల ఉత్సాహం
- కరీంనగర్ పార్లమెంటు రేసులో పాల్వాయి సుగుణాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ అసెంబ్లీ బరిలో ఎంపీ బండి సంజయ్ ఈసారి ఉండేది అనుమానమే. ఇక్కడి నుంచి గత పార్లమెంటు ఎన్నికల్లో విజయఢంకా మోగించిన ఆయన ఈసారీ లోక్‌సభ బరికే మొగ్గుచూపుతున్నారని సమాచారం. 2018లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి, తన ప్రత్యర్థి, ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్‌పై హోరాహోరీగా పోరాడారు. మొత్తం బీజేపీకి 66,009 ఓట్లు పోలవ్వగా, బీఆర్‌ఎస్‌కు 80,983 ఓట్లు వచ్చాయి. 14,974 ఓట్ల మెజారిటీతో గంగుల విజయబావుటా ఎగురవేశారు. ప్రతి రౌండ్‌లోనూ గట్టి పోటీ ఇచ్చి, కొన్ని సందర్భాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన బండితో విజయం దోబూచులాడింది. ఆ సానుభూతి 2019 పార్లమెంటు ఎన్నికల్లో బాగా పని చేసింది. ఆ సమయంలో పుల్వామా దాడులు, పాకిస్తాన్‌పై భారత్ సర్జికల్ స్ట్రైక్స్, సరిహద్దులో నెలకొన్న యుద్ధ వాతావరణం వెరసి.. జాతీయభావం ఎన్నికపై బాగా ప్రభావం చూపింది. దీనికితోడు బండి సంజయ్‌కి స్థానికుల నుంచి సానుభూతి వెల్లువెత్తడంతో ఎంపీగా ఘన విజయం సాధించారు. మొత్తం 4,98,276 ఓట్లు సాధించి, సమీప ప్రత్యర్థి బి.వినోద్‌కుమార్‌పై 89,508 ఓట్ల తేడాతో గెలుపొందారు.

అసెంబ్లీ, పార్లమెంటు సీట్లకు తీవ్ర పోటీ

ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి తప్పుకున్నాక కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంటు సీట్లలో పోటీకి ఆశావహులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఒకవేళ నిజంగానే ఆయన పోటీ చేయకపోతే.. ఎవరిని రంగంలోకి దింపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ సంతోష్ బీజేపీలో చేరి, అసెంబ్లీకి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈసారి తనకు కరీంనగర్ లోకసభ నుంచి అవకాశం ఇవ్వాలని బీజేపీ సీనియర్ నేత పాల్వాయి సుగుణాకర్‌రావు ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి విన్నవించారు. మొన్నటిదాకా సంజయ్ కరీంనగర్ అసెంబ్లీ, పార్లమెంటు రెండు సీట్లకూ పోటీ చేస్తారన్న ప్రచారంతో వీరెవరూ ముందుకు వచ్చే సాహసం చేయలేదు. కానీ, తాజా ప్రచారంతో బీజేపీలోని ఆశావహులంతా ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు.



బండి సంజయ్

కేంద్ర కేబినెట్ పక్కా అన్న హామీతోనే..

మొన్నటిదాకా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఎంపీ సంజయ్ తన హయాంలో దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో విజయాలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు తెప్పించారు. మునుగోడు బైపోల్‌లోనూ చివరికి వరకు బీజేపీ పోరాడింది. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి ఉన్న 7 శాతం ఓటుబ్యాంకును 32 శాతానికి తీసుకురావడంలో సఫలీకృతుడయ్యారు. ఒక దశలో బీజేపీ సీఎం అభ్యర్థిగా ప్రచారం జరగగా అనూహ్య పరిస్థితుల మధ్య రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలోనూ తాను కరీంనగర్ నుంచే అసెంబ్లీకి పోటీ చేస్తానని సన్నిహితులతో, మీడియాతో చెబుతూ వచ్చారు. అసలు ఆ ఉద్దేశంతోనే పార్టీలో నగరంపై ఎవరికీ పట్టు చిక్కకుండా వ్యూహాత్మకంగా ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్ అంటూ ఐదు భాగాలుగా విభజించారు. కానీ, ఇప్పుడు ఆకస్మికంగా కరీంనగర్ అసెంబ్లీ రేసు నుంచి సంజయ్ వైదొలగబోతున్నారన్న ప్రచారంపై ఆయన అభిమానులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కేంద్రంలో మూడోసారి కూడా మోదీ ప్రభుత్వమే కొలువుదీరనుందని, ఈసారి పార్లమెంటుకు ఎన్నికైతే బండికి కేంద్ర కేబినెట్‌లో స్థానం పక్కా అన్న హామీ మేరకే ఆయన లోకసభపై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే, ఈ ప్రచారంపై మరో రెండు రోజుల్లో బండి సంజయ్ నుంచి ప్రకటన రానుంది.

పిల్లలకు ఫీ'వర్రీ'

- పెరుగుతున్న వైరల్ ఫీవర్లు
- ప్రభుత్వాసుపత్రిలో 40 మందికి చికిత్స
- ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రద్దీ

కరీంనగర్‌టౌన్:

కరీంనగర్‌లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, శ్వాసకోశ వ్యాధులు, డయేరియా కేసులు రెట్టింపు అవుతున్నాయి. ఇద్దరు పిల్లలు డెంగీతో జిల్లా ఆస్పత్రిలో చేరగా.. వివిధ రకాల విష జ్వరాలతో 40మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు సైతం జ్వరాలతో వచ్చే పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో 100కు పైగా ఓపీలు నమోదు అవుతుండగా.. 20మందికి పైగా చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా ఏడేళ్లలోపు పిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలల్లో మందులు, పరీక్షలు రాస్తూ వైద్యులు ఆర్థికదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

ఈ లక్షణాలుంటే ఆస్పత్రికి వెళ్లాల్సిందే

- వైరల్ జ్వరాల బారినపడే వారిలో 103,104 డిగ్రీల టెంపరేచర్ ఉంటుంది. తలనొప్పి తీవ్రస్థాయిలో వస్తుంది. ఓర్చుకోలేని నొప్పివస్తే మాత్రం డెంగీకి గురైనట్లేనని వైద్యులు చెబుతున్నారు. డయేరియాతో విరోచనాలు, వాంతులు అధికంగా ఉంటాయి. నాలుగైదు రోజులపాటు నిర్లక్ష్యంగా ఉంటే రక్తకణాలు పడిపోయే ప్రమాదం ఉంది.
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీరు నిలువ ఉండే పాత డబ్బాలు, టైర్లు, కూలర్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, ఇంటిచుట్టూ మురుగునీరు ఉండకుండా చూడాలి.
- కొత్తగా నిర్మాణం జరిగే ఇండ్లలో దోమలు ఎక్కువగా పెరుగుతాయి. దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలి. జ్వరాల బారిన పడిన పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కును తప్పనిసరిగా వాడాలి.
- ఎక్కువ రోజులు అనారోగ్యకరంగా, జ్వరంతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మెడికల్ షాపుల్లో మందులు వాడి నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయి. డాక్టర్లు రాసిన మందులు వాడడం ఉత్తమం.



పెషెంట్లతో నిండిపోయిన జిల్లా ఆస్పత్రి పిల్లల వార్డు



జాగ్రత్తలు తీసుకోవాలి



జిల్లా ఆస్పత్రిలోని పిల్లల వార్డుకు వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, శ్వాసకోశవ్యాధులు, డయేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయి. ఈనెలలోనే ఈ కేసులు అధికంగా వచ్చాయి. సరైన సమయంలో వచ్చే పిల్లలు త్వరగా రికవరీ అవుతున్నారు. ఆలస్యంగా వచ్చే వారికి కూడా ప్రాణభయం ఏమీ లేదు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కాచివడబోసిన నీళ్లనే తాగాలి. బలమైన ఆహారంగా ఆకుకూరలు, పండ్లు, కోడి గుడ్లు, పప్పులు ఎక్కువగా తీసుకోవాలి.

– అజయ్‌కుమార్, ప్రభుత్వాసుపత్రి పిల్లల వైద్యుడు

వచ్చే నెలలో మార్కెట్, ధోబీఘాట్



రాంనగర్‌లో తీజ్ ఉత్సవాల్లో గిరిజన మహిళలతో మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: వచ్చే సెప్టెంబర్‌లో నగరవాసులకు సమీకృత మార్కెట్, రజకులకు ఆధునిక ధోబీఘాట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. గురువారం నగరంలోని 48వ డివిజన్ కమాన్ సమీపంలో స్థానిక కార్పొరేటర్ దుర్శెట్టి అనూప్‌తో కలిసి రూ.3.50 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. 34వ డివిజన్ గోదాంగడ్డలో ఆధునిక దోభీఘాట్‌ను స్థానిక కార్పొరేటర్ షభీరా అంజుమ్ బర్కత్ అలీతో కలిసి సందర్శించారు. పద్మనగర్‌లో రూ.14 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు స్థానిక కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రజలకు శుభ్రమైన ఆహారపదార్థాలు అందించేందుకు సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒకే చోట కూరగాయలు, పండ్లు, పూలు, మాసం కొనుగోలు చేయవచ్చని సూచించారు. రూ.40 కోట్లతో నగరంలోని పద్మనగర్, వెంకటేశ్వర టెంపుల్ సమీపంలో, వ్యవసాయ మార్కెట్ యార్డ్, రైతుబజార్‌లో మొత్తం నాలుగు సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.14 కోట్లతో పద్మనగర్‌లో నిర్మిస్తున్న మార్కెట్ పనులు తుదిదశకు చేరాయని, సెప్టెంబర్‌లో అందుబాటులోకి తెస్తామన్నారు. 175 మంది వ్యాపారులు పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం అమ్మకాలు చేసే విధంగా ప్రత్యేక స్టాల్స్ నిర్మిస్తున్నామన్నారు. రజకుల కోసం మోడ్రన్ ధోబీఘాట్‌ను గోదాంగడ్డలో నిర్మిస్తున్నామని, ఒకేసారి 60మంది రజకులు తమ కులవృత్తి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈలు కిష్టప్ప, మహేందర్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

కరీంనగర్‌కల్చరల్ : నగరంలోని రాంనగర్, కోతిరాంపూర్‌లలో గురువారం గిరిజన సంఘం, బంజార తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బంజారాల తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు మేయర్ సునీల్‌రావు హాజరై సేవాలాల్ మహరాజ్‌కు పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, బంజారాల తీజ్ ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

మంత్రి ఇంటి ముట్టడికి బీజేపీ యత్నం



బీజేపీ లీడర్లను అడ్డుకుంటున్న పోలీసులు

కరీంనగర్‌టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళిత, బీసీబంధు, నిరుద్యోగభృతి, వివిధ రకాల పింఛన్లు, రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు గురువారం మంత్రి గంగుల కమలాకర్ ఇంటిముట్టడికి యత్నించారు. మంత్రి ఇంటివైపు చొచ్చుకెళ్లేందుకు యత్నించిన బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతున్న పార్టీలను, ప్రశ్నించే గొంతుకలను అనగదొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్లపు రమేశ్, నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసగౌడ్, కళ్లెం వాసుదేవ రెడ్డి, బాస సత్యనారాయణరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

ఓటరు నమోదు అందరి బాధ్యత



జమ్మికుంటలో దళితబంధు లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ గోపి

కరీంనగర్ అర్బన్: ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.గోపి యువతను కోరారు. అక్టోబర్ ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 26, 27 సెప్టెంబర్ 2, 3వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ డేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబితాలో తప్పొప్పుల సవరణ, పేర్లపై ఆక్షేపణలు, అభ్యంతరాలను తెలపడానికి సెప్టెంబర్ 19వరకు గడువు ఇవ్వడం జరిగిందని తెలిపారు. స్పెషల్ క్యాంపెయిన్‌లను నిర్వహించడానికి సంబంధిత బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాలకు ఉదయం 10 గంటలలోగా హాజరు కావాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, జర్నలిస్టులు, జ్యుడీషరీ, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వ్యక్తుల వివరాలు జాబితాలో ఉండేలా బీఎల్‌వో సూపర్ వైజర్లు పరిశీలించి ధృవీకరణను సమర్పించాలన్నారు.

వ్యాపార విస్తరణతోనే ఆర్థికాభివృద్ధి

హుజూరాబాద్/జమ్మికుంట: దళితబంధు ద్వారా ప్రారంభించిన వ్యాపారాలు ఎప్పటికప్పుడు విస్తరించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ గోపి సూచించారు. హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల్లో దళితబంధు యూనిట్లు పరిశీలించారు. దళితబంధు ద్వారా లబ్ధిపొంది ప్రారంభించిన యూనిట్ల ద్వారా జరిగే ఉత్పత్తులు కేవలం జిల్లా వరకే పరిమితం చేయకుండారాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని, అప్పుడే వ్యాపార, ఆర్థికవృద్ధి జరుగుతుందని అన్నారు. జూట్ బ్యాగులను ప్రోత్సహించేలా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆర్డీవో రాజు, జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్ రాజేశ్వర్‌రావు, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎంపీడీవోలు జయశ్రీ, కల్పన, వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు రజనీ, రాణి, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సురేశ్, నాగార్జున పాల్గొన్నారు.

విద్యతో మూఢనమ్మకాల నిర్మూలన



మాట్లాడుతున్న నరేశ్

చొప్పదండి: విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యం అవుతుందని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కోఆర్డినేటర్ ఉప్పులేటి నరేశ్ అన్నారు. చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్య ఆవశ్యకత, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై మాట్లాడారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం వంటి అంశాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ శరత్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సబితా రాణి, కనకయ్య, ఐలయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో సీట్లభర్తీ షురూ

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తెలంగాణ కోటాలో సీట్ల భర్తీ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సీట్ల భర్తీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, శనివారంతో సీట్ల భర్తీ ప్రక్రియ ముగుస్తుందని అన్నారు. ఈ ఏడాది ప్రారంభించిన కళాశాలలో 100సీట్లకు 85సీట్లు రాష్ట్రకోటాలో, 15సీట్లు ఆల్ ఇండియా కోటాలో కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాజస్థాన్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ఒక్కరు చేరారు. ఢిల్లీకి చెందిన ఒక విద్యార్థికి ఉత్తర ప్రదేశ్‌లో సీటు రావడంతో వెళ్లిపోయాడు. గురువారం 10మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారని తెలిపారు. మొట్టమొదటి విద్యార్థి కోరుట్లకు చెందిన బండారి నిత్యకు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అడ్మిషన్‌ఫారంను అందచేశారు. కౌన్సెలింగ్ కోసం విద్యార్థులు కొత్తపల్లిలోని మెడికల్ కళాశాలకు వెళ్తున్నట్లు తెలిసిందని, ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నందున ఇక్కడికే రావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంతన్, డాక్టర్ కవిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో పేర్ల చిచ్చు..


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌


ప్రారంభించని కమ్యూనిటీహాలు శిలాఫలకం

- వాయిదా పడిన శంకుస్థాపన పనులు
- సైదాపూర్‌ మండలంలో బీఆర్‌ఎస్‌ నేతల మధ్య విభేదాలు

సైదాపూర్‌: సైదాపూర్‌ మండలంలో బీఆర్‌ఎస్‌ నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. అభివృద్ధి పనుల శిలాఫలకంలో పేర్ల విషయంలో ఏర్పడిన చిచ్చు గొడవకు దారితీసింది. ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌ నేతలు వాగ్వాదానికి దిగగా.. శిలాఫలకం మార్చుచేశాకే అభివృద్ధి పనులు ప్రారంభించాలని, వాయిదావేశారు హుస్నాబాద్‌ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌ కుమార్‌. సైదాపూర్‌ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మొదట తహసీల్దార్‌ కార్యాలయంలో షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. అనంతరం సైదాపూర్‌ గ్రామ పంచాయతీ, సర్వాయిపేట గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభించారు. ఘనపూర్‌ బీటీరోడ్‌ నుంచి రాయికల్‌ తండా వరకు తారురోడ్డు, బొమ్మకల్‌– వంగర బీటీరోడ్డు, ఎలబోతారం– అమ్మనగుర్తి బీటీరోడ్డు పనులతో పాటు ఎలబోతారం, వెంకటేశ్వర్లపల్లి జీపీ భవనాలు ప్రారంభించారు. వెన్కెపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎంపీడీవో ఆఫీస్‌వరకు మంజూరైన బీటీ రోడ్డు, వెన్కెపల్లి ఈర్లబండ వద్ద నిర్మించే కమ్యూనిటీహాలు పనులకు శంకుస్థాపన కోసం ఏర్పాటుచేసిన శిలాఫలకంపై సైదాపూర్‌ సర్పంచ్‌ చందా శ్రీనివాస్‌ కూడా ఆహ్వానితుడుగా పేరుండడంతో వెన్కెపల్లి గ్రామస్తులు, సర్పంచ్‌ కొండా గణేశ్‌ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఈ పనులు వాయిదా వేశారు. వెన్కెపల్లి– సైదాపూర్‌ నుంచి రాయికల్‌వరకు తారురోడ్డు పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాటుచేసిన శిలాఫలకంపై వెన్కెపల్లి సర్పంచ్‌ కొండా గణేశ్‌ పేరు తొలగించారు. దీంతో వెన్కెపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పేరు ఎందుకు తొలగించారని ఎమ్మెల్యే ఎదుటే ఎంపీపీని సర్పంచ్‌ గణేశ్‌ నిలదీశారు. పేర్లు సరిచేసి మళ్లీ శిలాఫలకలు వేయాలని, అప్పుడే శంకుస్థాపన చేస్తామని ఇంజినీరింగ్‌ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌ విండోల చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, వైస్‌ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌, గణేశ్‌, యుగేందర్‌రెడ్డి, పద్మజ, అయిలయ్య, కాంతమ్మ, లత, పద్మ తదితరులు ఉన్నారు.

జాతీయ జూడో పోటీలకు తెలంగాణ జట్లు


- జాబితా ప్రకటించిన అనంతరెడ్డి, జనార్ధన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్‌: జాతీయస్థాయి జూనియర్స్‌ జూడో చాంపియన్‌ షిప్‌ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నెల 19, 20 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్‌ జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీలో ఈ నెల 28నుంచి సెప్టెంబర్‌ 1వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

పురుషుల జట్టు
ఎస్‌.డింజిల్‌ (ఆదిలాబాద్‌), పి.శివా జీ(యాదాద్రి), టి.శివకుమార్‌ (యాదాద్రి), అనాస్‌ఖాన్‌(హైదరాబాద్‌), టి.రోహన్‌ సింగ్‌ (వరంగల్‌), టి.భువనేశ్వర్‌ సింగ్‌ (వరంగల్‌),షేక్‌ ఫైజాన్‌ (హైదరాబాద్‌), టి.సాయిపుత్రనాథ్‌ (హైదరాబాద్‌).

మహిళల జట్టు
కె.దీపిక (వరంగల్‌, 44కేజీ లోపు), కె.అనూష (వరంగల్‌, 48కేజీ లోపు), ఆర్‌.చాందిని (ఆదిలాబాద్‌, 52కేజీలోపు), బి.స్పందన (వరంగల్‌, 57కేజీ లోపు), పి.వసుధ (ఆదిలాబాద్‌, 63కేజీలోపు), నరేస్‌సుల్తానా (హైదరాబాద్‌, 70కేజీలోపు), హుమేరాబేగం (హైదరాబాద్‌, 78కేజీ లోపు), డి.నక్షత్ర (78కేజీ పై).

అంధులకు చూపునిద్దాం



- చనిపోయినా కళ్లను సజీవంగా ఉంచొచ్చు
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 900మంది నేత్రాలుదానం
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు


మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలు సేకరిస్తున్న టెక్నీషియన్‌ (ఫైల్‌)

కోల్‌సిటీ(రామగుండం): మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతున్నవారెందరో కంటిచూపు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై ఏటా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్‌ 8 వరకు ప్రభుత్వాలు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. చనిపోయిన తర్వాత నేత్రాలు భూమిలో కలిసిపోకుండా.. మంటల్లో కాలిబూడిదవకుండా ఉండేందుకు ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్‌(94927 81306), లయన్స్‌ క్లబ్‌(98491 06589), తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం(73969 24667) తదతర స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో 900 మంది నేత్రదానం చేసి, 1,800 మందికి చూపునిచ్చారు. నేత్రదానానికి 60 వేల మందికి పైగా ప్రతిజ్ఞ చేయగా ఇప్పటివరకు 1,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రదానం ఎవరైనా చేయవచ్చు
నేత్రదానం చేయడానికి వయసు పరిమితులు లేవు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాల(కేటరాక్టు) ఆపరేషన్‌ చేయించుకున్నవారు కూడా చేయవచ్చు. హైపటైటిస్‌, ఎయిడ్స్‌ తదితర వ్యాధులున్నవారు మాత్రం చేయకూడదు. కళ్లను దానం చేయడానికి స్వచ్ఛంద సంస్థలకు, ఐ బ్యాంకులకు సమాచారం ఇవ్వాలి.

కొన్ని సందర్భాల్లో నలుగురికి చూపునివ్వొచ్చు
మనం మరణించినా.. మన నేత్రాలు మాత్రం సజీవంగానే ఉండాలంటే నేత్రదానం ఒక్కటే మార్గం. కళ్లను తీసిన తర్వాత ఐ బ్యాంకులో విశ్లేషించి, ప్రాసెస్‌ చేస్తారు. కార్నియాను 96 గంటల్లోపు ట్రాన్స్‌ప్లాంట్‌ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. ఒకరు దానం చేసిన రెండు నేత్రాలతో కొన్ని సందర్భాల్లో నలుగురికి కంటిచూపు ప్రసాదించే అవకాశం ఉంటుంది. మిగతా సాధారణ సందర్భాల్లో మాత్రం ఇద్దరికి చూపు వచ్చేలా చేయొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మరణించిన కన్నడ పవర్‌ స్టార్‌ పునీత్‌ రాజ్‌కుమార్‌ కళ్లతో నలుగురు అంధులకు చూపునిచ్చారు.

ఇవి పాటించడం తప్పనిసరి
వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్‌ గానీ, శిక్షణ పొందిన టెక్నీషియన్‌ మాత్రమే స్టెరైల్‌ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి, రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే మృతదేహం దగ్గర ఫ్యాన్లు ఆపేయాలి. ఏసీ, కూలర్లు ఉంటే ఆన్‌ చేయాలి. తడిపిన దూదిని ఐస్‌తోపాటు మూసిన కళ్లపై ఉంచాలి. తలకింద తలగడ పెట్టి ఎత్తుగా ఉండేలా చూడాలి.

మా అమ్మ కళ్లు దానం చేశాం



మా అమ్మ మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కళ్లను దానం చేశాం. అవి మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఉండి, ఈ లోకాన్ని చూస్తున్నాయని ఆనందంగా ఉంది. నేను కూడా నేత్రదానం చేస్తానని అంగీకారపత్రం ఇచ్చాను.
– కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ మేయర్‌, రామగుండం

నేత్రదానంతో చూపు సజీవం



మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని చూడొచ్చు. మనిషి మరణించాక నేత్రదానం చేయండి. దీనివల్ల చూపు సజీవంగా ఉంటుంది. ఇంతకంటే గొప్ప దానం మరొకటి లేదు. అపోహలు వీడి, అందరూ ముందుకు రావాలి.
– శ్యాంప్రసాద్‌లాల్‌, అదనపు కలెక్టర్‌, పెద్దపల్లి

12 మంది నుంచి సేకరించాం



రామగుండం లయన్స్‌ ఆధ్వర్యంలో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మరణించిన 12 మంది కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్‌ చేసి, నేత్రాలు సేకరించాం. దీనివల్ల 24 మందికి కంటిచూపు వచ్చేలా చేశాం.
– తానిపర్తి విజయలక్ష్మి, అధ్యక్షురాలు, రామగుండం లయన్స్‌ క్లబ్‌

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నేత్రదానంపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను అక్కడి ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని, అవయవాలను ఇతరులకు అమర్చేలా చూస్తున్నాయి. మా ఫౌండేషన్‌ ద్వారా 900 మంది మృతుల నుంచి కళ్లు సేకరించాం. సెలబ్రిటీలు సమాజహితం కోసం ముందుకు రావాలి.
– సీహెచ్‌.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్‌

క్లుప్తంగా

అల్ఫోర్స్‌లో చంద్రయాన్‌- 3 విజయోత్సవాలు



కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌లో చంద్రయాన్‌–3 విజయోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌ రెడ్డి మాట్లాడుతూ ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్‌–3 విజయవంతంతో భారత్‌ చరిత్ర సృష్టించిందన్నారు. సాంకేతిక రంగంలో ఇలాంటి విప్లవాత్మక విజయాలు భవిష్యత్‌ పరిశోధనలకు మనోధైర్యాన్ని నింపుతాయని తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ



తిమ్మాపూర్‌: తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు చంద్రయాన్‌–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ దేశం సాధించని ఘన విజయాన్ని మనదేశం సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యా సంస్థల చైర్మన్‌ శ్రీధర్‌, డైరెక్టర్‌ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, రీజనల్‌ ఇన్‌చార్జి రాజు, కోఆర్డినేటర్‌ ప్రవీణ్‌, డీన్‌ విజయ్‌కృష్ణ, ప్రైమరీ కోఆర్డినేటర్‌ విజయలక్ష్మి, ఏవో జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ టికెట్‌కు దరఖాస్తులు


దరఖాస్తు అందజేస్తున్న కర్ర సత్యప్రసన్నరెడ్డి

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ టికెట్‌ను మహిళా కోటాలో తనకు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్‌ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి గురువారం గాంధీభవన్‌లో పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేష్‌గౌడ్‌కు దరఖాస్తు అందజేశారు.అదే విధంగా డీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. గత 30 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నానని వివరించారు.అదే విధంగా కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు రమేశ్‌ దరఖాస్తు చేసుకున్నారు. గత 30ఏళ్లుగా పార్టీలో నమ్మకంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

బీసీలపై రాజకీయ పార్టీల వైఖరి మారాలి

- బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌ చారి


నిరసన తెలుపుతున్న బీసీ విద్యార్థి నాయకులు

కరీంనగర్‌: బీసీలపై రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని, ఈ వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తామని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌ చారి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌. ఆనంద్‌ మాట్లాడుతూ.. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్‌ కేవలం 23 సీట్లు, అర శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు 60 సీట్లు, ముఖ్యమంత్రి పదవిని కేటాయించే పార్టీలకు తమ సంఘం తరపున మద్దతు తెలుపుతామని అన్నారు. సెప్టెంబర్‌ 10న సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌ గౌడ్‌, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న సింహగర్జన సన్నాహక సమావేశం ఉంటుందని, బీసీ సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్‌, అధికార ప్రతినిధి దుంపట మురళి, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ వాసు, గొడిశెల రమేశ్‌, యువజన సంఘం వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మాదాసు సంజీవ్‌, నాయకులు పాల్గొన్నారు.

పవర్‌ లిఫ్టింగ్‌ క్రీడాకారిణికి సత్కారం



కరీంనగర్‌స్పోర్ట్స్‌: స్థానిక విద్యారణ్యపురిలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం దుబాయ్‌లోని షార్జా వేదికగా జరిగిన ఆసియా యూనివర్సిటీ కప్‌ క్లాసికల్‌ పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో 84కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిన రంగు విరంచి స్వప్నికను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ రాజ్‌కుమార్‌ శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. రాజు, ప్రవీణ్‌, శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్‌, కిషన్‌రెడ్డి, సుధీర్‌, పీఈటీలు రంగు రాంప్రసాద్‌, సుప్రజ, నాగేంద్ర పాల్గొన్నారు.

బావపై బీరుసీసాతో దాడి

- తిమ్మాపూర్‌ వైన్‌షాపు వద్ద ఘటన


గాయాలతో తిరుపతి గౌడ్‌

తిమ్మాపూర్‌: మండల కేంద్రంలోని ఓ వైన్స్‌ వద్ద బావపై బామ్మర్ది బీరుసీసాతో దాడిచేసిన సంఘటన వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన న్యాలం తిరుపతిగౌడ్‌, బెజ్జంకి మండలం వడ్లూరుకి చెందిన ప్రదీప్‌ బావ బామ్మర్దులు. గతేడాది వడ్లూరు సర్పంచ్‌తో జరిగిన గొడవ కేసులో నిందితులు. గురువారం పేషీలో భాగంగా కరీంనగర్‌ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం తిమ్మాపూర్‌లోని వైన్స్‌వద్దకు చేరుకుని మద్యం సేవించారు. ఈ క్రమంలో సర్పంచ్‌ కేసు విషయంలో మాటామాట పెరిగి పరస్పరం దాడికి పాల్పడ్డారు. కోపోద్రిక్తుడైన బామ్మర్ది ప్రదీప్‌ తన బావ తిరుపతిగౌడ్‌పై బీరుసీసా పగలగొట్టి దాడి చేశాడు. చెవి పైభాగంలో, వీపులో గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని తిరుపతిగౌడ్‌ను చికిత్సకోసం కరీంనగర్‌ ఆసుపత్రి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

26న మినీ జాబ్‌మేళా

కరీంనగర్‌: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 26న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నోడల్‌ జిల్లా ఉపాధి అధికారి కే.దేవేందర్‌ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌, డిగ్రీ విద్యార్హతలు ఉన్న 18 నుంచి 35ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటాతో జిల్లా ఎంప్లాయ్‌మెంట్‌ కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 9133398820, 9963014525ను సంప్రదించాలని సూచించారు.

సాధారణ ప్రసవాలు పెంచాలి

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో గర్భిణులను గుర్తించి, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ లలితాదేవి సూచించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ వేసేలా చూడాలని తెలిపారు. లెప్రసీ సర్వేను ఆశకార్యకర్తలతో నిర్వహించాలని అన్నారు. దగ్గు, స్వల్పజ్వరం, ఛాతినొప్పి ఉన్నవారిని గుర్తించి శాంపిల్స్‌ సేకరించి, క్షయవ్యాధి నిర్ధారణ కోసం పంపించాలని సూచించారు. డాక్టర్‌ రవీందర్‌రెడ్డి, డాక్టర్‌ సాజీదాఅతహరి, డాక్టర్‌ వినీత తదితరులు పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌ వద్ద గంజాయి విక్రేత అరెస్టు

గోదావరిఖని: గంజాయి విక్రేతను రామగుండం టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యైటింక్లయిన్‌కాలనీ అల్లూరుకు చెందిన బాదె వినయ్‌కుమార్‌ గురువారం కరీంనగర్‌ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న బస్సులో వస్తున్నాడు. బసంత్‌నగర్‌ ఫ్యాక్టరీ గేట్‌ బస్టాప్‌ వద్ద పోలీసులు బస్సును ఆపి, తనిఖీలు చేపట్టారు. వినయ్‌కుమార్‌ వద్ద 6.4 కిలోల గంజాయి లభించింది. దీని విలువ రూ.1.60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా గంజాయికి బానిసై, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న దురాశతో ఈ వ్యాపా రం చేస్తున్నట్లు చెప్పాడన్నారు. వైజాగ్‌లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతంలోని అమాయక విద్యార్థులు, యువతకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడిని, గంజాయిని బసంత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌ సీఐ సుధాకర్‌, సిబ్బంది ఉన్నారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

జూలపల్లి: తండ్రిని కిరాతకంగా హతమార్చిన ఓ తనయుడికి పెద్దపల్లి న్యాయస్థానం జీవితఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. వివరా ల్లోకి వెళ్తే.. జూలపల్లి మండలంలోని అబ్బాపూర్‌కు చెందిన కత్తెర్ల మహేశ్‌ డిగ్రీ ఫెయిలయ్యి, పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో 7–5–2021 రోజున అతని తండ్రి లచ్చయ్య మందలించాడు. తన మిత్రులు, చుట్టుపక్కనున్నవారి ముందు ఇలా చేయడాన్ని మహేశ్‌ అవమానంగా భావించాడు. అదేరోజు రాత్రి ఆరుబయట తండ్రి మంచం పక్కనే మరో మంచం వేసుకొని, నిద్రించాడు. అర్ధరాత్రి లేచి, పక్కనున్న రోకలి బండతో లచ్చయ్యపై దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేయగా సీఐ ఇంద్రసేనారెడ్డి దర్యాప్తు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో మహేశ్‌కు న్యాయమూర్తి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్‌ గైక్వాడ్‌, ఏసీపీ మహేశ్‌ల పర్యవేక్షణలో సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన ఎస్సై వెంకటకృష్ణ, సీఐ జగదీశ్‌, సుల్తానాబాద్‌ సీడీవోలు శ్రీనివాస్‌, సిబ్బందిని సీపీ అభినందించారు.







సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
295 గజాల పాత ఇల్లు కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల దగ్గరలో అమ్మకానికి కలదు. రూ. 45000/-Sq.yard. ఫోన్ : 9440042129, 8639097259. [HA-94724]

SERVICES
శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788623]

BUSINESS OFFER
Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్ట కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

www.sakshi.com

WANTED
మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



35వ డివిజన్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 35వ డివిజన్ పరిధిలో గల రామాలయం, రోడ్ నంబర్ 7, 12వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్లను మేయర్ యాదగిరి సునీల్ రావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, తోట రాములు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు గురువారం గ్రామభారతి సంస్థ కంప్యూటర్‌ను అందజేసింది. ఈ కార్యక్రమంలో గ్రామభారతి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి రాజారెడ్డి, జిల్లా బాధ్యులు సముద్రాల జనార్దన్‌రావు, గాలిపల్లి నాగేశ్వర్, గ్రామ వికాస్ బాధ్యులు జిన్నా సత్యనారాయణరెడ్డి, సరస్వతీ శిశుమందిర్ కార్యదర్శి కోల అన్నారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల రాజమౌళి పాల్గొన్నారు.

సీపీజీఈటీ ఫలితాల్లో 'అల్ఫోర్స్' విజయకేతనం



కొత్తపల్లి: ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించిన సీపీజీఈటీ–2023 ఫలితాలలో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీకళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఫుడ్‌సైన్స్ విభాగంలో మహ్మద్ అధిబా తారునమ్ రాష్ట్రస్థాయి 2వ ర్యాంకు, వి.శ్రీవాహిణి 12వ ర్యాంకు, బి.శ్రీవర్ష 13వ ర్యాంకు, న్యూట్రిషన్ విభాగంలో మది 23వ ర్యాంకు, మహ్మద్ అధిబా తారునమ్ 39వ ర్యాంకు, శైలజా 78వ ర్యాంకు, బాటనీ విభాగంలో హఫ్సాఖానమ్ 41వ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో జె.సుప్రియ 43వ ర్యాంకు, ఫిజిక్స్ విభాగంలో కె. కావ్యశ్రీ 119వ ర్యాంకు, స్టాటటిక్స్ విభాగంలో ఆర్. సాహితి 143వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు, డా.బి.విజయలక్ష్మి, జి. చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకబృందం అభినందించారు.

అన్నదానం



కరీంనగర్: నగరంలోని బాలసదన్ చిన్నారులకు, ప్రభుత్వ ఆస్పత్రిలో, అంబేడ్కర్ క్లబ్, 43వ డివిజన్‌లో గురువారం కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్ అన్నదానం నిర్వహించి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, అంబేడ్కర్ యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతం..

ఆలయాలు ముస్తాబు



చైతన్యపురిలోని మహాశక్తి ఆలయం



జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోషి మాత ఆలయం

కరీంనగర్‌కల్చరల్: శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకునే వరలక్ష్మీ వ్రతాలకు నగరంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ఉదయం అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, ఓడిబియ్యం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. జ్యోతినగర్‌లోని సంతోషిమాత ఆలయం కుంకుమార్చనలు, అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, ఓడిబియ్యం సమర్పించేందుకు భక్తులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. యజ్ఞవరాహక్షేత్రం, అంబాభవానీ, వాసవీ కన్యకాపరమేశ్వరి, పలు అమ్మవారి ఆలయాల్లో వ్రతాలు, కుంకుమార్చనలు జరగనున్నాయి. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వరాలిచ్చే దేవత వరలక్ష్మీదేవి

వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. మహిళలు, యువతులు వాయినాలు, వరలక్ష్మీవ్రతాలు, కుంకుమ పూజలతో లక్ష్మీదేవిని కొలిస్తే సకల శుభాలు, సౌభాగ్యం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. లక్ష్మీదేవి సంపదతో పాటు అనేక ఫలితాలను ఇచ్చే దేవత కావడంతో ఉత్కృష్టమైన దినంగా భావిస్తారు. వ్రతాచరణతో వారి బాధలు తొలగి సుఖసంతోషాలతో జీవిస్తారని వేద, పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయి. గృహాల్లో అమ్మవారి ప్రతిమ, ఫొటోను నిలిపి సంకల్పం చెప్పుకుని వ్రతాన్ని ఆచరిస్తారు. సాయంత్రం మహిళలు, యువతులను ఆహ్వానించి వాయినాలిచ్చి సుమంగళీ యోగ్యత, సౌభాగ్యాల్ని ప్రసాదించాలని కోరుకుంటారు. పసుపుకుంకుమలు, పండ్లు, పూలు, వస్త్రాలు, ఒడిబియ్యం, తాంబూలం, ప్రసాదం ఇచ్చి ముత్తైదువ పూజ జరిపి ఆధ్యాత్మిక భావంతో పరవశించి పోతారు.

కిటకిటలాడిన పూజాసామగ్రి దుకాణాలు



విద్యానగర్(కరీంనగర్): వరలక్ష్మీ శుక్రవారం సందర్భంగా గురువారం నగరంలోని పూజా స్టోర్లు పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూజలకు, అమ్మవారి అలంకరణకు ఉపయోగించే పూలను వ్యాపారులు రెట్టింపు ధరలకు విక్రయించారు. అమ్మవారి ప్రతిమలు, గాజులు, పసుపు, కుంకుమ, అగర్‌బత్తులు, దూపం తదితర వస్తువులు కొనుగోలుచేయడంలో ముత్తైదువలు బిజీగా కనిపించారు.

చిత్ర కథ — ప్రమాదకరంగా స్టీల్ గ్రిల్స్





స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని నాఖా చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దారు. చౌరస్తా చుట్టూ ఏర్పాటు చేసిన స్టీల్ గ్రిల్స్ సరిగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు వెళ్తున్న సమయంలో పొరపాటున తగిలితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. త్వరగా సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

బీసీ కులవృత్తిదారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

కరీంనగర్‌రూరల్: బీసీ కులవృత్తిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని తెలంగాణ రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో రజకుల మేలుకొలుపు యాత్రలో భాగంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ కులవృత్తిదారులకు ప్రకటించిన రూ.లక్ష సాయాన్ని నియోజకవర్గంలో పదిమందికి ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రజక కార్పొరేషన్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి యువతను ఆదుకోవాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల జనాభా ప్రాతిపదికన టిక్కెట్లు కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు మునిగంటి ఓదెలు, రాజయ్య, మల్లయ్య, నేరెల్ల అంజయ్య, మైలారం నాగరాజు, రాజేశ్వరీ, రజిత, లత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గడప గడపకూ కాంగ్రెస్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని పోస్టాఫీస్ ఏరియా, మదీనా కాంప్లెక్స్, గర్ల్స్ కాలేజీ ఏరియాల్లో కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టాఫీసు వద్ద మేస్త్రీలు, దినసరి కూలీల సమస్యలు తెలుసుకొని కాంగ్రెస్‌కు మద్దతు కోరినట్లు తెలిపారు. పేద ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని, పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని, ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు సాయం చేస్తుందని, కూలీలు, కౌలు రైతులను ఆదుకుంటుందని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు దన్న సింగ్, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, రాజయ్య, రవి, లక్ష్మణ్, గడ్డం విలాస్‌రెడ్డి, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ బారీ, నెల్లి నరేశ్, బషీర్, షబానా, ముక్కల కవిత, ఎగ్గడి శారద, మహాలక్ష్మి, జీడి రమేశ్, మెతుకు కాంతయ్య, ఇమామ్, వంగల విద్యాసాగర్, లయక్, హనీఫ్, మామిడి సత్యనారాయణరెడ్డి, జిలకర రమేశ్, కాంపల్లి కీర్తికుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి



జీవో ప్రతులు దహనం చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

కరీంనగర్: రెండో ఏఎన్ఎంలతో చర్చలు జరిపి, వెంటనే క్రమబద్ధీకరించాలని, లేకుంటే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హెచ్చరించారు. గురువారం సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగాల నియామకం కోసం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ జీవో ప్రతులను దహనం చేశారు. సమ్మయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తామన్న కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాలయాపన చేయకుండా వెంటనే యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి రెండోఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్, ఏఎన్ఎంల జిల్లా అధ్యక్షురాలు మెరుగు రజిత, ప్రధాన కార్యదర్శి శోభారాణి, నాయకులు అరుణ్, రేణుక, విజయ, కనుకలక్ష్మి, అన్నపూర్ణ, నూతన, మమత పాల్గొన్నారు.

సన్మానం



హర్షిత్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించిన కోసర మనోహర్–సరిత కుమారుడు హర్షిత్‌ను గురువారం కరీంనగర్ మండలం చేగుర్తిలో బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల విజయ, ఎంపీటీసీ స్వరూప, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్ గాండ్ల అంజయ్య, గాలిపల్లి రవీందర్, కూకట్ల రాజు, రమేశ్, ఎండీ తాజ్, మహ్మద్ పాషా, అశోక్, లక్ష్మణ్, నాగభూషణం, రవి, కిరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మాఫియా డాన్‌లకు టికెట్లు ఇచ్చిన కేసీఆర్'



మాట్లాడుతున్న పద్మాకర్ రెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ఇసుక, లిక్కర్ మాఫియాలకు, భూకబ్జాలకు పాల్పడే వారికే కేసీఆర్ బీఆర్ఎస్ టికెట్లు కేటాయించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ టికెట్లు కేటాయించిన వారిలో మాఫియా లీడర్లే ఉన్నారని, వారిని మార్చితే తనను మార్చుతారనే భయంతోనే వారికే టికెట్లు కేటాయించారని అన్నారు. ఓటమి భయంతోనే కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేస్తున్నాడని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, రూ.4 వేల నిరుద్యోగ భృతి, యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'ఇరు ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

కరీంనగర్: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఇద్దరూ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్‌వల్లి ఉల్లా ఖాద్రీ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగుల వయస్సు పెరిగిపోతోందని, చదివిన చదువుకు ఉద్యోగ అవకాశాలు రాక కుంగిపోతున్నారని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఏటా కోటి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పాడని, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన లక్ష ఉద్యోగ అవకాశాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగ యువతను మోసం చేసిన ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు యువత సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు చెంచల మురళి, వెంకటేశ్, సిద్ధు పాల్గొన్నారు.

పల్లెల్లో పచ్చదనం

- 26న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం
- ప్రతీ గ్రామ పంచాయతీకి 750
- కరీంనగర్ మండలంలో 12,500 మొక్కల లక్ష్యం
- శరవేగంగా గుంతల తవ్వకం



మొగ్దుంపూర్‌లో గుంతలు తవ్వుతున్న ఉపాధికూలీలు



జూబ్లీనగర్‌లో నాటిన మొక్కలకు సపోర్టు కర్రను ఏర్పాటు చేయిస్తున్న ఏపీవో శోభ

కరీంనగర్‌రూరల్: ప్రతీ పల్లె పచ్చగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఏటా వర్షాకాలంలో పెద్దసంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ చర్యలు చేపడుతోంది. అంతేకాకుండా ప్రత్యేక కార్యక్రమాల ద్వారా మధ్యమధ్యలో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతోంది. స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. దీనిలో భాగంగా కరీంనగర్ మండలంలో 12,500 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ వర్షాకాలంలో మొత్తం 1.51లక్షల మొక్కలను నాటడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 60వేల మొక్కలు నాటారు.

ప్రతీ పంచాయతీకి 750 మొక్కలు

కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామపంచాయతీలున్నాయి. ఒక్కో గ్రామపంచాయతీకి 750 చొప్పున మొత్తం 12,500 మొక్కలను నాటేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని ఖాళీస్థలాలు, రహదారులకు ఇరువైపుల స్థలాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఇతర ప్రాంతాలను గుర్తించారు. ఆయా గ్రామాల్లో లక్ష్యానికి అనుగుణంగా ఉపాధిహామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. ఇప్పటివరకు 5,500 గుంతలను తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

ఈనెల 26న చేపట్టనున్న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వశక్తి మహిళలు, యువకులు భాగస్వాములు కావాలి. పంచాయతీలకు కేటాయించిన లక్ష్యం మేరకు తప్పనిసరిగా మొక్కలు నాటాలి. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో..

కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: సీఎం కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం కరీంనగర్‌లోని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇంటి ముట్టడి వెళ్లకుండా బీజేపీ కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ కొత్తపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు కెంచ శేఖర్ మాట్లాడుతూ బీజేపీ నాయకులకు పోలీస్‌స్టేషన్లు, జైల్‌లు కొత్తేమికాదని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్లనీయకుండా ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయమని మాత్రమే కోరుతున్నామని, హామీలు మరిచిన సీఎంను రాబోవు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడం ఖాయమని తెలిపారు. అరెస్టయిన వారిలో తీగలగుట్టపల్లి కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు బాషవేణి మల్లేశం యాదవ్, నందకుమార్, అశోక్, కాశెట్టి శేఖర్, గుడిపాక రాములు, మెరుగు పర్శరాం, బైరెడ్డి వంశీ, బోనాల నరేశ్, పొన్నాల రాములు తదితరులున్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల నిరసన



కరీంనగర్: ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూళ్లల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట స్వీపర్లు రోడ్డుఊడ్చి నిరసన చేపట్టారు. ప్రభుత్వ జిల్లా మండల పరిషత్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంద్రాల రమేశ్ మాట్లాడుతూ ఏవీఎస్‌రెడ్డి కమిటీ సిఫారసు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకర్, రమేశ్, అలీం,శంకరయ్య, మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

క్లుప్తంగా...

ఎంపీ అర్వింద్‌పై ఈసీకి బీఆర్‌ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: నోటాకు ఓటేసినా, చేయి గుర్తుకు వేసినా, కారు గుర్తుకు వేసినా గెలిచేది తానేనంటూ వ్యాఖ్యలు చేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కోరింది. ఈ మేరకు బీఆర్ఎస్ న్యాయ విభాగ ఇన్‌చార్జి సోమా భరత్‌కుమార్ గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలను దుర్వినియోగం చేయాలనే అర్వింద్, బీజేపీల ఉద్దేశాన్ని ఈ వ్యాఖ్యలు బయటపెట్టాయని తెలిపారు. ఓటేసే స్వేచ్ఛను హరించేలా, వారి హక్కులకు భంగం కలిగిస్తూ అర్వింద్ ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళల్ని అవహేళన చేయకండి: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళల వ్యక్తిత్వ హననం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. తప్పుడు వ్యాఖ్యానాలతో అవహేళన చేయడం మానుకోవాలని ఆమె బీజేపీ నేతలను కోరారు. తెలంగాణ బీజేపీ చేసిన ఓ ట్వీట్‌పై ఆమె గురువారం ట్విట్టర్ వేదికగానే ఘాటుగా స్పందించారు. 'మహిళలను అవహేళన చేయడం తగదు. మహిళలు ఉన్నత స్థానానికి చేరుకోవడాన్ని బీజేపీ ఓర్వలేకపోతోందా? మహిళల హక్కుల గురించి మాట్లాడుతున్న వారి గొంతు నొక్కేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఇతరులపై నిందలు వేయడం మానుకుని పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు కృషి చేయాలి..' అని ఆమె ట్వీట్ చేశారు.

మాట తప్పుతున్న పొన్నాల
మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



సాక్షి, హైదరాబాద్: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించడం లేదని, పొన్నాల లక్ష్మయ్యే ఇచ్చిన మాటను తప్పుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. 2018 ఎన్నికల సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు తనకు ఈసారి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాల్సి ఉందని కొమ్మూరి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. '2018లో నా వద్దకు వచ్చిన పొన్నాల తనను గెలిపించాలని అడిగారు. 2023లో తాను పోటీ చేయనని చెప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఆయన సమక్షంలోనే నేను కాంగ్రెస్ పార్టీలో చేరాను'అని కొమ్మూరి తెలిపారు. కానీ, ఇప్పుడు తనకు టికెట్ ఇవ్వద్దని, జనగామ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించవద్దని అంటున్నారని ఆయన మండిపడ్డారు. తాను ప్రాతినిధ్యం వహించిన చేర్యాల.. జనగామ జిల్లాలో సింహభాగమని, 20 ఏళ్లుగా జనగామలోనే తాను ప్రజలకు సేవ చేస్తున్నానని, ఈసారి ప్రజలు ఆశీర్వదిస్తే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా మరోమారు అసెంబ్లీలో అడుగు పెడతానని కొమ్మూరి ధీమా వ్యక్తం చేశారు.

వచ్చేఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బీసీలు బుద్ధి చెప్పాలి: బూర



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ బీసీ వ్యతిరేకి అని, బీసీ కులాలకు తగినన్ని టికెట్లు కేటాయించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కోటీ 60 లక్షల ఓటర్లు ఉన్న బీసీ కులాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. 'బీఆర్ఎస్ జాబితాలో ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం, బాధాకరం. కురుమలు, రజకులు, కుమ్మరులు, వడ్డెర, లింగాయత్, విశ్వకర్మ, బోయ వాల్మీకి, మేదర, గంగపుత్రులు సహా బీసీల్లోని చాలా సామాజిక వర్గాలకు బీఆర్ఎస్ టికెట్లు కేటాయించకుండా, బీసీ ద్రోహి పార్టీగా వ్యవహరిస్తోంది'అని మండిపడ్డారు. గురువారం బూర నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ 'అవినీతి ఆరోపణలున్న ఎమ్మెల్యేలకే మళ్లీ టికెట్లు కేటాయించడం వెనుక ఉద్దేశం.. వారంతా రాజకీయ వెట్టిచాకిరికి అలవాటుపడి బాధను కూడా ఆనందించే జబ్బు(మెసోడిజం) తో ఉన్నారు'అని వ్యాఖ్యానించారు.

'కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళనలు'

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం, రుణవిమోచన చట్టం చేయలేదని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించలేదని, నలుగురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఆశిష్‌కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని, రైతాంగంపై అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల నేతృత్వంలో గురువారం ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో జరిగిన సదస్సులో పాల్గొన్న అనంతరం బి.వెంకట్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ సహాయకార్యదర్శి టి.సాగర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

మంత్రిగా పట్నం ప్రమాణస్వీకారం

ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై
- పాల్గొన్న సీఎం కేసీఆర్, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- పట్నంకు సమాచార, గనుల శాఖ.. ప్రభుత్వం ఉత్తర్వులు



పట్నం మహేందర్‌రెడ్డితో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి రాష్ట్ర మంత్రిగా గురువారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఓ స్థానం ఖాళీ అయింది. దీంతో పట్నం మహేందర్ రెడ్డికి అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాగా, గవర్నర్ తమిళిసై ఇచ్చిన తేనీటి విందులో సీఎం కేసీఆర్, మంత్రులు, ఇతర అతిథులు పాల్గొన్నారు. గవర్నర్‌తో కలిసి మంత్రి మండలి సభ్యులందరితో గ్రూప్ ఫొటో సెషన్‌లో కేసీఆర్ పాల్గొన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్ రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మహేందర్‌రెడ్డికి మైన్స్..: కాగా, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్ రెడ్డికి భూగర్భ గనులు, సమాచార పౌర సంబంధాల శాఖ లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయగా, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆమోదించారు. దీంతో ప్రభుత్వం ఈ మేరకు ఆయనకు శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనుంది. కాగా, గతంలో ఈయన రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల ఎన్నిక చెల్లదు

▶ మొదటి పేజీ తరువాయి

పిటిషనర్‌కు పరిహారంగా చెల్లించాలని చెప్పింది.

డీకే అరుణ పిటిషన్‌తో..

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే అరుణ పోటీ చేశారు. ఇందులో కృష్ణమోహన్‌రెడ్డికి 1,00,057 ఓట్లు, అరుణకు 71,612 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచినట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. అయితే ఎన్నికల సమయంలో కృష్ణమోహన్‌రెడ్డి సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉందని.. ఆయన ఎన్నికను రద్దు చేసి, తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరుతూ డీకే అరుణ తరఫున న్యాయవాది యోగితా ప్రకాశ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్ గురువారం తీర్పు వెలువరించారు.

భూములు, ఖాతాల వివరాలు చెప్పలేదని..

అంతకుముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తూ.. కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన భార్య పేరుతో ఉన్న వాహనాలకు ట్రాఫిక్ చలానాలు ఉన్నా చెల్లించలేదని, ఈ వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కోర్టుకు వివరించారు. గద్వాల ఎస్‌బీఐ, ఏడీబీ బ్యాంకుల్లో కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన భార్య జ్యోతికి ఉన్న ఖాతాల వివరాలను చెప్పలేదన్నారు. సిబిల్ వివరాల ప్రకారం ఎమ్మెల్యే బ్యాంకులకు రూ.1,09,67,737 రుణాలు బకాయిలు ఉన్నా వెల్లడించలేదని, అలాగే జాతీయ బ్యాంకుల్లో మరో రూ.1.22 కోట్ల రుణాలున్నా పేర్కొనలేదని వివరించారు. అదే విధంగా పుద్దూరులో వారికి ఉన్న 24 ఎకరాల భూమిని అఫిడవిట్‌లో చూపలేదన్నారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసినా స్పందన రాలేదు. పత్రికా ప్రకటన ఇచ్చినా స్పందించలేదు. దీంతో న్యాయమూర్తి తీర్పును జూన్ 22న తీర్పును రిజర్వు చేసి గురువారం వెల్లడించారు. అయితే ఈ కేసులో కృష్ణమోహన్‌రెడ్డి తరఫున వాదనలు వినిపించేందుకు ఆగస్టు 18న న్యాయవాది మనోహర్ వచ్చారని, ఈ మేరకు అప్లికేషన్ దాఖలు చేశారని రిజిస్ట్రీ హైకోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. జూన్ 22నే తీర్పు రిజర్వు చేశామని, ఈ నేపథ్యంలో మధ్యంతర అప్లికేషన్‌ను అనుమతించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టును ఆశ్రయిస్తా..
బండ్ల కృష్ణమోహన్



తన ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని, తనకు అనుకూలంగా తీర్పు వస్తుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు అనంతరం బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తీర్పు వెలువరించిందన్నారు. తన రాజకీయ ప్రత్యర్థులు నాలుగు అభియోగాలతో కోర్టుకు వెళ్లారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, కొందరికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేక దొడ్డిదారి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తాను గత ఎన్నికల్లో 37వేల మెజార్టీతో గెలిచానని, ఈసారి 50వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా న్యాయం జరిగింది: డీకే అరుణ



తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తూ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ, అభ్యర్థులకు ఈ రోజు న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చెంపపెట్టు వంటిదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. ఈ తీర్పు మూడేళ్ల ముందే రావాల్సిందని.. ఇప్పటికైనా తనకు న్యాయం జరిగిందని భావిస్తున్నామని చెప్పారు. హైకోర్టు తీర్పును గద్వాల ప్రజలకు అంకితం చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఘన విజయం సాధిస్తుందనే దానికి ఇది సంకేతమని పేర్కొన్నారు.

అవసరమైన చోట | ఎక్కువమంది ఉద్యోగులు

- రోగుల తాకిడిని బట్టి తగినంత సిబ్బంది
- వైద్యారోగ్యశాఖలో ఉద్యోగుల హేతుబద్ధీకరణ... మార్గదర్శకాలు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించే ప్రజారోగ్య సంచాలకుల విభాగాన్ని బలోపేతం చేయాలనే ఆలోచనతో హేతుబద్ధీకరణ చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఏర్పాటు చేసిన కమిటీ ప్రతిపాదనల మేరకు గురువారం మార్గదర్శకాలు విడుదల చేస్తూ ఆ శాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రక్రియకు అనుమతించారు. రోగుల తాకిడికి అనుగుణంగా తగిన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసుకునేలా మార్గదర్శకాలు రూపొందించారు. కోటికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క డీఎంహెచ్‌వో మాత్రమే ఉన్నారు.

హైదరాబాద్‌లో ఇక ఆరుగురు డీఎంహెచ్‌వోలు

పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రస్తుత, భవిష్యత్ వైద్య అవసరాలు గుర్తించిన ప్రభుత్వం అదనంగా 5 డీఎంహెచ్‌వోలను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. చార్మినార్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోన్ల వారీగా వీటి ఏర్పాటుకు అంగీకరించింది. దీంతో జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం ఆరుగురు డీఎంహెచ్‌వోలు ఉంటారు. కొత్త డీఎంహెచ్‌వోలను కలుపుకుంటే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 38 మంది ఉంటారు. ఇక రాష్ట్రంలో 636 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, అందులో సిబ్బంది ఏకరీతిగా లేదు. వైద్యాధికారి, పర్యవేక్షక సిబ్బంది పోస్టులు ఏకరీతిగా పంపిణీ జరగలేదు. దీంతో పీహెచ్‌సీల్లో సిబ్బంది ఏకరీతిగా ఉండేలా ప్రస్తుతం పునర్వ్యవస్థీకరించారు.


కొత్తగా 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

కొత్తగా ఏర్పడిన 40 మండలాల్లో పీహెచ్‌సీలు లేవు. వీటిలో 40 పీహెచ్‌సీలను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో 30 మండలాల్లో ఉన్న పీహెచ్‌సీలను ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ ప్రదేశాలలో ఔట్‌రీచ్ కార్యకలాపాలు సీహెచ్‌సీలతో నిర్వహిస్తున్నారు. అయితే అన్ని సీహెచ్‌సీలను తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు బదిలీ చేయడం వల్ల, ఔట్‌రీచ్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఈ ప్రదేశాలలో పీహెచ్‌సీల అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో 30 మండలాల్లో పీహెచ్‌సీలను మంజూరు చేశారు. రాష్ట్రంలోని 235 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లను బలోపేతం చేయడానికి, తగిన సిబ్బందిని నియమించాలని నిర్ణయించింది. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల సేవలు వినియోగించేందుకు వీలుగా, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లను టీవీవీపీ ఆసుపత్రుల పరిధిలోకి తీసుకొచ్చారు.

4,246 ఎంపీహెచ్ఏ పోస్టులు మంజూరు

1,712 పోస్టులను సూపర్‌న్యూమరరీ పోస్టులుగా మార్చారు. మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ) కేడర్ ఈ హేతుబద్ధీకరణలో కవర్ చేయలేదు. దాంతో పీహెచ్‌సీలు, ఇతర సంస్థలలో మంజూరు చేసిన ఎంపీహెచ్ఏ (ఎఫ్) పోస్టుల స్థానం మారదు. దాంతో 4,246 ఎంపీహెచ్ఏ (మహిళ) పోస్టులను మంజూరు చేశారు.

కమ్మలకు ప్రాధాన్యం కల్పించండి
ఠాక్రేకు కమ్మ రాజకీయ ఐక్య వేదిక వినతి




పరిశీలకుల సమావేశంలో మల్లు రవితో మాట్లాడుతున్న మాణిక్ రావ్ ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యమివ్వాలని కమ్మ రాజకీయ ఐక్య వేదిక విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో కమ్మ ఐక్య వేదిక ప్రతినిధులు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను కలసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీలోని కమ్మ నేతలకు తగిన అవకాశాలు కల్పించాలని అందులో కోరారు.

పరిశీలకుల భేటీ..: ఏఐసీసీ నియమించిన పార్లమెంటరీ పరిశీలకుల సమావేశం ఠాక్రే అధ్యక్షతన గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పరిశీలకులు దీపాదాస్‌మున్షీ, జ్యోతిమణి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటరీ స్థానాల వారీగా తమ పర్యటనల సందర్భంగా దృష్టికి వచ్చిన అంశాలను, ఆయా స్థానాల పరిధిలో పార్టీ పరిస్థితిని ఈ సందర్భంగా పరిశీలకులు ఠాక్రేకు వివరించారు. ఈ మేరకు పార్లమెంటు స్థానాల వారీగా ప్రత్యేక నివేదికను తయారుచేసి అధిష్టానానికి పంపాలని నిర్ణయించారు.

కేసీఆర్ చరిత్ర క్షమించలేని తప్పు చేశారు

- రాజకీయ విలువలకు నమ్మక ద్రోహం చేశారు
- మిత్రధర్మం మరిచిందెవరు?
- బీఆర్‌ఎస్‌పై సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని. చిత్రంలో చాడ

సాక్షి, హైదరాబాద్: పొత్తుల విషయంలో సీఎం కేసీఆర్ చరిత్ర క్షమించలేని తప్పు చేశారని, రాజకీయ విలువలకు భిన్నమైన నమ్మకద్రోహం చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. వారు తప్పుచేస్తే తామేమీ కుమిలిపోమని, సవాల్‌గా తీసుకొని కమ్యూనిస్టుల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. ఒక విధంగా కేసీఆర్ మంచే చేశారని, తామేమిటో గుర్తించేలా చేశారని, కమ్యూనిస్టు పార్టీని మరింత కసితో పటిష్టం చేసుకునేందుకు, ఎన్నికల్లో గెలిచేందుకు పనిచేస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ మగ్దూంభవన్‌లో రెండు రోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ, కార్యవర్గ సమావేశ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రజల వద్దకు వెళ్లి జరిగిన పరిణామాలను వివరిస్తామని, ప్రజలే సరైన తీర్పు ఇచ్చేలా చేస్తామన్నారు. ఇప్పటివరకు మిత్రపక్షంగా ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తూనే స్నేహపూర్వకంగా సలహాలిచ్చామని, ఇకపై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని చెప్పారు. ఇతర పార్టీల లాగా తాము వ్యక్తిగత దూషణలకు దిగబోమని, విధానపరంగానే విమర్శలు చేస్తామని తెలిపారు. కమ్యూనిస్టులు మిత్రధర్మం మరిచారని, బీఆర్ఎస్ ఆరోపిస్తుందని, అది దొంగే దొంగ అన్నట్టుగా ఉందని కూనంనేని విమర్శించారు. 2004, 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్, సీపీఐ ఒకే కూటమిలో ఉన్నా, 2004లో వెన్నుపోటు పొడుస్తూ సీపీఐకి కేటాయించిన నల్లగొండ ఎంపీ స్థానంలో సురవరం సుధాకర్‌రెడ్డి, ఇందుర్తిలో చాడ వెంకట్‌రెడ్డిలపై టీఆర్ఎస్ అభ్యర్థులను పోటీకి పెట్టిందని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు అటుఇటు పొత్తులు మారుతారని అన్నారని, 2004లో కాంగ్రెస్, 2009లో టీడీపీతో టీఆర్ఎస్ పొత్తు పెట్టుకోలేదా అని ప్రశ్నించారు. పైగా తెలంగాణవాదం కోసం సీపీఐ నాడు పరకాల ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌కు మద్దతిచ్చిందని, అప్పుడు కేవలం 1500 ఓట్లలోపే గెలిచిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఉపఎన్నికలో కూడా టీఆర్ఎస్‌కు సీపీఐ మద్దతునిచ్చిందని, అక్కడ స్వల్ప ఓట్లతో గెలిచారని గుర్తు చేశారు. టీఆర్ఎస్‌కు మొట్టమొదటి రాజ్యసభ స్థానంలో నిలిచిన ఆ పార్టీ సెక్రెటరీ జనరల్ కేశవరావు తనతో సహా సీపీఐకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల మద్దతుతో గెలిచారని కూనంనేని వివరించారు. ఖమ్మంలో తాతా మధుకు ఎమ్మెల్సీ అయ్యేందుకు కూడా సీపీఐ మద్దతునిచ్చిందన్నారు. మొన్న మునుగోడు ఉపఎన్నికలో కూడా బీజేపీని ఓడించేందుకే, చివరి వరకు మీతోనే ఉంటామని చెప్పినందుకే బీఆర్ఎస్‌కు మద్దతిచ్చామని తెలిపారు. ఆరోజు నుంచి ఈ రోజు వరకు నిమిషనిమిషానికి వైఖరి మార్చుకున్నది కేసీఆరే తప్ప తాము కాదని, వారి అవసరానికి మారారని విమర్శించారు.

మా ప్రభావం ఉంటుంది

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ జిల్లాలో తమ ప్రభావం ఉంటుందని కూనంనేని చెప్పారు. కేవలం సీపీఐకి పదివేల నుంచి 30 వేల ఓట్లు వచ్చే స్థానాలను లెక్క తీస్తే 35 – 40 స్థానాలు ఉన్నాయని వివరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని కూనంనేని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సాయుధ పోరాట కేంద్రాలకు బస్సుయాత్ర నిర్వహిస్తామన్నారు.

గవర్నర్‌తో సీఎం కేసీఆర్ చర్చలు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం, పెండింగ్ బిల్లుల ప్రస్తావన!
- సచివాలయంలో ప్రార్థన మందిరాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించిన సీఎం
- నేడు కార్యక్రమంలో పాల్గొననున్న గవర్నర్, సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌లో మంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం.. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో సీఎం కేసీఆర్ కొంతసేపు ఏకాంతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, పరస్పర సహాయ సహకారాలకు సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించినట్టు సమాచారం. కొంతకాలం నుంచి గవర్నర్, సీఎం మధ్య విభేదాలు నెలకొని ఉన్న నేపథ్యంలో.. ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య తిరిగి సుహృద్భావ సంబంధాలు నెలకొంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెండింగ్ బిల్లులు, ఎమ్మెల్సీల అంశంలో..

గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా కుర్ర సత్యనారాయణ, దాసోజు శ్రవణ్‌లను నామినేట్ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం గత నెల 31న సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీనితోపాటు ఇటీవల రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన 12 బిల్లులు రాజ్‌భవన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఉద్దేశించిన ఆర్టీసీ చట్ట సవరణ బిల్లుతోపాటు శాసనసభలో రెండోసారి ఆమోదించిన మరో నాలుగు బిల్లులు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీల నియామకం, పెండింగ్ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను సీఎం కేసీఆర్ కోరినట్టు తెలిసింది. దీంతో బిల్లులపై న్యాయశాఖ నుంచి సలహా అందాక నిర్ణయం తీసుకుంటానని గవర్నర్ వివరించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కేసీఆర్ శుక్రవారం సచివాలయ ప్రాంగణంలో నూతన దేవాలయం, మసీదు, చర్చిలను ప్రారంభించే కార్యక్రమానికి గవర్నర్ తమిళిసైని ప్రత్యేకంగా ఆహ్వానించగా.. పాల్గొనడానికి ఆమె అంగీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగే ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్‌తో పాటు గవర్నర్ తమిళిసై, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.

ఆ ముగ్గురూ తోడు దొంగలే

మోదీ, కేసీఆర్, ఒవైసీలపై రేవంత్ ఫైర్
- కేసీఆర్ ముఖ్యమంత్రా.. చింతమడక సర్పంచా?
- దక్షిణ తెలంగాణకు అన్యాయం చేశారంటూ ఆగ్రహం



మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్ రెడ్డి

వికారాబాద్/కొడంగల్: ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్, ఎంపీ ఒవైసీ ముగ్గురూ తోడు దొంగలేనని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విమర్శించారు. ట్రిపుల్ తలాక్, 370డీ రద్దు వంటి మోదీ తీసుకున్న నిర్ణయాలకు కేసీఆర్ అండగా నిలిచారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని గెలిపించాలని ఒవైసీ.. ముస్లింలకు ఎలా చెబుతాడని ప్రశ్నించారు. వికారాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇస్తే ఎంతో మంది యువత ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని ప్రారంభించి వైఎస్ రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కేసీఆర్ తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రాణహితకు పాతరేశాడన్నారు. రంగారెడ్డి జిల్లాకు, దక్షిణ తెలంగాణకు కేసీఆర్ తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కేసీఆర్ తన సొంత ఊరు బాగుంటే చాలనుకుంటున్నారని, ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రా లేక చింతమడకకు సర్పంచో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

ముదిరాజ్‌లకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు

రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని కేసీఆర్ పూర్తిగా గాలికి వదిలేశారని రేవంత్ విమర్శించారు. జనాభాలో మెజార్టీ శాతం ఉన్న ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ రాష్ట్రం మొత్తంలో ఒక్క అసెంబ్లీ టికెట్ కూడా ఇవ్వలేదని, మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే హాజరుకానున్న చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రజాగర్జన సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్ రుణం ఎన్నటికీ తీర్చలేనిది

కొడంగల్ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణానికి వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యులను కలిసి.. తనకు మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా మీడియాతో రేవంత్ మాట్లాడుతూ.. గొంతులో ప్రాణం ఉన్నంత వరకు కొడంగల్‌ను మరువను.. విడువను అని భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేస్తానని స్పష్టంచేశారు.

కాంగ్రెస్‌లో చేరిన మైత్రి గ్రూప్ చైర్మన్

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లాకు చెందిన మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం సాయంత్రం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. జైపాల్ పార్టీలో చేరిక సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆయన అనుచరులు గాంధీభవన్‌కు తరలివచ్చారు.

కొడంగల్ సీటుకు రేవంత్ దరఖాస్తు

- దరఖాస్తు చేసుకున్న భట్టి, పొన్నాల, జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ
- నాగార్జున సాగర్ కోసం జానా తనయుడి దరఖాస్తు
- 700 చేరుకున్న దరఖాస్తుల సంఖ్య..
- నేటితో ముగియనున్న గడువు

సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకుగాను కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం ఒక్కరోజే వివిధ నియోజకవర్గాల నుంచి 200 వరకు దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య 700కు చేరినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కాగా, ఈసారి ఎన్నికల్లో తనకు కొడంగల్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన కొడంగల్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆయన అనుచరులు, నియోజకవర్గ నేతలు గురువారం గాంధీభవన్‌కు వచ్చి రేవంత్ తరఫున దరఖాస్తు అందజేశారు. దీంతో రేవంత్ ఈసారి ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న దానికి తెరపడినట్టేనని గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి. మధిర టికెట్ కోసం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కూడా తన దరఖాస్తును అందజేశారు. సీఎల్పీ కార్యాలయ కార్యదర్శి పూర్ణబోధ శ్రీకాంత్.. భట్టి తరఫున గాంధీభవన్‌లో దరఖాస్తును సమర్పించారు. కాగా, జగిత్యాల నుంచి జీవన్‌రెడ్డి, జనగామ టికెట్‌కోసం పొన్నాల లక్ష్మయ్య, కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీ, నాగార్జున సాగర్ టికెట్ కోసం జానారెడ్డి తనయుడు రఘువీర్ రెడ్డిలు కూడా గురువారమే దరఖాస్తు చేసుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి టికెట్ ఇవ్వాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, మునుగోడు టికెట్ కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్‌నేత, కరీంనగర్ టికెట్ కోసం మాజీ అధికార ప్రతినిధి కల్వకుంట్ల రమ్యారావు కూడా దరఖాస్తులు సమర్పించారు. కాగా, కాంగ్రెస్ టికెట్లకోసం దరఖాస్తు చేసుకునే గడువు శుక్రవారంతో ముగియనుంది. ఎంపీ ఉత్తమ్‌తోపాటు సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు దామోదర రాజనర్సింహ, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లు చివరి రోజున దరఖాస్తులు సమర్పిస్తారని తెలిసింది.

బీఆర్‌ఎస్, బీజేపీ పరస్పర దాడులు

- రాళ్లు, కర్రలతో విరుచుకుపడిన నాయకులు, కార్యకర్తలు
- ఉద్రిక్తంగా మారిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి



దాడులు చేసుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు

హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కర్రలు, రాళ్లతో పరస్పర దాడులు చేసుకోవడంతో బీజేపీ కార్యకర్తలతోపాటు, పోలీసులకు గాయాలయ్యాయి. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ గురువారం హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు క్యాంపు కార్యాలయానికి వెళ్లే రోడ్లు ముళ్ల కంచెతో మూసివేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి నేతృత్వంలో పార్టీనేతలు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయ సమీపానికి చేరుకున్నారు. అయితే అప్పటికే బీఆర్ఎస్ కార్యకర్తలు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముళ్లకంచె వరకు చేరుకుని నినాదాలు చేస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు కర్రలతో దాడికి దిగడంతో, బీజేపీ కార్యకర్తలు ఆ కర్రలను లాక్కొని ప్రతి దాడికి దిగారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ల దాడికి పూనుకోగా బీజేపీ కార్యకర్తలు సైతం రాళ్లతో దాడి చేయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో పోలీసులతో పాటు, బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకి గాయాలు

అంతకు ముందు హనుమకొండ హంటర్ రోడ్డులోని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ క్యాంపు కార్యాలయం ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చీఫ్‌విప్ క్యాంపు కార్యాలయ ముట్టడికి వస్తున్న పద్మను పోలీసులు అడ్డుకున్న క్రమంలో జరిగిన తోపులాటలో ఆమె స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు పద్మను జుట్టు పట్టి లాగడంతో మెడకు, చేతికి గాయమైంది. అనంతరం పద్మతో పాటు నాయకులు, కార్యకర్తలను ధర్మాసాగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.







ఫ్యాషన్

కంచిపట్టు

వేడుకలా కట్టు

పట్టు కట్టుకుంటే...

● కట్టుకున్న చీర మనల్ని డామినేట్ చేయకూడదు. ఆ చీరలో మనం మరింత అందంగా వెలిగిపోవాలి. అందుకు బ్లౌజ్ డిజైన్ కూడా దోహదం చేస్తుంది ● టీనేజ్, యంగ్ అమ్మాయిలు బరువుగా ఉండే చీరలను ఇష్టపడరు. లైట్‌వెయిట్ చీరలు వారికి బాగా నప్పుతాయి ● ఏ పని అయినా చేతితో చేసిన దానికి మైండ్‌తో కనెక్షన్ ఉంటుంది. చేనేత చీరకు కూడా అంతే. చేనేత చీర పట్టుకున్నా, కట్టుకున్నా కలిగే ఆ ఫీల్‌ని ఆస్వాదించాల్సిందే ● రాబోయే తరాలకు మన సంప్రదాయాలను అందించాలంటే మన చేనేతలను కానుకగా ఇవ్వాలి. అప్పుడే మన చేనేతలు బతుకుతాయి ● పట్టు చీరలమీదకు ఉన్న ఆభరణాలన్నీ వేసుకోవాలనుకోకూడదు. ఏ అమ్మాయికైనా ఆమెలోని ఆత్మవిశ్వాసంతో ఉండే చిరునవ్వే సరైన జ్యువెలరీ. మనకు మనం ఎంత ప్రాముఖ్యం ఇచ్చుకుంటామో అదే ఆభరణం అవుతుంది. ఇక మెటల్ విషయానికి వస్తే.. బంగారు, కుందన్, టెంపుల్ జ్యువెలరీ కంచిపట్టు చీరల మీదకు బాగా నప్పుతాయి. అయితే, మెడ మీదుగా కూడా క్లోజ్‌గా ఉండే జ్యువెలరీ ధరిస్తే లుక్ మరింత బాగా కనిపిస్తుంది.

– భార్గవి కూనమ్, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

బామ్మల కాలం నాటి
పట్టు చీరల గొప్పతనం
ఇప్పుడూ కళ్లకు కట్టాలంటే
ఎవర్‌గ్రీన్‌గా నిలిచే
కంచిపట్టును పట్టుకోవాల్సిందే!
నాటి లుక్‌తో..
నేటి ప్యాటర్న్స్‌తో ఆకట్టుకునే
మనదైన వైభవం
సంప్రదాయ వేడుకల వేళ
నిండుగా, మెండుగా వెలిగిపోవాలంటే
కంచిపట్టును కమనీయంగా
కట్టుకోవాల్సిందే!
రాయల్ స్ఫూర్తిని రాబోయే తరాలకు
మరింత భద్రంగా అందించాల్సిందే!!

ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఎన్నో ఫ్యాషన్స్ వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, మన దక్షిణ భారతాన మాత్రం ఎప్పుడైనా వేడుక అనగానే కంజీవరం చీరలు మైండ్‌లో మెదులుతాయి. దేవాలయాలకు వెళ్లినప్పుడు, ఇంట్లో పూజల వేళ, ఇతర శుభకార్యాలకు పట్టు చీర కట్టుకోవడం సంప్రదాయంగా భావిస్తుంటాం. వేడుకల సమయాల్లో వృద్ధి చెందే పాజిటివ్‌నెస్‌ను మన శరీరం–మైండ్ గ్రహిస్తుంది. వేడుకను మరింత కళగా మార్చేస్తుంది. నాణ్యమైన జరీతో డిజైన్ చేసిన ఈ చీరలు మన బామ్మల కాలం నాటి లుక్‌లో కనిపిస్తుంటాయి. రంగుల కాంబినేషన్స్, పల్లూ, అంచు డిజైన్లలో నేటి కాలానికి అనుగుణంగా చిన్న చిన్న మార్పులు జత చేశారు.







పెంపకం

రాజూ బంటూ అమ్మే

చదరంగంలో
పావులు కదపాలంటే
బుద్ధికి బృహస్పతిలా ఉండాలి.
కాని ఆ బృహస్పతిని కని, పెంచడానికి
అమ్మ అమ్మలా ఉంటే చాలు.
అమ్మకు ఎత్తుకు పై ఎత్తు తెలియదు ప్రేమ తప్ప.
తన బిడ్డను రాజు చేయాలనే తపన తప్ప.
అందుకు తాను బంటుగా మారేందుకు
సిద్ధం కావడం తప్ప.
చెస్ వరల్డ్ కప్ 2023లో సంచలనంగా నిలిచిన
ఆర్. ప్రజ్ఞానందకు రాజుగా, బంటుగా ఉంటూ
తీర్చిదిద్దిన తల్లి నాగలక్ష్మి కథ ఇది.

అజర్‌బైజాన్‌లో జరిగిన 'చెస్ వరల్డ్ కప్ 2023' ఫైనల్స్‌లో ఒక అడుగు దూరంలో టైటిల్ కోల్పోయాడు 18 ఏళ్ల ప్రజ్ఞానంద. అతడు ఓడినా గెలిచినట్టే. ప్రపంచ దేశాల నుంచి 206 మంది గ్రాండ్ మాస్టర్లు పాల్గొన్న ఈ భారీ వరల్డ్ కప్‌లో ఇంత చిన్న వయసులో రన్నరప్‌గా నిలవడం సామాన్యం కాదు. కాకలు తీరిన యోధులను ఓడించి మరీ ఈ స్థానాన్ని దక్కించుకోవడమే కాదు దాదాపు 66 లక్షల రూపాయల ప్రైజ్ మనీ గెలుచుకున్నాడు. భారతదేశం గర్వించేలా చెస్‌లో వెలుగులీనుతున్న ఈ కుర్రవాడి విజయం వెనుక అతని తల్లి నాగలక్ష్మి ఉంది. అందుకే చెస్ అభిమానులే కాదు దేశదేశాల గ్రాండ్ మాస్టర్లు కూడా ప్రజ్ఞానందకు వెన్నంటి వుంటూ తోడ్పాటునందిస్తున్న నాగలక్ష్మిని ప్రశంసిస్తున్నారు. ఆమెను చూసి ముచ్చట పడుతున్నారు.


● తల్లి నాగలక్ష్మి

టీవీ అలవాటు మాన్పించడానికి

చెన్నైలో స్థిరపడ్డ తెలుగు కుటుంబం రమేశ్ బాబు, నాగలక్ష్మిలకు కుమార్తె వైశాలి పుట్టాక ప్రజ్ఞానంద పుట్టాడు. ప్రజ్ఞానందకు నాలుగున్నర ఏళ్లు ఉన్నప్పుడు వైశాలి ఎక్కువగా టీవీ చూస్తున్నదని కూతురి ధ్యాస మళ్లించడానికి చెస్ బోర్డు తెచ్చి పెట్టింది నాగలక్ష్మి. వైశాలి చెస్ ఆడుతుంటే చిన్నారి ప్రజ్ఞా కూడా ఆడటం మొదలెట్టాడు. అతడు చెస్ నేర్చుకున్న పద్ధతి, అంత చిన్న వయసులో గెలుస్తున్న తీరు చూస్తే అతడు బాల మేధావి అని తల్లికి అర్థమైంది. మరోవైపు వైశాలి కూడా చెస్‌లో రాణించసాగింది. ఇక నాగలక్ష్మి తన జీవితాన్ని తన ఇద్దరు పిల్లల ఆట కోసం అంకితం చేయాలని నిశ్చయించుకుంది.

అనుక్షణం వెన్నంటే

ప్రజ్ఞానంద ఏడేళ్ల వయసుకే అండర్ సెవెన్‌లో జాతీయ టైటిల్ గెలిచాడు. పదేళ్ల వయసుకు ఇంటర్నేషనల్ ప్లేయర్ అయ్యాడు. 12 ఏళ్లకు గ్రాండ్ మాస్టర్ అయ్యాడు. అప్పుడైనా ఇప్పుడైనా ఉదయం నుంచి రాత్రి వరకూ చెన్నైలో వేరే దేశంలో అతని వెన్నంటే ఉంటుంది నాగలక్ష్మి. 'ప్రజ్ఞా ఏ పోటీకి వచ్చినా తోడుండే నాగలక్ష్మి ఒక మూల కూచుని దేవుణ్ణి ప్రార్థిస్తూ కూచోవడం మా అందరికీ అలవాటైన దృశ్యం' అంటాడు త్యాగరాజన్ అనే కోచ్. ఇతను చెస్‌లో ప్రజ్ఞాకు మొదటి పాఠాలు నేర్పాడు. 'ఉదయం పది నుంచి సాయంత్రం 7 వరకూ చెస్ పాఠాలు నడిచేవి. ఆ తర్వాత రెండు మూడు గంటల హోమ్‌వర్క్ ఇచ్చేవాణ్ణి. ప్రజ్ఞానంద ఇల్లు చేరాక ఆ హోమ్‌వర్క్ అయ్యేవరకు నాగలక్ష్మి తోడు ఉండేదట. రాత్రి పదికి ఇంటి పనులు మొదలెట్టుకుని మళ్లీ ఉదయం ఆరు గంటలకు కొడుకు కోసం నిద్ర లేచేదట' అని తెలిపాడు అతడు.


● కొడుకు ప్రజ్ఞానందతో నాగలక్ష్మి

చెస్ తెలియని అమ్మ

కొడుకు చెస్‌లో ప్రపంచ విజేత స్థాయి ఆటగాడైనా నాగలక్ష్మికి ఇప్పటి వరకూ చెస్ ఆడటం తెలియదు. 'మా అబ్బాయిని చూసుకోవడమే నాకు సరిపోతుంది. ఆట ఎక్కడ నేర్చుకోను' అంటుందామె నవ్వుతూ. ప్రజ్ఞానంద శాకాహారి. బయటి ఆహారం తినడు. అందుకని ఏ ఊరికి ఆట కోసం బయలుదేరినా, విదేశాలకు ప్రయాణం కట్టినా నాగలక్ష్మి చేసే మొదటిపని లగేజ్‌లో ఒక ఇండక్షన్ స్టవ్వు, కుక్కరు, బియ్యం, మసాలాలు పెట్టుకోవడం. 'ఎక్కడకు వెళ్లినా వాడికి వేడివేడి అన్నం, రసం చేసి పెడతాను. మైండ్ హాయిగా ఉండి బాగా ఆడాలంటే నచ్చిన ఆహారం తీసుకోవాలి' అంటుంది నాగలక్ష్మి. చెస్ వరల్డ్ కప్ సెమీ ఫైనల్స్‌లో అమెరికా దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానాను ఓడించి ప్రజ్ఞానంద ఫైనల్స్‌కు చేరినప్పుడు నాగలక్ష్మి కళ్లల్లో కనిపించి మెరుపును ఎవరో ఫొటో తీస్తే ఆ ఫొటో వైరల్ అయ్యింది. 'మావాడు ఆట ఆడేంతసేపు వాడి కళ్లల్లో కళ్లు పెట్టి చూడను. ఎందుకంటే వాడి కళ్లు చూస్తే వాడి ఆట ఎలా సాగుతున్నదో నాకు తెలిసిపోతుంది. నాకు తెలిసిపోయినట్టుగా వాడికి తెలియడం నాకు ఇష్టం ఉండదు' అంటుంది నాగలక్ష్మి.

కార్ పార్కింగ్‌లో బంధువులు

కూతురు, కొడుకు ఇంట్లో చెస్ ప్రాక్టీస్ చేస్తుంటే ఇంటిని వీలైనంత నిశ్శబ్దంగా ఉంచుతుంది నాగలక్ష్మి. వాళ్లింట్లో టీవీ పెట్టే ఎంతో కాలమైపోతూ వుంది. 'మా ఇంటికి బంధువులొచ్చినా, స్నేహితులొచ్చినా కింద కార్ పార్కింగ్ దగ్గరే పలకరించి పంపేస్తాను... పిల్లలు డిస్టర్బ్ కాకూడదని' అంటుందామె. అందుకే సెమీ ఫైనల్స్ గెలిచిన ప్రజ్ఞాను అభినందిస్తూ రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ 'నీకు మీ అమ్మ ఇచ్చే మద్దతు ప్రత్యేకమైనది' అని ట్వీట్ చేశాడు.

నాగలక్ష్మి లాంటి తల్లి ప్రేమకు పిల్లలు ఎప్పుడూ బంట్లే. వారి మనసులో ఆ తల్లి ఎప్పుడూ రాజే.

వంటిల్లు

తియ్యటి అనురాగ బంధం

ఆడపడచులు అన్నదమ్ముల క్షేమాన్ని కోరుతూ ఎంతో ప్రేమానురాగాలతో వారి ముంజేతికి రాఖీ కట్టి, నోరు తీపి చేసే సంప్రదాయం రాకీ పండగది.
ప్రతి ఏటా జరుపుకునే ఈ వేడుకకు ముందుగానే వచ్చేసింది తియ్యటి వంటిల్లు మీకోసం ...





ట్రఫెల్స్

కావలసినవి: బాదం పప్పు – కప్పు; ఎండు కొబ్బరి తురుము – ముప్పావు కప్పు; కర్జూరాలు – పదిహేను; బాదం బటర్ – ముప్పావు కప్పు; డార్క్ చాక్లెట్ ముక్కలు – పావు కప్పు; కొబ్బరి నూనె – అరటీస్పూను; బరకగా దంచిన పిస్తా పలుకులు – పావు కప్పు; బాదం పలుకులు – పావు కప్పు; నల్లని పొరతీసి తురిమిన ఎండు కొబ్బరి – పావు కప్పు; స్ట్రాబెరీ పొడి – పావు కప్పు.

తయారీ: ● కర్జూరాలను ఒకసారి కడిగి పదిహేను నిమిషాల పాటు వేడినీటిలో నానబెట్టుకోవాలి ● బాదం పప్పు, ఎండు కొబ్బరి తురుమును దోరగా వేయించి మిక్సీజార్‌లో వేయాలి ● నానబెట్టిన కర్జూరాలను నీరు లేకుండా తీసి మిక్సీజార్‌లో వేసి గ్రైండ్ చేయాలి ● సగం నలిగిన మిశ్రమంలో బాదం బటర్ వేసి గ్రైండ్ చేయాలి ● అవసరాన్ని బట్టి రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు గ్రైండ్ అయిన మిశ్రమాన్ని బయటకు తీసిన నచ్చిన పరిమాణంలో లడ్డుల్లా చుట్టుకోవాలి ● బాదం, పిస్తా పలుకులను పొడిచేసి పక్కన పెట్టుకోవాలి ● చాక్లెట్‌ముక్కల్లో కొబ్బరి నూనెవేసి అవెన్‌లో 45 సెకన్లు ఉంచాలి. చాక్లెట్ కరిగిన తరువాత పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు ముందుగా చేసుకున్న లడ్డులాను ఒక్కొక్కటి ఎండుకొబ్బరి తురుము, పిస్తా, బాదం, స్ట్రాబెరీ పొడులు, చాక్లెట్ మిశ్రమంలో ముంచి అద్దుకుంటే ట్రఫెల్స్ రెడీ. రిఫ్రిజిరేటర్‌లో నిల్వచేసుకుంటే ఇవి పదిరోజులపాటు తాజాగా ఉంటాయి.



చమ్ చమ్

కావలసినవి
వెన్నతీయని ఆవుపాలు – నాలుగు కప్పులు; నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు; మైదా – టేబుల్ స్పూను; చక్కెర – ఒకటిన్నర కప్పులు; నీళ్లు – ఎనిమిది కప్పులు; యాలకులు – రెండు; నెయ్యి – టీస్పూను; పాలు – పావు కప్పు; క్రీమ్ – రెండు టేబుల్ స్పూన్లు; పాలపొడి – అరకప్పు; కుంకుమ పువ్వు కలిపిన పాలు – రెండు టేబుల్ స్పూన్లు; చక్కెర పొడి –టేబుల్ స్పూను; కొబ్బరి తురుము – పావు కప్పు; ట్యూటీఫ్రూటీ –మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● పాలను చక్కగా కాయాలి. కాచిన పాలల్లో నిమ్మరసం వేసి విరగగొట్టి.. పన్నీర్‌ను వేరు చేసి పక్కనపెట్టుకోవాలి ● అరగంట తరువాత పన్నీర్ మిశ్రమంలో మైదా వేసి ముద్దలా కలపాలి ● ముద్దను పొడవాటి రోల్స్‌లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు పంచదారలో ఎనిమిది కప్పులు నీళ్లుపోసి 10 నిమిషాలు మరిగించాలి ● తరువాత యాలకులు, పన్నీర్ రోల్స్‌ను వేసి పదిహేను నిమిషాలు మరిగించి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి, పావు కప్పు పాలు పోసి మరిగించాలి ● రెండు నిమిషాల తరువాత క్రీమ్ వేసి కలపాలి. మిశ్రమం చిక్కబడిన తరువాత కుంకుమ పువ్వు కలిపిన పాలు, పంచదార పొడి వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి ● మిశ్రమం బాగా చిక్కబడినప్పుడు దించేస్తే కోవా రెడీ ● ఇప్పుడు సుగర్ సిరప్‌లో ఉడికించిన రోల్స్‌ను బయటకు తీసి మధ్యలో నిలువుగా గాటు పెట్టి చల్లారిన కోవా మిశ్రమాన్ని స్టఫ్ చేసి గాటుని మూసేయాలి ● ఈ రోల్స్‌కు కొబ్బరి తురుము అద్ది, పైన టూటీఫ్రూటీపెట్టాలి ● ఇలా అన్నీ రోల్స్‌ను చేస్తే చమ్‌చమ్ రెడీ.



నంఖాతై

కావలసినవి: మైదా – రెండున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; గడ్డకట్టిన నెయ్యి – ఒకటింబావు కప్పులు; పంచదార పొడి – కప్పు; సూజీ రవ్వ – అరకప్పు; యాలకులపొడి –టీస్పూను; బాదంపొడి – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తాపొడి – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తాపలుకులు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● మైదా, వంటసోడాను కలిపి జల్లెడ పట్టుకుని పక్కనపెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో నెయ్యి, పంచదార పొడి వేసి పదిహేను నిమిషాల పాటు చక్కగా కలపాలి ● పంచదార చక్కగా కరిగి, మిశ్రమం దగ్గర పడినప్పుడు సూజీ రవ్వ, మైదా, బాదం, పిస్తా, యాలకులపొడి వేసి కలపాలి ● పిండిమిశ్రమాన్ని మెత్తని ముద్దలా కలపాలి. అవసరాన్ని బట్టి రెండు టీస్పూన్లు పాలుపోసి ముద్దచేయాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● పదిహేను నిమిషాల తరువాత బయటకు తీసి గుండ్రని ఉండలుగా చుట్టుకోవాలి ● ఈ ఉండలను నచ్చిన పరిమాణంలో మందంగా బిస్కెట్‌లా ఒత్తుకోవాలి ● ఒకదానికి ఒకటి అంటుకోకుండా ఒక్కో బిస్కెట్‌ను బేకింగ్‌ట్రేలో పెట్టి, పిస్తా పలుకులతో గార్నిష్ చేయాలి ● గార్నిష్ అయిన ట్రేను అవెన్‌లో ఇరవై నుంచి ఇరవై ఐదు నిమిషాలు ఉంచి తీసేస్తే వేడివేడి నంఖాతై రెడీ ● పేరిన నెయ్యితో చేస్తేనే ఈ నంఖాతై లు రుచిగా వస్తాయి.



క్యారట్ లడ్డు

కావలసినవి: క్యారట్ తురుము – రెండు కప్పులు; ఎండు కొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – కప్పు; బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; రోజ్ వాటర్ – అరటీస్పూను; యాలకుల పొడి – అరటీస్పూను; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చికొబ్బరి తురుమ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● రెండు స్పూన్ల నెయ్యివేసి కొబ్బరి తురుముని ఐదు నిమిషాలపాటు దోరగా వేయించాలి ● కొబ్బరి వేగిన తరువాత క్యారట్ తురుము వేసి మీడియం మంట మీద పదినిమిషాలు వేయించాలి ● ఇప్పుడు బాదం పలుకులు, కండెన్స్‌డ్ మిల్క్ వేసి కలపాలి ● ఐదు నిమిషాల తరువాత రోజ్ వాటర్. యాలకులపొడి వేసి సన్నని మంట మీద తిప్పుతూ మగ్గనివ్వాలి ● మిశ్రమం చిక్కబడిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● ఇప్పుడు చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని చల్లారిన మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుని,పైన కొద్దిగా పచ్చికొబ్బరితో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి.



రసగుల్లా ఐస్‌క్రీమ్

కావలసినవి: వెనీలా ఐస్‌క్రీమ్ – నాలుగు కప్పులు; రసగుల్లాలు – ఎనిమిది; స్ట్రాబెరీ – ఆరు; బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● గడ్డకట్టిన ఐస్‌క్రీమ్‌ను రిఫ్రిజిరేటర్ నుంచి తీసి పదినిమిషాలు బయటపెట్టాలి ● రసగుల్లాలను గట్టిగా పిండి సిరప్‌ను తీసేయాలి. పూర్తిగా పిండకూడదు. కొద్దిగా సిరప్ తేమ ఉండేలా పిండాలి ● పిండిన రసగుల్లాలను చిన్నచిన్న ముక్కలు చేయాలి ● స్ట్రాబెర్రీలను కూడా కడిగి సన్నగా తరగాలి ● ఇప్పుడు ఐస్‌క్రీమ్‌లో రసగుల్లా ముక్కలు వేసి కలపాలి ● దీనిలో స్ట్రాబెరీ ముక్కలు, బాదం పలుకులు వేసి మరోసారి చక్కగా కలపాలి ● ఈ ఐస్ క్రీమ్ మిశ్రమాన్ని గిన్నెలో వేసి మూతపెట్టి రాత్రంతా లేదా కనీసం నాలుగు గంటల పాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● రిఫ్రిజిరేటర్‌లో నుంచి తీసిన పదిహేను నిమిషాల తరువాత రసగుల్లా ఐస్‌క్రీమ్‌ను సర్వ్‌చేసుకోవాలి.



తెలుగు సినిమా... ఎత్తర జెండా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్ఆర్ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్ఆర్ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్ఆర్ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.



విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్దమ్)



ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)



కృతీసనన్ (మిమీ)

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) – కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్ఆర్ఆర్ – ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్ఆర్ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్ఆర్ఆర్ – కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్ఆర్ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్ఆర్ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్దమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ – మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్దమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ – సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ. ఉత్కర్షిణి వశిష్ఠ (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా – ఉత్కర్షిణి వశిష్ఠ (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్దమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో – గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్–ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్ఆర్ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జిలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్దమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప). ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. – చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్ఆర్ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
– రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. – కీరవాణి

★★★


ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. – ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. – అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ సిక్సర్





కీరవాణి
శ్రీనివాస్ మోహనన్
కాలభైరవ
ప్రేమ్ రక్షిత్
కింగ్ సాల్మన్



దేవిశ్రీ ప్రసాద్



చంద్రబోస్



పురుషోత్తమాచార్యులు



బుచ్చిబాబు



కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిర కాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
– వై. రవిశంకర్, నిర్మాత

ఇదొక చరిత్ర
– నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
– నవీన్ యెర్నేని, నిర్మాత

"నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి" అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. "రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం" అన్నారు.
– బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.


ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతీశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.



'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబియార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను – ఎంఎం శ్రీలేఖ

"ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం" అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ – "మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను" అన్నారు.



స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	181	65,252
నిఫ్టీ ▽	57	19,387

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్‌	14,945	▽	201
డోజోన్స్‌	34,241	▽	232
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,334	△	13
డాక్స్‌	15,621	▽	107
షాంఘై	3,082	△	4
నికాయ్‌	32,287	△	227

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (24 క్యారట్‌)	58,734	△	214
బంగారం (22 క్యారట్‌)	58,499	△	213
వెండి (కిలో)	73,667	△	988

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

3 రోజుల ర్యాలీకి బ్రేక్



తొలుత లాభాలు.. తుదకు నష్టాలు

- సెన్సెక్స్ 181, నిఫ్టీ 57 పాయింట్లు డౌన్
- 65,252–19,387 వద్ద ముగింపు
- తొలుత సెన్సెక్స్ 481 పాయింట్లు అప్

ముంబై: వరుసగా నాలుగో రోజు హుషారుగా ప్రారంభమైన దేశీ స్టాక్‌ మార్కెట్లు మిడ్‌ సెషన్‌ నుంచీ దెబ్బతిన్నాయి. కొనుగోళ్ల స్థానే అమ్మకాలు ఊపందుకోవడంతో లాభాలను వీడి నష్టపోయాయి. చివరికి సెన్సెక్స్ 181 పాయింట్లు క్షీణించి 65,252 వద్ద నిలిచింది. నిఫ్టీ 57 పాయింట్లు తగ్గి 19,387 వద్ద ముగిసింది. సెన్సెక్స్ తొలుత 481 పాయింట్లవరకూ జంప్‌చేసి 65,914కు చేరింది. చివర్లో 65,182 వరకూ పతనమైంది. నిఫ్టీ సైతం 19,584 వద్ద గరిష్టాన్నీ, 19,369 కనిష్టాన్నీ తాకింది. ప్రపంచ మార్కెట్ల ప్రోత్సాహంతో ఇండెక్సులు తొలుత లాభపడినప్పటికీ తదుపరి లాభాల స్వీకరణ ప్రభావం చూపింది.

ఐటీ లాభాల్లో..

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆయిల్, హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్‌ రంగాలు 0.6 శాతం చొప్పున నీరసించగా.. ఐటీ ఇదేస్థాయిలో బలపడింది. నిఫ్టీ దిగ్గజాలలో ఆర్‌ఐఎల్, దివీస్, పవర్‌గ్రిడ్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, టాటా స్టీల్, గ్రాసిమ్, ఎల్‌అండ్‌టీ, బజాజ్‌ ఆటో, ఐషర్, సిప్లా, హెచ్‌సీఎల్‌ టెక్‌ 2–1 శాతం మధ్య నీరసించాయి. అయితే బీపీసీఎల్, ఏషియన్‌ పెయింట్స్, ఇండస్‌ఇండ్, ఇన్ఫోసిస్, బ్రిటానియా 2–1 % మధ్య ఎగశాయి.

చిన్న షేర్లు ప్లస్‌లో

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్‌ క్యాప్స్‌ స్వల్పలాభాలతో నిలదొక్కుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,890 డీలాపడగా.. 1,731 లాభపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 1,525 కోట్లు, దేశీ ఫండ్స్‌ మరింత అధికంగా రూ. 5,797 కోట్ల చొప్పున ఇన్వెస్ట్‌ చేశాయి.

ఏరోఫ్లెక్స్‌ సూపర్‌హిట్‌



స్టెయిన్‌లెస్‌ స్టీల్‌ ఫ్లెక్సిబుల్‌ హోస్‌ తయారీ కంపెనీ ఏరోఫ్లెక్స్‌ ఇండస్ట్రీస్‌ లిమిటెడ్‌ పబ్లిక్‌ ఇష్యూ సూపర్‌ సక్సెస్‌ను సాధించింది. చివరిరోజు గురువారాని(24)కల్లా ఇష్యూకి ఏకంగా 97 రెట్లు అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 162 కోట్ల విలువైన ఈక్విటీ జారీతోపాటు మరో 1.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఇందుకు షేరుకి రూ. 102–108 ధరల శ్రేణిని ప్రకటించింది. తద్వారా రూ. 351 కోట్లు సమకూర్చుకుంది.

నాలుగో రోజూ 'జియో' పతనం



వరుసగా లోయర్‌ సర్క్యూట్లను తాకుతున్న ఎన్‌బీఎఫ్‌సీ.. జియో ఫైనాన్షియల్‌ కౌంటర్లో నాలుగో రోజూ అమ్మకాలదే పైచేయిగా నిలిచింది. దీంతో బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో మరోసారి 5 శాతం పతనమై లోయర్‌ సర్క్యూట్లను తాకింది. బీఎస్‌ఈలో రూ. 11 క్షీణించి రూ. 216 వద్ద, ఎన్‌ఎస్‌ఈలోనూ రూ. 11 తగ్గి రూ. 214 దిగువన ముగిసింది. దీంతో గత నాలుగు రోజుల్లో కంపెనీ మార్కెట్‌ విలువ దాదాపు రూ. 22,777 కోట్లు ఆవిరైంది. తాజాగా రూ. 1,37,167 కోట్లకు చేరింది. మరోపక్క మాతృ సంస్థ రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ షేరు సైతం దాదాపు 2 శాతం నష్టంతో రూ. 2,479 దిగువన నిలిచింది.



చంద్రయాన్‌ షేర్లు భళా

రెండో రోజూ మెరుపులు

చంద్రయాన్‌–3 మిషన్‌ విజయం నేపథ్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్‌ షేర్లకు డిమాండ్‌ కొనసాగింది. చంద్రయాన్‌కు పరికరాలు అందించిన కంపెనీల షేర్లు వరుసగా రెండో రోజు భారీ లాభాలు ఆర్జించాయి. సెంటమ్‌ ఎలక్ట్రానిక్స్, పరస్‌ డిఫెన్స్, ఎంటార్‌ టెక్‌ తొలుత 20–10 శాతం మధ్య దూసుకెళ్లాయి. చివరికి ఎన్‌ఎస్‌ఈలో సెంటమ్‌ 8 శాతం, పరస్‌ 7 శాతం, ఎంటార్‌ 4 శాతం, భారత్‌ ఫోర్జ్‌ 0.6 శాతం చొప్పున లాభపడి ముగిశాయి. బుధవారం సైతం ఈ కౌంటర్లు జోరు చూపిన సంగతి తెలిసిందే. అయితే ఆస్ట్రా మైక్రోవేవ్, మిధాని, బీహెచ్‌ఈఎల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఏఎల్‌ తొలుత లాభపడి చివర్లో నీరసించాయి.

కోఫోర్జ్‌ నుంచి బీపీఈఏ ఔట్‌

26.63 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్‌ లిమిటెడ్‌(గతంలో నిట్‌ టెక్నాలజీస్‌) నుంచి పీఈ సంస్థ బీపీఈఏ(బేరింగ్‌ పీఈ ఏషియా) ఈక్విటీ తాజాగా వైదొలగింది. అనుబంధ సంస్థ హల్ట్‌ బీవీ ద్వారా ఐటీ కంపెనీలోగల మొత్తం 26.63 శాతం వాటాను రూ. 7,683.5 కోట్లకు విక్రయించింది. ఓపెన్‌ మార్కెట్‌ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 4,722.15 సగటు ధరలో మొత్తం 1,62,71,260 షేర్లను అమ్మివేసింది. వాటాను కొనుగోలు చేసిన మ్యూచువల్‌ ఫండ్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ, ఏబీ సన్‌ లైఫ్, కొటక్‌ మహీంద్రా, ఎస్‌బీఐతోపాటు.. మోర్గాన్‌ స్టాన్లీ ఏషియా సింగపూర్, సొసైటీ జనరాలి, ఐసీఐసీఐ ప్రులైఫ్, స్మాల్‌క్యాప్‌ వరల్డ్‌ ఫండ్‌ ఉన్నాయి. ఈ వార్తల నేపథ్యంలో కోఫోర్జ్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 9.4 శాతం దూసుకెళ్లి రూ. 5,375 వద్ద ముగిసింది.

యూపీఐ లైట్‌ 'పరిమితి' పెంపు



ముంబై: యూపీఐ లైట్‌ వాలెట్‌ వినియోగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా రిజర్వ్‌ బ్యాంక్‌ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రతి ఆఫ్‌లైన్‌ చెల్లింపు లావాదేవీ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 200 నుంచి రూ. 500కు పెంచింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై చిన్న మొత్తాల చెల్లింపును వేగవంతం చేసేందుకు 2022 సెప్టెంబర్‌లో యూపీఐ లైట్‌ను ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్‌ అంతంత మాత్రంగా ఉండే ప్రాంతాలు, అలాగే అసలు నెట్‌ ఉండని ప్రదేశాల్లో కూడా రిటైల్‌ డిజిటల్‌ చెల్లింపు లావాదేవీల నిర్వహణకు ఇది ఉపయోగపడుతుంది. అలాగే, బ్యాంకుల ప్రాసెసింగ్‌ వ్యవస్థలపై కూడా భారం తగ్గించడం వల్ల లావాదేవీలు విఫలమయ్యే అవకాశాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. ప్రస్తుతం దీని ద్వారా నెలకు 1 కోటికి పైగా లావాదేవీలు జరుగుతున్నాయి.

ఇన్ఫోసిస్‌ బ్రాండ్‌ అంబాసిడర్‌గా రఫేల్‌ నాదల్‌



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్‌కు, ఆ సంస్థకే చెందిన డిజిటల్‌ ఇన్నోవేషన్‌కు బ్రాండ్‌ అంబాసిడర్‌గా అంతర్జాతీయ టెన్నిస్‌ స్టార్‌ రఫేల్‌ నాదల్‌ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈ భాగస్వామ్యం అమల్లో ఉంటుంది. ఈ సందర్భంగా ఇన్ఫీ, నాదల్‌ కోచింగ్‌ టీమ్‌ కలిసి కృత్రిమ మేధ ఆధారిత మ్యాచ్‌ అనాలిసిస్‌ టూల్‌ను అభివృద్ధి చేయనున్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. వ్యక్తులు, వ్యాపార దిగ్గజాలు ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మల్చుకుంటూ, ముందుకు ఎలా సాగాలనేది తెలుసుకునేందుకు నాదల్‌ చక్కని నిదర్శనమని సంస్థ సీఈవో సలిల్‌ పరేఖ్‌ తెలిపారు. ఇన్ఫోసిస్‌ డిజిటల్‌ రంగంలో తనకున్న అనుభవంతో టెన్నిస్‌ క్రీడకు కూడా సేవలు అందించే తీరు తనకు నచ్చిందని నాదల్‌ పేర్కొన్నారు.

టీవీఎస్‌ ఎక్స్‌ ఎలక్ట్రిక్‌ క్రాస్‌ఓవర్‌

ధర రూ. 2.50 లక్షలు



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: వాహన తయారీ కంపెనీ టీవీఎస్‌ మోటార్‌ తాజాగా ప్రీమియం ఎలక్ట్రిక్‌ క్రాస్‌ ఓవర్‌ టీవీఎస్‌ ఎక్స్‌ ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్‌ ధర రూ.2,49,990 ఉంది. ప్రస్తుతం దేశంలో ఇదే ఖరీదైన ఎలక్ట్రిక్‌ స్కూటర్‌ కావడం విశేషం. టీవీఎస్‌ ఎక్స్‌లెటన్‌ ప్లాట్‌ఫామ్‌పై తయారైంది. 4.44 కిలోవాట్‌ అవర్‌ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. గంటకు 40 కిలోమీటర్ల వేగాన్ని 2.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ట వేగం గంటకు 105 కిలోమీటర్లు. భారత్‌లో యాంటీ లాక్‌ బ్రేకింగ్‌ సిస్టమ్‌తో రూపుదిద్దుకున్న తొలి ఈ–స్కూటర్‌ ఇదే. 10.25 అంగుళాల హెచ్‌డీ ప్లస్‌ టీఎఫ్‌టీ టచ్‌స్క్రీన్‌ ఏర్పాటు ఉంది. రివర్స్‌ అసిస్ట్, క్రూజ్‌ కంట్రోల్, హిల్‌ హోల్డ్‌ ఫంక్షన్, 19 లీటర్ల స్టోరేజ్‌ స్పేస్‌ వంటి హంగులు ఉన్నాయి. 2023 నవంబర్‌ నుంచి డెలివరీలు ఉంటాయి.

స్వల్పంగా పెరిగిన టెలికం యూజర్లు



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య జూన్‌లో స్వల్పంగా పెరిగి 117.38 కోట్లకు చేరింది. రిలయన్స్‌ జియోకి 22.7 లక్షల మంది, భారతీ ఎయిర్‌టెల్‌కు 14 లక్షల మంది యూజర్లు కొత్తగా జతయ్యారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ వెల్లడించిన గణాంకాల ప్రకారం మే ఆఖరు నాటికి టెలిఫోన్‌ సబ్‌స్క్రయిబర్స్‌ సంఖ్య 117.25 కోట్లుగా ఉంది. మరోవైపు, వొడాఫోన్‌ ఐడియా (వీఐఎల్), ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్‌ యూజర్లు తగ్గారు. బీఎస్‌ఎన్‌ఎల్‌ సబ్‌స్క్రయిబర్స్‌ 18.7 లక్షల మంది, వీఐఎల్‌ 12.8 లక్షల మంది, ఎంటీఎన్‌ఎల్‌ 1.52 లక్షల మంది యూజర్లను కోల్పోయాయి. జియో 2.08 లక్షలు, భారతీ ఎయిర్‌టెల్‌ 1.34 లక్షలు, వీ–కాన్‌ మొబైల్‌ అండ్‌ ఇన్‌ఫ్రా 13,100 కలెక్షన్లు నమోదు చేసుకున్నాయి.

కార్పొరేట్లకు 'హిండెన్‌బర్గ్‌' తరహా షాక్‌!

నిర్దిష్ట కంపెనీల అవకతవకలు బయటపెట్టనున్న ఓసీసీఆర్‌పీ

న్యూఢిల్లీ: కొద్ది నెలల క్రితం పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్‌ను కుదిపేసిన హిండెన్‌బర్గ్‌ రీసెర్చ్‌ తరహాలో మరో సంస్థ దేశీ కార్పొరేట్‌ గ్రూప్‌ల అవకతవకలను బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. రాక్‌ఫెలర్‌ బ్రదర్స్‌ ఫండ్, జార్జ్‌ సొరోస్‌ వంటి దిగ్గజాల దన్ను గల ఓసీసీఆర్‌పీ (ఆర్గనైజ్డ్‌ క్రైమ్‌ అండ్‌ కరప్షన్‌ రిపోర్టింగ్‌ ప్రాజెక్టు) సన్నద్ధమవుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. యూరప్, ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌ అమెరికా వ్యాప్తంగా ఉన్న 24 లాభాపేక్షరహిత ఇన్వెస్టిగేటివ్‌ సంస్థలు కలిసి ఈ పరిశోధనాత్మక రిపోర్టింగ్‌ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినట్లు వివరించాయి. అవి త్వరలోనే ఏదైనా నివేదిక లేదా వరుస కథనాలను ప్రచురించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ముందుగా ఒక నిర్దిష్ట కార్పొరేట్‌ కంపెనీలో విదేశీ ఫండ్స్‌ ఇన్వెస్ట్‌ చేయడానికి సంబంధించిన అవకతవకలను బయటపెట్టవచ్చని సంబంధిత వర్గాలు వివరించాయి. అయితే సదరు కార్పొరేట్‌ సంస్థ పేరును మాత్రం వెల్లడించలేదు. 2006లో ఏర్పాటైన ఓసీసీఆర్‌పీ వెబ్‌సైట్‌ ప్రకారం సంఘటిత నేరాలను శోధించడం సంస్థ ప్రత్యేకత. ఇన్వెస్టర్‌ జార్జ్‌ సొరోస్‌కి చెందిన ఓపెన్‌ సొసైటీ ఫౌండేషన్స్, ఫోర్డ్‌ ఫౌండేషన్, ఓక్‌ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్‌ బ్రదర్స్‌ ఫండ్‌ మొదలైనవి దీనికి నిధులు సమకూరుస్తున్నాయి.

రూపాయి మూడో రోజూ అప్‌

16 పైసలు లాభం; 82.56 వద్ద క్లోజింగ్‌



ముంబై: క్రూడాయిల్‌ రేట్లు తగ్గుతుండటం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడంతో రూపాయి వరుసగా మూడో రోజూ బలపడింది. డాలర్‌తో పోలిస్తే 16 పైసలు పెరిగి 82.56 వద్ద ముగిసింది. దీంతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్‌ కనిష్ట స్థాయి 83.11 నుంచి మూడు సెషన్లలో 57 పైసలు పెరిగినట్లయింది. బ్రిక్స్‌ సదస్సు, అమెరికా ఫెడ్‌ రిజర్వ్‌ చైర్మన్‌ పావెల్‌ వడ్డీ రేట్ల తీరు నేపథ్యంలో డాలర్‌ కదలికలు పరిమితంగా ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

25-8-2023	
విశాఖ	480–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్‌ ధర (డజను)	72.00
24-8-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	435–00
వరంగల్‌	437–00
రిటైల్‌ ధర	4.95

సాక్షి స్పోర్ట్స్‌



భారత్‌కు మరో ఒలింపిక్‌ బెర్త్‌

ప్రపంచ షూటింగ్‌ చాంపియన్‌షిప్‌ మహిళల ట్రాప్‌ ఈవెంట్‌లో భారత షూటర్‌ రాజేశ్వరి కుమారి ఐదో స్థానంలో నిలిచింది. అజర్‌బైజాన్‌ రాజధాని బాకులో జరుగుతున్న ఈ టోర్నీలో ఆరుగురు షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో రాజేశ్వరి 19 పాయింట్లు సాధించింది. రాజేశ్వరి ప్రదర్శనతో భారత్‌కు ఈ విభాగంలో పారిస్‌ ఒలింపిక్స్‌ బెర్త్‌ ఖరారైంది. ఇప్పటివరకు షూటింగ్‌ క్రీడాంశంలో భారత్‌కు ఏడు ఒలింపిక్‌ బెర్త్‌లు లభించాయి.

మూడో రౌండ్‌లో అంకిత రైనా



యూఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ క్వాలిఫయింగ్‌ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్‌ అంకిత రైనా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. న్యూయార్క్‌లో గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ 182వ ర్యాంకర్‌ అంకిత 6–4, 6–3తో ప్రపంచ 114వ ర్యాంకర్‌ అలియోనా బొల్సోవా (స్పెయిన్‌)పై గెలిచింది.

క్వార్టర్స్‌లో సాత్విక్‌ జోడీ



కోపెన్‌హాగెన్‌ (డెన్మార్క్‌): ప్రపంచ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ పురుషుల డబుల్స్‌ విభాగంలో సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి (భారత్‌) జోడీ క్వార్టర్‌ ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్‌ ఫైనల్లో సాత్విక్‌–చిరాగ్‌ ద్వయం 21–15, 19–21, 21–9తో లియో రాలీ కార్నండో–డానియెల్‌ మార్టిన్‌ (ఇండోనేసియా) జోడీపై నెగ్గింది. మహిళల డబుల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ (భారత్‌) జోడీ 14–21, 9–21తో టాప్‌ సీడ్‌ చెన్‌ క్వింగ్‌ చెన్‌–జియా యి ఫ్యాన్‌ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో తొమ్మిదో సీడ్‌ ప్రణయ్‌ (భారత్‌) 21–18, 15–21, 21–19తో 2021 ప్రపంచ చాంపియన్‌ లో కియాన్‌ యూ (సింగపూర్‌)పై సంచలన విజయం సాధించి క్వార్టర్‌ ఫైనల్‌ చేరగా... లక్ష్య సేన్‌ (భారత్‌) 14–21, 21–16, 13–21తో మూడో సీడ్‌ కున్లావుత్‌ వితిద్‌సర్న్‌ (థాయ్‌లాండ్‌) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌ ఫైనల్లో పారుల్‌



బుడాపెస్ట్‌ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌ ఈవెంట్‌లో భారత అథ్లెట్‌ పారుల్‌ చౌధరీ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన హీట్స్‌లో పారుల్‌ ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌ బెర్త్‌ను దక్కించుకుంది. రెండో హీట్‌లో పోటీపడ్డ పారుల్‌ తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. పారుల్‌ 9 నిమిషాల 24.29 సెకన్లలో గమ్యానికి చేరి ఐదో స్థానంలో నిలిచింది. మొత్తం మూడు హీట్స్‌ నిర్వహించారు. ప్రతి హీట్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత పొందారు. ఫైనల్‌ ఆదివారం జరుగుతుంది.

మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌ ఈవెంట్‌ ఫైనల్లో భారత అథ్లెట్‌ జెస్విన్‌ ఆల్డ్రిన్‌ నిరాశపరిచాడు. 12 మంది పాల్గొన్న ఫైనల్లో జెస్విన్‌ తొలి రెండు ప్రయత్నాల్లో ఫౌల్‌ చేశాడు. మూడో ప్రయత్నంలో 7.77 మీటర్ల దూరం దూకి 11వ స్థానంలో నిలిచాడు.

టైటిల్‌ కార్ల్‌సన్‌కు... ప్రశంసలు ప్రజ్ఞానందకు

ప్రపంచకప్‌ చెస్‌ టోర్నీ రన్నరప్‌గా భారత గ్రాండ్‌మాస్టర్‌ • తొలిసారి ప్రపంచకప్‌ టైటిల్‌ నెగ్గిన నార్వే చెస్‌ దిగ్గజం

గత దశాబ్దకాలంగా పురుషుల చెస్‌లో మాగ్నస్‌ కార్ల్‌సన్‌కు ఎదురులేదు. ఈ నార్వే సూపర్‌స్టార్‌ క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్‌ ఫార్మాట్‌లలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. చెస్‌లో అత్యుత్తమ రేటింగ్‌ కూడా అందుకున్నాడు. అయితే అగ్రశ్రేణి చెస్‌ ఆటగాళ్ల మధ్య రెండేళ్లకోసారి నాకౌట్‌ పద్ధతిలో జరిగే ప్రపంచకప్‌ టోర్నీలో మాత్రం కార్ల్‌సన్‌ శిఖరాన నిలువలేకపోయాడు. ఈసారి మాత్రం నిలకడైన ఆటతీరుతో కార్ల్‌సన్‌ తన కెరీర్‌లో తొలిసారి ప్రపంచకప్‌ టైటిల్‌ను సాధించాడు. కార్ల్‌సన్‌కు టైటిల్‌ దక్కినా అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం భారత యువ గ్రాండ్‌మాస్టర్‌ ప్రజ్ఞానందనే. తన అసమాన పోరాటపటిమతో... ఊహకందని ఎత్తులతో... తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ... తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల ఈ టీనేజర్‌ రెండో ప్రయత్నంలోనే ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరాడు. కార్ల్‌సన్‌కు ఆద్యంతం గట్టిపోటీనిచ్చాడు. అనుభవలేమితో తుది మెట్టుపై తడబడ్డా... భవిష్యత్‌లో ప్రపంచ చాంపియన్‌ అయ్యే లక్షణాలు తనలో పుష్కలంగా ఉన్నాయని ప్రజ్ఞానంద చాటుకున్నాడు.



బాకు (అజర్‌బైజాన్‌): ఇన్నాళ్లూ భారత చెస్‌ అంటే ముందుగా విశ్వనాథన్‌ ఆనంద్‌ పేరు గుర్తుకొచ్చేది. కానీ ఇక నుంచి ఆనంద్‌తోపాటు తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద పేరు కూడా అభిమానుల మదిలో మెదులుతుంది. గత 25 రోజులుగా అజర్‌బైజాన్‌ రాజధాని బాకులో జరిగిన ప్రపంచకప్‌ టోర్నీలో ఆరంభం నుంచి మేటి ఆటగాళ్లను మట్టికరిపించిన ఈ తమిళనాడు కుర్రాడు తుదిపోరులో నార్వే దిగ్గజం మాగ్నస్‌ కార్ల్‌సన్‌ను బోల్తా కొట్టించలేకపోయాడు. నిర్ణీత రెండు క్లాసికల్‌ గేముల్లో ప్రజ్ఞానంద నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొని 'డ్రా'తో సంతృప్తి పడ్డ 32 ఏళ్ల కార్ల్‌సన్‌ టైబ్రేక్‌లోని ర్యాపిడ్‌ గేముల్లో తన అనుభవాన్నంతా ఉపయోగించి గట్టెక్కాడు. తొలి గేమ్‌లో నల్ల పావులతో ఆడిన కార్ల్‌సన్‌ 47 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొంది... రెండో గేమ్‌లో తెల్ల పావులతో ఆడి 22 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని ఓవరాల్‌గా 2.5–1.5తో విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన కార్ల్‌సన్‌ 156 మంది ఆటగాళ్ల మధ్య నాకౌట్‌ పద్ధతిలో నిర్వహించే ప్రపంచకప్‌ టోర్నీలో మాత్రం తొలిసారి విజేతగా నిలిచాడు. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా) 3–1తో నిజాత్‌ అబసోవ్‌ (అజర్‌బైజాన్‌)పై గెలిచాడు.

విజేతగా నిలిచిన కార్ల్‌సన్‌కు 1,10,000 డాలర్లు (రూ. 90 లక్షలు), రన్నరప్‌ ప్రజ్ఞానందకు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షలు), మూడో స్థానం పొందిన కరువానాకు 60 వేల డాలర్లు (రూ. 49 లక్షలు)... నాలుగో స్థానంలో నిలిచిన అబసోవ్‌కు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఈ ప్రపంచకప్‌ టోర్నీలో టాప్‌–3లో నిలిచిన ముగ్గురు ప్లేయర్లు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్‌ టోర్నీకి అర్హత సాధించారు. తనకు సరైన పోటీనిచ్చేవారు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఆసక్తి లేదని గత ఏడాది ప్రకటించిన కార్ల్‌సన్‌ క్యాండిడేట్‌ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. దాంతో రన్నరప్‌ ప్రజ్ఞానంద, కరువానా, అబసోవ్‌ క్యాండిడేట్‌ టోర్నీకి అర్హత పొందారు. క్యాండిడేట్‌ టోర్నీ విజేత ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌ డింగ్‌ లిరెన్‌ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్‌ మ్యాచ్‌ ఆడతారు.

ఒక్కో రౌండ్‌ దాటి...

2019 ప్రపంచకప్‌లో తొలిసారి బరిలోకి దిగిన ప్రజ్ఞానంద నాలుగో రౌండ్‌లో వెనుదిరిగాడు. ఈసారి మాత్రం ఈ తమిళనాడు కుర్రాడు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. విశ్వనాథన్‌ ఆనంద్‌ తర్వాత ఈ టోర్నీ చరిత్రలో ఫైనల్‌ చేరిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌ నుంచి ఓపెన్‌ విభాగంలో పది మంది గ్రాండ్‌మాస్టర్లు పోటీపడగా ఒకరు ఫైనల్‌కు, మరో ముగ్గురు క్వార్టర్‌ ఫైనల్‌కు చేరడం విశేషం.

- 2690 రేటింగ్‌తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానందకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది.
- రెండో రౌండ్‌లో 2599 రేటింగ్‌ ఉన్న ఫ్రాన్స్‌ గ్రాండ్‌మాస్టర్‌ మాక్సిమి లగార్డె (ఫ్రాన్స్‌)పై 1.5–0.5తో గెలిచాడు.
- మూడో రౌండ్‌లో చెక్‌ రిపబ్లిక్‌ గ్రాండ్‌మాస్టర్, 2689 రేటింగ్‌ ఉన్న డేవిడ్‌ నవారా (చెక్‌ రిపబ్లిక్‌)ను ప్రజ్ఞానంద ఓడించాడు.
- నాలుగో రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రపంచ రెండో ర్యాంకర్, 2787 రేటింగ్‌ ఉన్న హికారు నకమురా (అమెరికా)పై టైబ్రేక్‌లో 3–1తో సంచలన విజయం సాధించాడు.
- ఐదో రౌండ్‌లో 1.5–0.5తో ఫెరెంక్‌ బెర్కెస్‌ (హంగేరి)పై గెలిచాడు.
- క్వార్టర్‌ ఫైనల్లో ప్రజ్ఞానంద భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్, 2710 రేటింగ్‌ ఉన్న ఇరిగేశి అర్జున్‌పై టైబ్రేక్‌లో 5–4తో సంచలన విజయం సాధించాడు.
- ప్రపంచ మూడో ర్యాంకర్, 2782 రేటింగ్‌ ఉన్న ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో ప్రజ్ఞానంద టైబ్రేక్‌లో 3.5–2.5తో గెలుపొంది ఫైనల్‌ చేరాడు.

భారత రెజ్లింగ్‌ సమాఖ్యపై వేటు

న్యూఢిల్లీ: ఇటీవల అత్యంత వివాదాస్పద క్రీడా సమాఖ్యగా వార్తల్లో నిలుస్తున్న భారత రెజ్లింగ్‌ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)పై మరో పిడుగు పడింది! 45 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగించకుండా పదేపదే వాయిదా వేయడంతో సమాఖ్యపై యునైటెడ్‌ రెజ్లింగ్‌ వరల్డ్‌ (యూడబ్ల్యూడబ్ల్యూ) సస్పెన్షన్‌ వేటు వేసింది. ప్రస్తుతం డబ్ల్యూఎఫ్‌ఐ రోజువారీ వ్యవహారాలను అడ్‌హక్‌ కమిటీ నిర్వహిస్తోంది. తాజా సస్పెన్షన్‌తో భారత రెజ్లర్లకు పెద్ద చిక్కే వచ్చిపడింది. వాళ్లు పోటీపడేందుకు ఇబ్బంది లేకపోయినా ... అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పతకం గెలిస్తే మన త్రివర్ణ పతాకం ఎగురదు. భారత రెజ్లర్లు యూడబ్ల్యూడబ్ల్యూ జెండా కింద పోటీ పడాల్సి ఉంటుంది. వచ్చే నెల 16 నుంచి జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా బరిలోకి దిగుతారు. వాస్తవానికి గత జూలై 11న డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలు జరగాలి. అయితే గువాహటి హైకోర్టు స్టే విధించడంతో వాయిదా పడ్డాయి. అనంతరం ఆగస్టు 7కు మరో వాయిదా! అంతలోనే మళ్లీ 12కు జరిపారు. సరిగ్గా ఎన్నికలకు ఒక రోజు ముందు పంజాబ్‌–హరియాణా హైకోర్టు స్టే కారణంగా 12న జరగాల్సిన ఎన్నికలు కూడా వాయిదా పడ్డాయి.

ఫిట్‌నెస్‌పైనే దృష్టి

భారత క్రికెటర్లకు ప్రత్యేక శిబిరం



బెంగళూరు: ఆసియా కప్‌కు ముందు ఆరు రోజుల స్వల్పకాలిక శిక్షణా శిబిరంలో భారత క్రికెటర్లు చెమటోడుస్తున్నారు. జాతీయ క్రికెట్‌ అకాడమీ (ఎన్‌సీఏ)లో జరుగుతున్న ఈ శిబిరంలో ఫిట్‌నెస్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. జట్టు సభ్యులందరికీ సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కీలకమైన 'యో–యో టెస్టు' కూడా నిర్వహించనున్నారు. బీసీసీఐ 16.5 పాయింట్లను యో–యో టెస్టు ఉత్తీర్ణత మార్క్‌గా గుర్తించింది. గురువారం కెప్టెన్‌ రోహిత్‌ శర్మ, కోహ్లి, హార్దిక్‌ పాండ్యాలు ఈ టెస్టులో పాల్గొన్నట్లు సమాచారం. వీరి ఫలితాలను అధికారికంగా ప్రకటించకపోయినా... 17.2 పాయింట్లతో తాను పాస్‌ అయినట్లు కోహ్లి సోషల్‌ మీడియాలో వెల్లడించాడు. అయితే అందరి దృష్టీ కేఎల్‌ రాహుల్‌పైనే నిలిచింది . గాయం నుంచి కోలుకొని ఆసియా కప్‌ జట్టులోకి ఎంపికైనా, అతను కొంత 'అసౌకర్యం'తో ఉన్నట్లు సెలక్టర్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడం అతనికి ఎంతో ముఖ్యం. ఐర్లాండ్‌ పర్యటన నుంచి ఇంకా భారత్‌కు చేరుకోని బుమ్రా, ప్రసిధ్‌ కృష్ణ, సామ్సన్, తిలక్‌ మినహా మిగతా జట్టు సభ్యులంతా ఎన్‌సీఏలో ఉన్నారు.

పాకిస్తాన్‌దే సిరీస్‌

హంబన్‌టోటా: అఫ్గానిస్తాన్‌తో రెండో వన్డేలో ఒక వికెట్‌ తేడాతో నెగ్గిన పాకిస్తాన్‌ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఒక మ్యాచ్‌ మిగిలి ఉండగానే 2–0తో సొంతం చేసుకుంది. రెండో వన్డేలో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్‌ 50 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. ఓపెనర్‌ గుర్బాజ్‌ (151; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. ఓపెనర్‌ ఇబ్రహీమ్‌ జద్రాన్‌ (80; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి తొలి వికెట్‌కు 227 పరుగులు జోడించాడు. అనంతరం పాకిస్తాన్‌ 49.5 ఓవర్లలో 9 వికెట్లకు 302 పరుగులు చేసి గెలిచింది. ఇమామ్‌ ఉల్‌ హఖ్‌ (91; 4 ఫోర్లు), షాదాబ్‌ ఖాన్‌ (48; 3 ఫోర్లు, 1 సిక్స్‌), బాబర్‌ ఆజమ్‌ (53; 6 ఫోర్లు) రాణించారు.



Divya®

చంద్రునిపై విజయం సాధించిన తరుణంలో,

శాస్త్రీయ పరిశోధన ప్రాముఖ్యతను దేశం గ్రహిస్తోంది.
అంతరిక్ష శాస్త్రవేత్తలు సాధించిన గొప్ప విజయంలానే మేము కూడా ప్రపంచ ప్రఖ్యాత రీసెర్చ్ జర్నల్స్‌లో
3000 రీసెర్చ్ ప్రోటోకాల్స్‌ను మరియు 500కు పైగా రీసెర్చ్ పేపర్స్‌ను ప్రచురించడం ద్వారా
అతి పెద్ద విజయాన్ని సాధించాం మరియు డబ్ల్యూహెచ్‌వో మరియు
యావత్ వైద్య వ్యవస్థ చేయలేనిదానిని మేము చేసి చూపాము.

ఆర్థరైటిస్, సర్వైకల్, స్పాండిలైటిస్, స్లిప్‌డిస్క్, సయాటికా
మరియు ఇతర వాతదోష సంబంధిత వ్యాధుల కోసం
పరిశోధన & రుజువు ఆధారిత ఆయుర్వేద ఔషధం

దెబ్బతిన్న మృదులాస్థిని పునరుత్పత్తి చేస్తుంది, రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది, క్షీణించిన
కణాలను పునరుజ్జీవింపజేస్తుంది మరియు నొప్పి కారకాలను నియంత్రిస్తుంది.



మోకాళ్లనొప్పి, నడుమునొప్పి, భుజంనొప్పి, మెడనొప్పి మరియు
తుంటి మరియు కీళ్లనొప్పుల కోసం అత్యంత ప్రయోజనకరమైనది.

38 అమూల్యమైన మూలికలతో తయారు చేయబడింది

బృహత్వాత్ చింతామణి, పునర్నవాది మండూర్, శుద్ధ గుగ్గులు,
స్వర్ణభస్మ మొదలైనవంటి శక్తివంతమైన మూలికల శ్రేష్ఠత



మా అన్ని ఔషధాలు భారతదేశవ్యాప్తంగా ఉన్న పతంజలి స్టోర్స్, ప్రముఖ మెడికల్, ఆయుర్వేదిక్ మరియు ఇతర స్టోర్స్‌లో లభిస్తాయి.
పైన పేర్కొన్న ఔషధం యొక్క ఉపయోగం సూచనాత్మక స్వభావంగలది మరియు ఇది పైన పేర్కొన్న వ్యాధుల నియంత్రణలో చికిత్స ఎంపిక.
సెల్ఫ్-మెడికేషన్ నివారించండి మరియు ఎల్లప్పుడూ వైద్య పర్యవేక్షణలోనే ఔషధాలను తీసుకోండి.

31 YEARS OF TRUST

MBU MOHAN BABU UNIVERSITY
DREAM. BELIEVE. ACHIEVE

MBA at MBU



MASTER OF BUSINESS ADMINISTRATION
2-Year Full Time Program

Collaboration with Industries for Internship
pwc | BYJU'S | toppr | Justdial | Muthoot Finance | HETERO | square yards | tcs | HGS | fincare | SHRIRAM Life Insurance | DMart

SAP Certification in Material Manangemt/ Finance and Accounting — SAP

Placement offers from Top Multinational Companies
HCL | LARSEN & TOUBRO | Berger | ICICI Bank | HDFC BANK | SBI | Karur Vysya Bank | BAJAJ Allianz

Average CTC **4.5 Lacs**
Highest CTC **8 Lacs**

Rankings and Accreditations* for Group Institutions
nirf 2023 Ranked 150-200 | nirf-Innovation 51-100 | NAAC A+ | NBA Accredited Programs | AICTE - CII Survey Platinum Category | SII GREEN RANKINGS 2023 Listed in Top 20 Universities in India

*All the accreditations and recognitions are for SVET colleges now known as Mohan Babu University

To apply call on **946 9465 946** or visit **http://admissions.mbu.asia/**
Campus - Sree Sainath Nagar, Tirupati, Andhra Pradesh - 517102 | Email: admissions@mbu.asia











TANISHQ PRESENTS
RIVAAH
WEDDING JEWELLERY

స్మార్ట్ ఎంపిక చేయండి — TANISHQ ఎక్స్‌ఛేంజ్

ఉచిత బంగారు నాణెం*
ఆగస్టు 23 నుండి 26 వరకు ఆఫర్.

20% వరకు తగ్గింపు*

100%*

To locate your nearest store and know more on 6366920017. Buy online at tanishq.co.in or Download our App *Conditions apply.

New Showroom at **Warangal:** Near Ambedkar Statue, Depot X Road, Road, Nakkala Gutta, Hanamkonda. Tel: 0870 295 6913;
Showrooms at **Nizamabad:** Beside Axis Bank, Hyderabad Road. Tel: 084622 25999; **Khammam:** VVC Complex, Wyra Road. Tel: 087422 23111;
Karimnagar: City Centre Mall, I B Guest House Circle, C.V.R.N Road. Tel: 0878 224 5670

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.